www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
నూతన సంవత్సర శుభాకాంక్షలు


సిడ్నీ హార్బర్ బ్రిడ్జి వద్ద నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బాణసంచా వెలుగుజిలుగులు

గురువారం | 1-1-2026 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 296 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి రా.10:23 తదుపరి చతుర్దశి, నక్షత్రం: రోహిణి రా.10:48 తదుపరి మృగశిర, వర్జ్యం: మ.3:42-5:07, తె.3:45-5:10, దుర్ముహూర్తం: ఉ.10:28-11:12, మ.2:52-3:36, అమృతఘడియలు: రా.7:57-9:22, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:49, సూర్యాస్తమయం: 5:48 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


రంపచోడవరంలో కలెక్టరు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్, ఎమ్మెల్యే శిరీషాదేవి తదితరులు
మార్కాపురంలో ప్రారంభమైన జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం

కొత్త ఏడాదిలో.. కొంగొత్తగా!

రెండు కొత్త జిల్లాలకు శ్రీకారం

వివిధ వర్గాలకు మరిన్ని రాయితీలు

ట్రైనీ పోలీసులకు భారీ ఊరట

స్టైపెండ్ రూ.4,500 నుంచి 12 వేలకు పెంపు

ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై వడ్డీ మాఫీ

11,479 మంది ఎస్సీ యువతకు ప్రయోజనం

సందడిగా మార్కాపురం, పోలవరం జిల్లాల కార్యాలయాలు ప్రారంభం

ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎస్పీలకు బాధ్యతలు

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల జోష్

కొత్త ఏడాది కానుకగా.. ఒకరోజు ముందే భరోసా పెన్షన్లు

14

కొత్త సంవత్సరం వేళ ప్రజలకు

సర్కారు గిఫ్ట్

4,497 కోట్ల ట్రూఅప్ చార్జీల నుంచి ఊరట

ఆ భారం మొత్తం భరించడానికి ప్రభుత్వం సంసిద్ధత



ఏపీఈఆర్‌సీకి రాసిన అధికారులు

2019-24 మధ్య వినియోగించిన విద్యుత్‌పై ఉపశమనం

ఇప్పటికే గత ఏడాది సెప్టెంబరులో రూ.923 కోట్ల ట్రూ డౌన్‌తో రికార్డు

కరెంటు చార్జీలు పెంచబోమన్న మాటను నిలబెట్టుకుంటున్న సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం నూతన సంవత్సర వేళ భారీ కానుకే ప్రకటించింది. విద్యుత్ వినియోగదారులకు భారీ ఉపశమనమిచ్చే కబురు అందించింది. సుమారు రూ.4,497.89 కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని జనంపై మోపకుండా.. ఆ మొత్తం తానే భరించేందుకు సిద్ధమైంది. గత సెప్టెంబరులో రూ.923 కోట్లను ట్రూడౌన్ చేసి రికార్డు సృష్టించిన ప్రభుత్వం.. తాజాగా మరోసారి వినియోగదారులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ 2024 ఎన్నికల్లో చంద్రబాబు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదిన్నర కాలంలో ఒక్క రూపాయి కరెంటు భారాన్ని కూడా ప్రజలపై వేయలేదు. పైగా 2025 నవంబరు నుంచి ట్రూడౌన్‌లో భాగంగా వినియోగదారులు ఉపయోగించే ఒక్కో యూనిట్‌పై 13 పైసలు తగ్గింపు ఇస్తూ వస్తున్నారు. తాజాగా సుమారు రూ.4,498 కోట్ల భారాన్ని

మిగతా 14వ పేజీలో...

మరో గ్రీన్‌ఫీల్డ్ హైవేతో ఏపీ అనుసంధానం

నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ మధ్య రూ.19,142 కోట్లతో 6 వరుసల హైవే 13

సోలాపూర్-చెన్నై రహదారితో దీనికి లింకు.. కర్నూలు, కడప, రేణిగుంట మీదుగా ప్రయాణం

వసతి గృహాల్లో పిల్లల మరణాలు

చిన్న విషయం కాదు



పరిహారం చెల్లింపులో నిర్దిష్ట విధానం ఉందా?

ఆ వివరాలు సమర్పించండి.. హైకోర్టు ఆదేశం

బాలబాలికల మరణాలపై ఆందోళన

హెల్త్ క్యాంపుల నిర్వహణకు కార్యాచరణ రూపొందించండి.. ఆ నివేదిక ఇవ్వండి

వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌కు ధర్మాసనం నిర్దేశం

సంరక్షించడంలో అధికారులు విఫలం: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల వసతి గృహాలలో ఉంటున్న బాలబాలికలు వివిధ అనారోగ్య కారణాలతో మరణించడంపై హైకోర్టు ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. 2016 నుంచి ఇప్పటి వరకు 45 మరణాలు సంభవించాయని, ఇదేమీ చిన్న వ్యవహారం కాదని వ్యాఖ్యానించింది. వసతి గృహాలలో ఉంటున్న బాలబాలికలను సంరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత అధికారులదేనని తేల్చిచెప్పింది. హాస్టళ్లలో ఉంటున్న పిల్లలు జ్వరం, కడుపునొప్పి, కంటి, బ్లడ్ ఇన్‌ఫెక్షన్లతో మరణించారని చెబుతున్న అధికారులు.. ముందు జాగ్రత్త చర్యలు, వైద్యం అందించడంలో దారుణంగా

మిగతా 14వ పేజీలో...

పేదల బియ్యంతో మిల్లర్ల మాయ

సీఎంఆర్ ప్రక్రియలో యథేచ్ఛగా దోపిడీ

రాష్ట్రంలో కొందరు రైసు మిల్లర్లు పేదల నోట్లో మట్టి కొడుతున్నారు. ప్రతినెలా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసి, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం ఇస్తున్న మేలు రకం ధాన్యాన్ని ముందే ఎక్కువ ధరకు అమ్మేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. తర్వాత తిరిగ్గా తక్కువ ధరకు వచ్చే, తినడానికి పనికిరాని నాసిరకం బియ్యాన్ని 'సీఎంఆర్' కింద ప్రభుత్వానికి అంటగడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలో తాజాగా వెలుగుచూసిన అక్రమాల బాగోతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం ఎక్కువకు అమ్మకం

పీడీఎస్‌కు పురుగులతో కూడిన నాసిరకం బియ్యం

పాత రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేసినట్లు నిర్ధారణ

తూర్పుగోదావరి జిల్లాలో వెలుగుచూసిన బాగోతం

ఉండ్రాజవరంలో 80 టన్నుల బియ్యం తిరస్కరణ

ఈ వ్యవహారంపై ఏలూరు ఎఫ్‌సీఐ డీఎం నివేదిక

ఆ మిల్లుల ఓనర్లకు జేసీ షోకాజ్ నోటీసు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు (ప్రొక్యూర్‌మెంట్) చేపట్టకముందు, రైసు మిల్లులను నడపలేక అనేకమంది యజమానులు దివాలా తీశారు. 'సీఎంఆర్' కార్యకలాపాలు మొదలయ్యాక వారే ఇప్పుడు కోట్లకు పడగలెత్తారు. రాజకీయాలు, రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్స్ తదితర రంగాల్లో రారాజుల్లా వెలుగొందుతూ ప్రభుత్వాలనే శాసించే స్థాయికి

మిగతా 14వ పేజీలో...


13
విజయవాడ కోర్టు వద్ద కుటుంబ సభ్యులతో నకిలీ మద్యం కేసు నిందితుడు జోగి రమేశ్

అద్దేపల్లి నుంచి జోగికి నెలకు రూ.5 లక్షల ముడుపులు!

రమేశ్ చిన్నాన్న ఆధ్వర్యంలో ఖాతాలు

2023-25 మధ్య 7 వేల ఫోన్ కాల్స్

నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌పై 100 పేజీల సప్లిమెంటరీ-2 చార్జిషీటు

మొత్తం 13 మందిపై అభియోగాలు

ఒక్కో డెలివరీకి రూ. 150!



కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించే వేళ వర్కర్లకు ఇస్తాం: జొమాటో

ఈ సమయంలో రూ.2 వేల వరకు ప్రోత్సాహకాలు: స్విగ్గీ 2

వేతనాలు పెంచాలని సమ్మెకు సిద్ధమైన గిగ్ వర్కర్లు.. అయినా ఒక్క రోజు పెంపుతో సంస్థల సరి

భారత్- పాక్ ఘర్షణను

మేమే ఆపాం

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ ప్రకటన

తీవ్రంగా ఖండించిన భారత్ 2

ఏఐ.. క్వాంటమ్ టెక్నాలజీ.. 2026 హీరోలు!





- ఇప్పటికే మనందరి జీవితాల్లోకీ చొచ్చుకొచ్చిన ఏఐ
- వైద్యం, పరిశోధన ఐటీ రంగాల్లో కృత్రిమ మేధ జోరు
- కొత్త సంవత్సరంలో మరిన్ని రంగాల్లో ఏఐ కీలకపాత్ర
- 'క్వాంటమ్' ఫలాలు కూడా అందరికీ అందుబాటులోకి

క్లౌడ్ సేవల తరహాలోనే క్వాంటమ్ కంప్యూటింగ్..

డేటా, ఫొటోలు దాచుకోవాలంటే ఒకప్పుడు మనం హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌ల వంటివాటిని కొనేవాళ్లం. ఇప్పుడా బాధ లేదు. ఎంచక్కా క్లౌడ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇదే కోవలో.. మిలియన్ల కొద్దీ డాలర్ల విలువ చేసే క్వాంటమ్ కంప్యూటర్లు కూడా అలా 'యాజ్ ఏ సర్వీస్' (సేవ) రూపంలో ఈ కొత్త ఏడాది అందుబాటులోకి వస్తాయని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం క్లౌడ్ సేవలు అందిస్తున్న ఐబీఎం, అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటివి క్వాంటమ్ కంప్యూటింగ్‌ను కూడా 'పే యాజ్ యు గో యాక్సెస్' విధానంలో సామాన్యులకు చేరువ చేస్తాయని వారు జోస్యం చెబుతున్నారు.

"కొత్తకు ఎపుడూ స్వాగతం.. పాతకో వందనం" ..కొత్త ఏడాది రాగానే తెలుగువారిలో చాలా మందికి గుర్తొచ్చే పాట ఇది! ఈ సందర్భంలో కొత్త అంటే.. నూతన సంవత్సరం అనే కాదు! కొత్త టెక్నాలజీ.. కొత్త ఫ్యాషన్.. మొత్తంగా కొత్తదనమేదైనా సరే స్వాగతం చెబుతాం అని అర్థం! అలా స్వాగతిస్తాం కాబట్టే.. 2024లో కొత్తకొత్తగా అప్పుడే రెక్కలు విచ్చుకుంటున్న 'కృత్రిమ మేధ (ఏఐ)' పరిజ్ఞానం 2025లో మనందరి చేతుల్లోకీ అందుబాటులోకి వచ్చేసింది! తప్పటడుగులు వేసే చిన్నపిల్లాడిలా తడబడిన ఏఐని వేలుపట్టి నడిపించి ఏడాది చివరికల్లా చాలా పనులకు వాడుకునే స్థితికి వచ్చేశాం. మరీ ముఖ్యంగా.. వైద్యం, పరిశోధన, ఐటీ రంగాల్లో ఏఐ ఇప్పటికే అద్భుతాలు చేస్తోంది. 2026లో ఈ ఏఐ వినియోగం మరింత పెరిగిపోతుందని.. 'ఇందుగలదు అందులేదన్న సందేహం వలదు' అన్నట్టుగా విశ్వరూపం దాల్చి మన జీవితాల్లోకి మరింత చొచ్చుకొస్తుందని టెక్ నిపుణులు చెబుతున్నారు! దీనికితోడుగా.. క్వాంటం ఫలాలు కూడా ఈ ఏడాది సాధారణ ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, ఆ టెక్నాలజీ మన దైనందిన జీవితాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటుందని వారు అంచనా వేస్తున్నారు. 2024లో మొదలైన ఏఐ విప్లవం 2025లో మనందరి జీవితాలనూ ప్రభావితం చేసే స్థితికి చేరుకున్నట్టుగానే.. 2025లో మొదలైన క్వాంటం రంగ విప్లవం 2026లో పలు రంగాలను ప్రభావితం చేస్తుందన్నది వారి భావన.

నష్టం కాదు.. లాభమే!

మనం పనిచేసే తీరును, సమస్యలను పరిష్కరించుకునే తీరును ఏఐ ఒక్క ఏడాదిలోనే మార్చేసిందనడంలో సందేహం లేదు. కంప్యూటర్లు వచ్చినప్పుడు వేలాది మంది ఉద్యోగాలు పోతాయని చాలా మంది భయపడ్డారు. భయపెట్టారు. కానీ వాస్తవంలో జరిగింది ఏంటంటే.. కంప్యూటర్ల వల్ల లక్షలాది మందికి ఉద్యోగాలు దొరికాయి. భారతదేశంలో మధ్యతరగతి వర్గం.. కంప్యూటర్ విప్లవం వల్ల ఎగువ మధ్యతరగతి, ధనిక వర్గంలోకి చేరింది. అదే కోవలో ఏఐ కూడా మన జీవనాన్ని మరింత మెరుగుపరుస్తుందని.. అది మనుషుల్ని భర్తీ చేయదని, వారి సామర్థ్యాలను మరింత మెరుగుపరుస్తుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. పనిప్రదేశాల్లో ఏఐ ఏజెంట్లు డిజిటల్ సహోద్యోగులుగా మారి.. తక్కువ సామర్థ్యాలున్న వారు సైతం మరింత మెరుగ్గా పనిచేయగలిగేలా చేస్తాయని స్పష్టం చేశారు. ఉదాహరణకు.. ఒక 100 పేజీల డాక్యుమెంట్‌ను చదివి దాని సారాంశాన్ని అర్థం చేసుకుని, ఆ సారాంశం ఆధారంగా ఒక నిర్ణయం తీసుకోవాలంటే గతంలో ఆ పని చేయడానికి కొన్ని రోజులు పట్టేది. ఇప్పుడు ఏఐకి ఆ డాక్యుమెంట్‌ని ఇస్తే.. క్షణాల్లో దాని సారాంశాన్ని మనకు చెప్పేస్తుంది. దీనివల్ల నిర్ణయాలు తీసుకోవడం వేగవంతమవుతుంది. కాబట్టి.. ఏఐతో ఉద్యోగాలు పోతాయని భయపడక, దాంతో పనిచేయించడం, పనిచేయడం ఎలాగో నేర్చుకుంటే, ఆ సామర్థ్యాలను మెరుగుపరచుకుంటే మరిన్ని అవకాశాలు ఉంటాయని నిపుణులు వివరిస్తున్నారు. ఇక.. వైద్యరంగంలో ఇప్పటికే విప్లవం సృష్టిస్తున్న ఏఐ ముందుముందు మరిన్ని సంచలనాలు నమోదు చేస్తుందని అంచనా. ప్రస్తుతానికి రోగనిర్ధారణకు మాత్రమే ఏఐని వినియోగిస్తున్నారు. ఇకపై దాన్ని చికిత్స ప్రణాళికకు కూడా వినియోగించే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ ఏఐలో ఆరోగ్యవిభాగం వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ డోమ్నిక్ కింగ్ వంటివారు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 1.1 కోట్ల మంది ఆరోగ్య కార్మికుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని.. ఆ సమస్యను ఏఐ సాయంతో అధిగమించడానికి అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ ఏఐ డయాగ్నస్టిక్ ఆర్కెస్ట్రేటర్ 2025లో అత్యంత క్లిష్టమైన వైద్య సవాళ్లను 85.5 శాతం కచ్చితత్వంతో పరిష్కరించిందని.. ఇది అనుభవజ్ఞులైన వైద్యనిపుణుల సగటు కచ్చితత్వం (20%)తో పోలిస్తే చాలా ఎక్కువని ఆయన వెల్లడించారు.

ఏఐతో క్వాంటమ్ కంప్యూటింగ్ జత..

ఇప్పటికే జోరందుకున్న కృత్రిమ మేధకు.. క్వాంటమ్ కంప్యూటింగ్ శక్తి కూడా తోడైతే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని మైక్రోసాఫ్ట్‌లో డిస్కవరీ అండ్ క్వాంటమ్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ చెప్పారు. కంప్యూటింగ్‌కి సంబంధించి తదుపరి ముందడుగు చాలా మంది ఊహిస్తున్నదాని కన్నా త్వరలోనే పడబోతోందని.. అందుకు దశాబ్దాలు కాదు, కొన్నేళ్లు మాత్రమే పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఏఐ, సూపర్‌కంప్యూటర్లు, క్వాంటమ్ కంప్యూటర్లు కలిసి పనిచేస్తాయని (హైబ్రీడ్ కంప్యూటింగ్).. మామూలు కంప్యూటర్లకు అసాధ్యమైన పనిని సైతం ఈ హైబ్రీడ్ కంప్యూటింగ్ ద్వారా అవలీలగా, అలవోకగా చేయొచ్చని తెలిపారు. అయితే, ఇంత శక్తి ఉన్న క్వాంటమ్ కంప్యూటింగ్‌కి సంబంధించి శాస్త్రజ్ఞులు ఒక ముఖ్యమైన సవాల్‌ను ఎదుర్కొంటున్నారు. అదేంటంటే.. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కీలకమైన 'క్యూబిట్లు' దుర్బలమైనవి. బాహ్య ప్రభావాల వల్ల అవి చాలా త్వరగా అస్థిరతకు గురై పనిచేయకుండా పోతాయి. దీన్ని అధిగమించేందుకు శాస్త్రజ్ఞులు 'ఫాల్ట్ టోలరెంట్ అల్గారిథమ్స్'.. అంటే బయటి ఒత్తిళ్లకు క్యూబిట్లు ప్రభావితం కాకుండా చూసే అల్గారిథమ్స్‌ను రూపొందిస్తున్నారు. ఆ ప్రయత్నాలు పూర్తిగా సఫలమైతే.. క్వాంటమ్ కంప్యూటింగ్ 2026లోనే వాస్తవ ప్రపంచంలో అందుబాటులోకి వస్తుందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

- సెంట్రల్ డెస్క్





ఎన్నికల సందడి

మిగతా దేశాల సంగతేమోగానీ.. మన దేశంలో ఎన్నికలంటే పండగ! 2025లో ఢిల్లీ, బిహార్‌లో మాత్రమే ఈ పండగ వచ్చింది!! కానీ ఈ ఏడాది ఏకంగా ఐదు చోట్ల ఎన్నికల సంరంభం జరగనుంది. 2026 మార్చి-మే నెలల నడుమ.. అసోం, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళలో హోరాహోరీగా ఎన్నికల పోరు జరగనుంది. వీటిలో.. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే ఆ హడావుడి బాగా కనపడుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లో పట్టు సాధించడం కోసం బీజేపీ ముమ్మర ప్రయత్నాలు సాగిస్తుండగా.. ఉన్న పట్టు నిలుపుకొనేందుకు అధికారపక్షాలైన టీఎంసీ, డీఎంకేలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి.



ముసలితనానికి అడ్డుకట్ట!

మనిషికి తప్పనివి జర, మరణం. జర అంటే ముసలితనం. ప్రస్తుతానికి మరణాన్నైతే తప్పించలేంగానీ.. ముసలితనాన్ని జయించే మార్గాల కోసం ప్రపంచవ్యాప్తంగా పలువురు శాస్త్రజ్ఞులు, పలు సంస్థలు, స్టార్టప్‌లు ఇప్పటికే విస్తృతంగా కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే.. పోర్చుగల్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ అవీరోకు చెందిన రసాయన శాస్త్రజ్ఞులు 'ఎపిజెనెటిక్ రీప్రోగ్రామింగ్‌'పై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. సాధారణంగా మనకు వయసు పెరిగే కొద్దీ చర్మం ముడతలు పడుతుంది. శరీర పటుత్వం సడలుతుంది. అవయవాల పనితీరు మందగిస్తుంది. ఇదంతా సహజంగా జరిగే ప్రక్రియ అని మనం సరిపెట్టుకుంటాం. కానీ, అవీరో వర్సిటీ శాస్త్రజ్ఞులు మాత్రం.. కణాల్లోని 'ఎపిజెనెటిక్ నియంత్రణ' క్రమంగా పట్టుతప్పడం వల్లే వృద్ధాప్యం వస్తుందని చెబుతున్నారు. అలా దెబ్బతిన్న జన్యువులను గుర్తించి.. ప్రత్యేక ప్రొటీన్ల ద్వారా వాటిని తిరిగి పనిచేయించే దిశగా శాస్త్రజ్ఞులు ఇన్నాళ్లూ కృషి చేస్తున్నారు. కానీ, అవీరో శాస్త్రజ్ఞులు మాత్రం అలా ప్రత్యేక ప్రొటీన్ల ద్వారా కాకుండా కొన్ని రసాయనాలను ఉపయోగించి జీవనియంత్రణ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ల్యాబులో వారి ప్రయోగాలు కొంతమేర ఇప్పటికే ఫలించాయి కూడా. ఈ పరిశోధనలు మరింత జోరుగా సాగి.. ముసలితనాన్ని జయించే రోజు త్వరలోనే రావాలని అందరూ కోరుకుంటున్నారు.

భారత్- పాక్ ఘర్షణను మేమే ఆపాం

- చైనా విదేశాంగమంత్రి వాంగ్ ఈ ప్రకటన
- జాతీయ భద్రత పెద్ద జోక్‌గా మారింది: కాంగ్రెస్



బీజింగ్/న్యూఢిల్లీ, డిసెంబరు 31: భారత్-పాకిస్థాన్ మధ్య 2025, మే నెలలో జరిగిన సైనిక ఘర్షణను తానే ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే 70 సార్లకు పైగా ప్రకటించగా.. ఇప్పుడు దీనిపై చైనా పోటీకి వచ్చింది. మే 7 నుంచి 10వ తేదీ వరకు జరిగిన ఘర్షణ తమ మధ్యవర్తిత్వం వల్లే ఆగిందని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ ఈ బుధవారం ప్రకటించారు. బీజింగ్‌లో అంతర్జాతీయ పరిస్థితులు, చైనా విదేశీ సంబంధాలు అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసియా ఖండంలో అనేక సైనిక ఘర్షణలను చైనా తన దౌత్యం ద్వారా ఆపిందని చెప్పుకొచ్చారు. 'రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఎన్నడూ లేనంత స్థాయిలో ఈ ఏడాది (2025) దేశాల మధ్య సైనిక ఘర్షణలు, సరిహద్దు వివాదాలు చెలరేగాయి. వీటిని నివారించి, శాంతిని నెలకొల్పేందుకు మేము న్యాయమైన, సానుకూల విధానాలను అనుసరించాం. ఉత్తర మయన్మార్‌లో ఘర్షణతోపాటు ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమ వివాదం, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు, పాలస్తీనా(హమాస్)- ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపాం. ఇటీవల థాయ్‌లాండ్, కాంబోడియా మధ్య సరిహద్దు ఘర్షణను కూడా మేమే ఆపాం' అని వివరించారు. చైనా ప్రకటనను భారత విదేశాంగ శాఖ ఖండించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ పోరాటం చేసింది నిజానికి పాకిస్థాన్‌తో కాదని చైనాతో అని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ తెలిపారు. చైనా ప్రకటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. జాతీయ భద్రత పెద్ద జోక్‌గా మారిందని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో ఎద్దేవా చేశారు. ఈ అంశంపై ప్రధాని ఇప్పటికైనా మౌనం వీడాలని డిమాండ్ చేశారు.

నిమ్సులైడ్ పెయిన్ కిల్లర్ అధిక డోసులపై నిషేధం!

నూఢిల్లీ, డిసెంబరు 31: నిమ్సులైడ్ అనే పెయిన్ కిల్లర్ మందుల అధిక డోస్‌ల తయారీ, పంపిణీ, వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ పెయిన్ కిల్లర్ 100ఎంజీ మోతాదుకు మించి వినియోగం ఆరోగ్యపరంగా తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దేశంలోని అత్యున్నత వైద్య పరిశోధన సంస్థ ప్రతిపాదనల మేరకు 100ఎంజీ మోతాదుకు మించిన నిమ్సులైడ్ పెయిన్ కిల్లర్‌ను నిషేధిస్తున్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ పెయిన్ కిల్లర్ వాడడం వల్ల తక్షణ ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, అలాగే, దీనికి ప్రత్యామ్నాయ మందులు అందుబాటులో ఉన్నాయని కాబట్టి తక్షణం దీనిని నిషేధిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఐదేళ్ల తర్వాత 'సత్యం' ఎపిసోడ్!

- రామలింగరాజు స్కాంపై బ్యాడ్‌బాయ్ బిలియనీర్ సిరీస్ చివరి భాగం విడుదల

న్యూఢిల్లీ, డిసెంబరు 31: 'బ్యాడ్ బాయ్ బిలియనీర్స్ ఇండియా' సిరీస్ చివరి భాగం ఎట్టకేలకు నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. సత్యం సర్వీసెస్ వ్యవస్థాపకుడు రామలింగరాజు, సత్యం సర్వీసెస్ కుంభకోణాన్ని కేంద్రబిందువుగా చేసుకొని రూపొందించిన ఈ ఇన్వెస్టిగేటివ్ డాక్యుమెంటరీ నాలుగో భాగం ఐదేళ్ల న్యాయపోరాటం తర్వాత 'రైడింగ్ ది టైగర్' పేరుతో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకొచ్చింది. ఈ డాక్యుమెంటరీలో అర్ధసత్యాలున్నాయని, తన పరువుకు నష్టం కలుగుతుందని ఆరోపిస్తూ రామలింగరాజు 2020లో హైదరాబాద్ సివిల్ కోర్టును ఆశ్రయించడంతో కోర్టు విడుదలపై స్టే విధించింది. 'బ్యాడ్ బాయ్ బిలియనీర్స్ ఇండియా' మొదటి సీజన్ 2020 అక్టోబరులో విడుదలైంది. ఇందులో విజయ్ మాల్యా, నీరవ్ మోదీ సుబ్రతా రాయ్ వంటి ప్రముఖులపై చేసిన ఇన్వెస్టిగేటివ్ ప్రొఫైల్స్ ఉన్నాయి. రామలింగరాజు ఉదంతాన్ని కూడా ఈ సిరీస్‌లో చిత్రీకరించారు.

యూపీఎస్సీ పరీక్షల విధానం శుద్ధ దండగ

- ఏఐ యుగంలోనూ అవే పాత పద్ధతులా?
- ప్రధాని ఆర్థిక సలహాదారు సంజీవ్ సన్యాల్



న్యూఢిల్లీ, డిసెంబరు 31: యూపీఎస్సీ పరీక్షల విధానంపై ప్రధాని ఆర్థిక సలహాదారు సంజీవ్ సన్యాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధ(ఏఐ) యుగంలోనూ ఇంకా పాత పద్ధతుల్లోనే పరీక్షల ఆధారిత విద్యా విధానాన్ని కొనసాగిస్తూ యూపీఎస్సీ సమయం వృధా చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. టెక్నాలజీ యుగంలో సంప్రదాయ పాఠ్య ప్రణాళికలకు, పరీక్షల విధానానికి కాలం చెల్లిందన్నారు. ఉద్యోగ నియామకాల కోసం యూపీఎస్సీ అనుసరిస్తున్న ప్రస్తుత పరీక్షల విధానం శుద్ధ దండగ వ్యవహారమని...వార్తా సంస్థ 'ఏఎన్ఐ' పాడ్‌కాస్ట్ సంభాషణలో ఆయన అభిప్రాయపడ్డారు. "ఇప్పుడు సాంకేతికత పెరిగింది. ఏఐ కీలకంగా మారింది. టెక్నాలజీ మారుతున్నంత వేగంగానే నైపుణ్యం, విజ్ఞానాలను సంపాదించే పద్ధతులు కూడా మారిపోయాయి. కానీ, ఈ వేగాన్ని అందుకునే స్థితిలో యూనివర్సిటీలు, వాటి పాఠ్య ప్రణాళికలు లేవు" అని సన్యాల్ అభిప్రాయపడ్డారు. నిన్న చూసిన టెక్నాలజీ ఈరోజు పాతబడిపోతున్న దశలో, అవే పాత విధానాలతో యూనివర్సిటీలు కుస్తీ పట్టడం సరికాదన్నారు. "వడ్రంగి చేసే పనిని నైపుణ్యంగా చూసే వైఖరి ఈనాటికీ వృత్తి విద్యా కోర్సుల్లో కనిపిస్తోంది" అని విమర్శించారు. 18 ఏళ్లకు డిగ్రీ పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరిపోయే పరిస్థితి రావాలని, అవసరమైతే ఆ తర్వాత కూడా చదువును కొనసాగించవచ్చునన్నారు.

ఒక్కో డెలివరీకి రూ.150!

- కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించే వేళ వర్కర్లకు అందిస్తామన్న జొమాటో
- రూ.2 వేల వరకు ప్రోత్సాహకాలు: స్విగ్గీ

న్యూఢిల్లీ, డిసెంబరు 31: కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తున్న సమయంలో తమ డెలివరీ వర్కర్లకు కాస్త ప్రోత్సాహకం ఇస్తున్నట్టు స్విగ్గీ, జొమాటో తదితర ఈ-కామర్స్ సంస్థలు వెల్లడించాయి. డిసెంబరు 31న సాయంత్రం 6 గంటల నుంచి 12 గంటల వరకు చేసే ప్రతి డెలివరీకి రూ.120 నుంచి రూ.150 చొప్పున చెల్లిస్తామని జొమాటో తెలిపింది. మొత్తంగా ఈ రోజున ఒక్కో డెలివరీ వర్కర్‌కు రూ.3 వేల వరకు అందేలా చూస్తామని పేర్కొంది. మరోవైపు డిసెంబరు 31న సాయంత్రం 6 నుంచి 12 వరకు డెలివరీ వర్కర్లకు రూ.2వేల వరకు అందేలా చూస్తామని.. 31న, 1న రెండు రోజుల్లో మొత్తంగా రూ.10 వేల వరకు ఇన్సెంటివ్‌లు అందిస్తామని స్విగ్గీ హామీ ఇచ్చినట్టు ఆ సంస్థ అధికారులు తెలిపారు. కాగా, తమకు వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని స్విగ్గీ, జొమాటో, జెప్టో, తదితర ఈ-కామర్స్ యాప్‌ల డెలివరీ వర్కర్లు దేశవ్యాప్తంగా డిసెంబరు 31న సమ్మె చేస్తామని ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో డెలివరీ వర్కర్లు అందుబాటులో ఉండేలా తాత్కాలికంగా అధిక వేతనం ఇచ్చేందుకు స్విగ్గీ, జొమాటో సిద్ధమయ్యాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దక్షిణ కొరియాలో 4 వేల స్కూళ్లు మూత

- చేరికలు లేకపోవడంతో బడులకు తాళాలు

సియోల్, డిసెంబరు 31: ఖాళీ బల్లలు, విద్యార్థులు లేని క్లాసు రూములు.. దక్షిణ కొరియాలోని చాలా ప్రావిన్సుల్లో పాఠశాలల్లో ఇవే కనిపిస్తున్నాయి. దేశంలో ఇప్పటి వరకు 4 వేలకు పైగా పాఠశాలలు మూతబడ్డాయి. గత కొంతకాలంగా చేరికలు లేకపోవడంతో వాటిని మూసివేసినట్లు అధికార డెమొక్రాటిక్ పార్టీకి చెందిన చట్ట సభ్యుడు జిన్ సున్ మీ వెల్లడించారు. విద్యా మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 4,008 ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు మూత బడ్డాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలే 3,674 ఉన్నాయి. 2025 విద్యా సంవత్సరంలో 2,232 టీచర్ పోస్టులు కూడా తగ్గించేసినట్లు దక్షిణ కొరియా విద్యా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పాఠశాలలు మూత బడటానికి జననాల రేటు భారీగా తగ్గిపోవడమే ప్రధాన కారణం అని భావిస్తున్నారు. అలాగే రాజధాని ప్రాంతం కంటే ప్రావిన్సుల్లో ఎక్కువ బడులు మూత బడటానికి పట్టణీకరణ కూడా ఓ కారణంగా అంచనా వేస్తున్నారు.

'ఇండిగో'కు 458 కోట్ల జీఎస్టీ ఫైన్

న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశంలోనే అతిపెద్ద విమాన సంస్థ ఇండిగోకు జీఎస్టీ అధికారులు భారీ షాకిచ్చారు. జీఎస్టీ చట్టం-2017లోని సెక్షన్ 74 ప్రకారం.. 2018-19 నుంచి 2022-23 వరకు జీఎస్టీకి సంబంధించి రూ.458,26,16,980 జరిమానా విధించారు. దీనిలో వడ్డీ సహా జరిమానా కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఢిల్లీ దక్షిణ విభాగం సీజీఎస్టీ అదనపు కమిషనర్ ఇండిగో సంస్థకు నోటీసులు పంపారు. విదేశీ సరఫరాదారుల నుంచి పొందిన పరిహారం, ఇన్‌పుట్ క్రెడిట్ ట్యాక్స్‌ను తిరస్కరించిన నేపథ్యంలో ఈ జరిమానా విధించినట్టు వివరించారు. అయితే.. ఈ నిర్ణయాన్ని తాము సవాల్ చేస్తామని ఇండిగో అధికారులు ప్రకటించారు.

స్వచ్ఛ నగరం ఇండోర్‌లో కలుషిత జలాలు తాగి 8 మంది మృతి

- వందలాది మంది ఆస్పత్రుల పాలు
- పైప్‌లైన్లు లీకై తాగునీటిలోకి మురుగునీరు

ఇండోర్, డిసెంబరు 31 : దేశంలోనే అత్యంత స్వచ్ఛ నగరంగా పేరొందిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో పైపులైన్లు లీకయి మురుగు నీరు తాగునీటిలో కలిసిపోవడంతో 8 మంది మృతి చెందారు. మరో 149 మంది నగరంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ తెలిపారు. ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కలుషిత జలాల కారణంగా కొద్ది రోజులుగా ఇక్కడ 1,100 మందికి పైగా అస్వస్థత పాలవగా వారిలో బుధవారానికి 8 మంది మృతి చెందారు. ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇండోర్‌లోని ఇద్దరు మున్సిపల్ అధికారులను సస్పెండ్ చేయాలని, ఒక పబ్లిక్ హెల్త్ ఇంజినీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని మంగళవారం రాత్రి ఆదేశించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. బాధితులందరి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల చేత విచారణకు ఆదేశించారు. ఈ నెల 25నే మున్సిపల్ కుళాయిల నుంచి వచ్చే తాగునీరు దుర్వాసన వస్తున్నాయని భగీరథ్‌పుర వాసులు గుర్తించారు. ఆ రోజు నుంచి ఆ నీటిని తాగిన పలు కుటుంబాలవారు అస్వస్థత పాలయ్యారు. మురుగునీరు తాగునీటిలో కలిసినట్లయితే ప్రజలు వాంతులు, డయేరియా, కామెర్లతో ఇబ్బంది పడతారు తప్ప చనిపోరని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితు పట్వారీ పేర్కొన్నారు. తాగునీటి పైపులైన్లలో ఏదో విష పదార్థం కలిసిపోయినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కాగా ఇండోర్ వరుసగా 8 ఏళ్లపాటు దేశంలోనే అత్యంత స్వచ్ఛ నగరంగా అవార్డులు అందుకుంది. ఇంటింటి చెత్త సేకరణతోపాటు ఆసియాలోనే అతి పెద్ద బయో సీఎన్‌జీ ప్లాంటు ఏర్పాటుతో ఆదర్శ నగరంగా గుర్తింపు పొందింది.

వచ్చేసింది.. 2026!



సిడ్నీ హార్బర్ దగ్గర నూతన సంవత్సర వేడుకలు

న్యూఢిల్లీ, డిసెంబరు 31: 2026 సంవత్సరానికి ప్రపంచ దేశాలు ఘనంగా స్వాగతం పలికాయి. 2025 డిసెంబరు 31న రాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. వేర్వేరు టైమ్స్ జోన్స్ వల్ల వివిధ దేశాల్లో వేర్వేరు సమయాల్లో వేడుకలు జరిగాయి. పసిఫిక్ ద్వీప దేశం కిరిబాటి(క్రిస్మస్ ఐలాండ్).. 2026లో అడుగుపెట్టిన తొలి దేశంగా నిలిచింది. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో ఎత్తయిన స్కై టవర్ నుంచి భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. బోండి బీచ్ కాల్పుల ఘటన నేపథ్యంలో ఆస్ట్రేలియాలో భారీ భద్రత మధ్య వేడుకలు జరిగాయి. సిడ్నీ హార్బర్‌లో వేలాది మంది ఒక్కచోట చేరి బాణసంచా ప్రదర్శనను తిలకించారు. జపాన్‌లో వేడుకల సమయంలో రిక్టర్ స్కేలుపై 6 తీవ్రతతో భూకంపం సంభవించింది.



పుతిన్ ఇంటి సమీపంలో డ్రోన్ శకలాలు

పుతిన్ ఇంటిపై దాడి.. వీడియోను విడుదల చేసిన రష్యా

మాస్కో, డిసెంబరు 31: రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇంటిపై డ్రోన్ దాడికి సంబంధించిన వీడియోను ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం విడుదల చేసింది. పుతిన్ ఇంటి సమీపంలో ఓ డ్రోన్ కూలిపోయి ఉన్నట్లు ఆ వీడియోలో ఉంది. ఆ డ్రోన్‌ను ఉక్రెయినే ప్రయోగించిందని, తాము కూల్చివేశామని రష్యా ఆరోపిస్తోంది. డ్రోన్‌లో 6కిలోల పేలుడు పదార్థాలను ఉపయోగించారని తెలిపింది. ఈ దాడిలో పుతిన్ నివాసానికి ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టం చేసింది. అయితే, ఈ వీడియో నకిలీదని, కల్పితమని ఉక్రెయిన్ కొట్టిపారేసింది.

లోకం తీరు




నూతన సంవత్సర శుభాకాంక్షలు
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందించే అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్
అతి తక్కువ ధరలు Lowest Prices GUARANTEED Best Service నమ్మకమైన సర్వీస్
సోనోవిజన్
న్యూ ఇయర్ డిస్కౌంట్ సేల్
2026 Happy new year
2026 New Year Celebraton Offers
Upto 22.5% క్యాష్‌బ్యాక్ | 0% ఇంట్రస్ట్ | 1EMI Free
క్రెడిట్ కార్డ్ EMI కొనుగోలుపై, సెలెక్టెడ్ మోడల్స్, షరతులు వర్తిస్తాయి.
BAJAJ FINSERV HDB FINANCIAL SERVICES IDFC FIRST Bank HDFC BANK
UP TO ₹6,000 INSTANT DISCOUNT SBI card
*Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹6,000 per card; Also valid on EMI Trxns.; Validity: 27 Dec 2025 - 26 Jan 2026. T&C Apply.
LED UHD 4K Smart Tv's
LG
195 Cm (77") Ultra HD 4K OLED
Home Theatre
139 Cm (55") Ultra HD 4K Smart
SAMSUNG 189 Cm (75") LED 4K Ultra UHD
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart
Panasonic 108 Cm (43") LED 4K HD
LLOYD 108 Cm (43") Ultra 4K Google LED
TCL 108 Cm (43") 4K Google LED
Haier 108 Cm (43") UHD Google LED
Refrigerators
LG SAMSUNG Whirlpool Haier Godrej VOLTAS beko LLOYD
SBS Ref. 630 Ltrs
SBS Ref. 650 Ltrs
FF Ref. 272 Ltrs
DC Ref. 210 Ltrs
DC Ref. 188 Ltrs
Washing Machines
LG SAMSUNG BOSCH IFB Whirlpool LLOYD
Automatic Washing Machines
12/7 KG Front Load
9 KG Front Load
7 KG Top Load
7 KG Semi Load
Air Conditioner
LG LLOYD BLUE STAR VOLTAS DAIKIN Godrej HITACHI
5Star & 3Star Inverter A.C's
5Star & 3Star Inverter A.C's
5Star & 3Star Inverter A.C's
Mobile Phones
vivo 5G V-60e Upto 10% Cash Back 9/0, 10/2, 12/4 Schemes Available
oppo 5G F-31, F-31 Pro 6/0, 7/0, 8/0, 11/2 Schemes Available
iPhone 17, 17 Pro Upto 4000/- Cash Back 16 Pro, 16 Pro Max Upto 3000/- Cash Back iPhone Air New Arrival
9/0, 12/0, 24/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)
SAMSUNG S-25 Ultra 5G Discount Upto 15000/- A-56 5G Instant Discount Upto 3000/-
9/0, 12/0, 24/0 Schemes Available
ONEPLUS 5G 13-S CashBack 4500/- SBI, RBL Credit Card 12/4 Scheme Available
realme 5G 15 Pro 6/0, 8/2, 10/3 Schemes Available
mi Redmi 5G Note 15 Series 6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
Laptops & Mobile Accessories
hp 12/4 Scheme Available
Lenovo 12/4 Scheme Available
DELL 15/5 Scheme Available
ASUS 12/4 Scheme Available
MacBook 24/0 Scheme Available
Smart Watch Ear Buds
Mobile Accessories Boat, Realme, Fastrack, Hapipola
boAt JBL Sound Bar
conditions apply
Kitchen Small Appliances
Water Dispenser
Water Purifier RO
Water Geyser 10 Litres
Microwave Oven
Air Chimney
3 Burner Glass Cooktop
Wet Grinder
Rice Cooker
Mixer Grinder 3 Jar, 750 Watts
Juicer
Air Fryer
Kettle
Iron Box
Blender
Sonovision New Year Sale Special Offers On Mobiles & Laptops
AMAZON PAY Upto 2000/- CASH BACK Conditions Apply
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
బ్రాడిపేట, గుంటూరు. 9246666215, 9100991706
బ్రమ్మం గారి రోడ్డు, లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905.
అరండల్‌పేట, రైల్వేస్టేషన్ రోడ్, నరసరావుపేట. 8712648710, 11, 12.
రత్నా టాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్‌రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లే. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
బాపూజి మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911, 12.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆరావళి..ఆశ!

ఆరావళిని రక్షించుకోవడమంటే, ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశరాజధాని వాసులకు కాస్తంత ఆక్సిజన్ అందించడం. ఢిల్లీ ఇరుగుపొరుగు రాష్ట్రాలను పర్యావరణ విధ్వంసంనుంచి రక్షించడం. 250కోట్ల సంవత్సరాల నాటి ఆరావళిని అవలీలగా మింగేయడానికి మైనింగ్ మాఫియా చుట్టూ కాచుకుకూర్చున్నదని తెలుసుగనుకనే, నిర్వచనం విషయంలో సుప్రీంకోర్టు అంతపట్టుదలగా ఉంది. మాటలో ఏమాత్రం తేడావచ్చినా, పర్వతాలు ఫలహారం చేయడానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుందని దాని భయం. వందమీటర్లకంటే ఎక్కువ ఎత్తున్న కొండలనే పర్వతాలుగా పరిగణించాలంటూ కేంద్రం ఇచ్చిన నిర్వచనాన్ని గతంలో తెలిసోతెలియకో ఆమోదించిన సర్వోన్నత న్యాయస్థానం ఇంత వెంటనే తప్పు సరిదిద్దుకొని, అప్పటి ఉత్తర్వులను ఉపసంహరించుకున్నందుకు సంతోషించాలి.

ఇంత ఎత్తుదాటితేనే అనడంతోనే 95శాతం ఆరావళి అతివేగంగా అంతరించిపోతుందని పర్యావరణవేత్తల భయం. పర్యావరణ మంత్రిత్వ శాఖ నిర్వచనాన్ని గతనెలలో మాజీ చీఫ్‌జస్టిస్ గవాయ్ ఆమోదించగానే వారంతా భయపడ్డారు. ఆరావళిలో అక్రమమైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడి, కష్టపడి సాధించిన రక్షణలన్నీ గాలికికొట్టుకుపోవడం బాధకలిగించింది. మరోపక్క దేశరాజధాని కాలుష్యంలో కొట్టుమిట్టాడుతూ ఊపిరాడని స్థితిలో ఉండటం కూడా ప్రజల్లో ఈ నిర్వచనం మీద అవగాహనకు దోహదం చేసింది. ఇటువంటి అంశాల్లో పెద్దగా చొరవచూపని సామాన్యులు సైతం ఆరావళి పరిరక్షణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం, ప్రధాన మీడియాలోనే కాక, సామాజిక మాధ్యమాల్లో సైతం 'సేవ్ ఆరావళి' అంటూ ప్రచారాలు, చర్చలు జరగడం బాగుంది. ప్రస్తుత సీజేఐ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని త్రిసభ్యధర్మాసనం ఈ అంశాన్ని త్వరితంగా స్వీకరించి, నిపుణుల కమిటీ సూచనలను అహేతుకమైనవిగా భావించి, మరింత సమగ్రమైన అధ్యయనాన్ని కోరుతూ అమలు నిలిపివేయడం సముచితం.

2010లో రాజస్థాన్ ముందుకు తెచ్చిన వందమీటర్ల ఎత్తునిర్వచనం చాలా రాష్ట్రాలకు నచ్చింది. అధికారికంగానో, అనధికారికంగానో అమలు చేసి అస్మదీయులకు ఎన్నోమేళ్ళు చేసుకున్నాయి. మరో ఎనిమిదేళ్ళకు రాజస్థాన్‌లో ఎఫ్ఎస్ఐ చేపట్టిన సర్వేలో అనేక కొండలు ఈ నిర్వచనంలో భాగంగా మాయమైపోయినట్టు తేలింది. ఆరావళిని ఇంతవరకూ ఎవరూ తాకలేదని, తవ్విపోయలేదనీ, ఇప్పుడే దానికి ప్రమాదం ముంచుకొస్తున్నదన్న భ్రమ ఎవరికీ లేదు. కొండలను దోచేస్తున్న కార్పొరేట్ల ధనదాహానికి ఇటువంటి నర్మగర్భమైన, కుట్రపూరిత నిర్వచనాలు మరింత తోడవుతాయన్నది సత్యం. ఆరావళికి దూరంగా కూడా మైనింగ్ పూర్తిగా నిలిపివేస్తున్నట్టుగా, కొత్తగా అనుమతులు ఇవ్వనట్టుగా ప్రభుత్వాలు ఈ మధ్యలో చేసిన విన్యాసాలు సైతం ప్రజలు గమనించారు. వాయువ్యభారతానికి వందలాది కిలోమీటర్ల రక్షణకవచంగా ఉన్న ఆరావళిలో ఇప్పటికే పోయింది ఎంతో తెలుసు కనుక, ఉన్నదానినైనా నిలబెట్టుకోవాలని తాపత్రయపడ్డారు. పర్వతాలను, నదులను యథాస్థితిలో రక్షించుకోవడం కాక, వాటి ఎత్తులు, లోతులు కొలిచి, కొత్తనిర్వచనాలు సృష్టించి అంతిమంగా మాయం చేయడానికి జరుగుతున్న కుట్రను జనం గ్రహించారు.

అభివృద్ధి పేరిట పారిశ్రామికవేత్తలకు వ్యవసాయభూములనుంచి అడవులవరకూ అన్నీ అప్పనంగా అప్పగించేస్తున్న కాలమిది. అడవులు అంతరించిపోయి, పర్యావరణం నాశనమై, ప్రకృతి ప్రకోపానికీ, కాలుష్యానికీ సామాన్యుడు బలైపోతున్నాడు. కాలుష్యం కమ్మేస్తున్న తొలిపదినగరాల్లో మనదేశంలోనివి అరడజనున్నాయి. ఢిల్లీకాలుష్యాన్ని చక్కదిద్దలేక చేతులెత్తేసిన పాలకులు కాలుష్యం నిర్వచనాలను మార్చడానికీ, గ్రేడ్లు తారుమారుచేయడానికీ ప్రయత్నిస్తున్నారు. కాలుష్యంతో కొత్త రోగాలు రావని పార్లమెంటులోనే సమర్థించుకుంటున్నారు. క్విడ్‌ప్రోకో పద్ధతిలో మనుగడ సాగిస్తున్న రాజకీయవ్యవస్థకు కఠిన పర్యావరణ పరిరక్షణచట్టాలతో ప్రజలను రక్షించే ఉద్దేశం ఏమాత్రం లేదు. అధికారపక్షానికి అధికారికంగానే భారీ విరాళాలు అందుతూ, ప్రతిగా ఆయా సంస్థలకు ఎన్నెన్నిమేళ్ళు జరుగుతున్నాయో చూస్తూన్నాం. ఎప్పటికప్పుడు పాలకులను ప్రశ్నిస్తూ, న్యాయస్థానాలను నమ్ముకుంటూ, భవిష్యత్ తరాలకోసం ఆరావళి తరహాలో ప్రతీ కొండనీ గుట్టనీ జనమే కాపాడుకోక తప్పదు. ఆరావళి ఒక్కటేనా, హిమాలయాలు, వింధ్య, పశ్చిమకనుమలతో సహా ప్రతీ పర్వతమూ, నదీ ఎన్నడూలేనంత ప్రమాదంలో మునిగి, మనుగడ కోసం అల్లాడుతున్నాయి.

మన దేశంలో 90 శాతం మిఠాయి వ్యాపారులు పన్ను కట్టే పరిధిలో లేరు. మిగిలిన 10 శాతం వ్యాపారులు– 2021లో రూ. 59,300 కోట్ల రూపాయల వ్యాపారం చేశారు. దీనిలో 13 శాతం వ్యాపారం మన దక్షిణాదిన జరుగుతోంది. ఇక దేశంలో మిగిలిన 90 శాతం మంది చేసే వ్యాపారం మరో నాలుగు రెట్లు వేసుకుందాం. అంటే 2.5 లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరిగినట్లు లెక్క. ఈ వ్యాపారం ప్రతి ఏటా12 శాతం పెరుగుతోంది.

'తీపి' కబుర్లు

బిహార్‌లోని నలందా జిల్లాలో సిలావ్ అనే ఒక ఊరు ఉంది. అక్కడ 'శ్రీకాళీ ఖా' అనే స్వీట్ షాపులో తయారుచేసే 'కాజా'కు ఈ మధ్యనే జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ వచ్చింది. ఒక వంటకానికి జీఐ ట్యాగ్ రావటం చాలా అరుదైన విషయం. ఈ ఊరులో తయారుచేసే కాజాలు దేశవిదేశాలకు ఎగుమతి అవుతూ ఉంటాయి. మోదీతో సహా అనేకమంది రాజకీయ నాయకులు ఈ కాజా గురించి తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు, ప్రశంసించారు. ఈ కాజాకు జీఐ ట్యాగ్ ఇచ్చిన వార్త, నేను ఢిల్లీలో 'వరల్డ్ మిఠాయి అండ్ నమ్కీన్ కన్వెన్షన్' సమావేశంలో ఉన్నప్పుడు తెలిసింది. వెంటనే, 'మన తెలుగు వాళ్లకు ఏం తక్కువ.. మనకెందుకు ఇలాంటి ట్యాగ్‌లు రావటం లేదు' అంటూ అనేక ఆలోచనలు కలిగాయి. తాపేశ్వరం కాజా.. ఆత్రేయపురం పూతరేకులు.. గొల్లలమామిడాడ ఇమ్మర్తిలు.. బందరు హల్వా.. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన వందల వంటకాలు మన దగ్గర ఉన్నాయి. వీటన్నింటికీ కూడా జీఐ ట్యాగ్‌లు రావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు తలుచుకుంటే కష్టం కూడా కాదు. ఎక్కడి దాకానో ఎందుకు.. తాపేశ్వరం కాజాను సుమారు 80 ఏళ్ల క్రితం మా నాన్నగారు పోలిసెట్టి సత్తిరాజు తయారుచేశారు. ఇప్పటికీ నాతో పాటు అనేకమంది కుటుంబ సభ్యులు ఈ వ్యాపారంలో ఉన్నారు. లెక్క ప్రకారం మనకు కూడా జీఐ ట్యాగ్ దక్కాలి కదా.. దక్కితే మన తెలుగు రాష్ట్రాలకే ఖ్యాతి వస్తుంది కదా.. ఈ దిశగా విధానకర్తలు, మిఠాయి వ్యాపారులు, పౌర సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉంది. చాలామంది ఒక స్వీటుకు జీఐ ట్యాగు వస్తే ఏమిటి? రాకపోతే ఏమిటి? అనే భావనలో ఉంటారు. కానీ మన దేశంలో మిఠాయి వ్యాపారం ఎంత పెద్దదో.. ప్రతి ఏడాది దీని ద్వారా ప్రభుత్వానికి ఎన్ని వేలకోట్ల రూపాయల ఆదాయం వస్తోందో చాలా తక్కువ మందికి తెలుసు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం– మన దేశంలో 90 శాతం మిఠాయి వ్యాపారులు ప్రభుత్వ పన్నులు కట్టే పరిధిలో లేరు. అంటే వారు ఎంత వ్యాపారం చేస్తున్నారో మనకు తెలియదు. మిగిలిన 10 శాతం వ్యాపారులు– 2021 లెక్కల ప్రకారం, ఆ ఏడాది రూ. 59,300 కోట్ల రూపాయల వ్యాపారం చేశారు! దీనిలో 13 శాతం వ్యాపారం మన దక్షిణాదిన జరుగుతోంది. ఇక దేశంలో మిగిలిన 90 శాతం మంది చేసే వ్యాపారం మరో నాలుగు రెట్లు వేసుకుందాం. అంటే మన దేశంలో 2021లో 2.5 లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరిగినట్లు లెక్క.. గణాంకాల ప్రకారం, ఈ వ్యాపారం ప్రతి ఏడాది 12 శాతం పెరుగుతోంది. దీని ఆధారంగా చూస్తే 2025 నాటికి మన దేశంలో మిఠాయి వ్యాపారం నాలుగు లక్షల కోట్ల రూపాయలకు చేరుకోవాలి. ప్రస్తుతం జరుగుతున్నట్లు అంచనా కూడా. ఈ వ్యాపారులందరూ ఏడాదికి ఒకసారి 'వరల్డ్ మిఠాయి అండ్ నమ్కీన్ కన్వెన్షన్'లో



కలుస్తారు. గతవారం జరిగిన ఈ సదస్సులో దేశవిదేశాల నుంచి వేలాది మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సుగర్ ఫ్రీ మిఠాయిలు.. ఫ్యూజన్ స్వీట్లకు పెరుగుతున్న డిమాండ్.. ఆధునిక పరిశుద్ధమైన ప్యాకింగ్.. ఈ కామర్స్ సమస్యలు వంటి అంశాలపై కీలకమైన చర్చలు జరిగాయి.

మన దేశ జనాభాలో 50శాతం మంది 40 ఏళ్ల లోపు వారే! వీరికి ఆరోగ్యంపై అవగాహన ఎక్కువ. మిఠాయిలు తినడం వల్ల అనారోగ్యం కలుగుతుందనే ప్రజల భావన కారణంగా సుగర్ ఫ్రీ స్వీట్స్‌కు ఆదరణ పెరుగుతూ వస్తోంది. దీంతో అన్ని పెద్ద బ్రాండ్స్– సుగర్ ఫ్రీ స్వీట్స్‌ను ప్రవేశపెట్టాయి. వీటితో పాటుగా కొత్త తరం ఫ్యూజన్ స్వీట్లను కూడా ఇష్టపడుతున్నారు. రసగుల్లా చీజ్ కేక్, గులాబ్ జామూన్ ట్రుఫుల్, జిలేబీ వాఫిల్స్ వంటివి ఇప్పుడు చిన్న నగరాలలో కూడా లభిస్తున్నాయి. విద్యాధికులైన అనేక మంది మిఠాయి షాపుల యజమానులు సంప్రదాయ వంటలకు కొత్త రంగులు.. హంగులు అద్దడం మొదలు పెట్టారు. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా కొద్దిమంది ఈ తరహా ప్రయోగాలు చేస్తున్నారు. ఇక మిఠాయి షాపు యజమానులు ఎదుర్కొనే ప్రధాన సమస్య ప్యాకింగ్. స్వీట్లను ఎక్కువ కాలం తాజాగా ఉంచగలిగితే– వ్యాపారంలో నష్టాలు ఉండవు. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాక్యూమ్ సీల్డ్ ప్యాకేజింగ్ వంటివి అందుబాటులోకి వచ్చేశాయి. కొద్దిపాటి పెట్టుబడి పెట్టడం వల్ల లాభం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఇన్‌స్టా మార్కెటింగ్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఎక్కువ మంది ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటనలు చూసి, ఆన్‌లైన్ ద్వారా స్వీట్లను కొనుగోలు చేయటానికి ఇష్టపడుతున్నారు. అయితే ఈ ప్రకటనకర్తల్లో ఎక్కువ మంది ఇతర షాపుల నుంచి కొనుగోలు చేసి తమ బ్రాండ్‌లపై అమ్మేవారే! ఈ ఇన్‌స్టా మార్కెటింగ్ వల్ల, స్థానికంగా ఉండే చిన్న షాపులకు బిజినెస్ తగ్గుతోంది. అబద్ధపు ఇన్‌స్టా ప్రకటనలు కూడా సైబర్ నేరాల కిందే వస్తాయి. వీటిని ప్రభుత్వం నియంత్రించాల్సి ఉంది. ఇక పెద్ద నగరాల్లో అయితే జొమాటో, స్విగ్గీ వంటి డెలివరీ ప్లాట్‌ఫాంలకు విపరీతమైన ఆదరణ ఉంది. విదేశాలకు కూడా సులువుగా మన మిఠాయిలను అందించే సప్లైయర్స్ వచ్చేశారు. ఇలాంటి అవకాశాలన్నింటినీ వాడుకుంటేనే ఈ పోటీ ప్రపంచంలో మనుగడ సాగించగలం. లేకపోతే ఎదుగుదల లేకుండా ఉండిపోవాల్సి వస్తుంది. చివరగా– అన్ని రంగాల్లో మాదిరిగానే మిఠాయి వ్యాపార రంగంలో కూడా పెను మార్పులు వచ్చాయి. వస్తున్నాయి. వీటిని గమనించి.. వాటిపై అవగాహన పెంచుకుని ముందుకు వెళ్లేనే ప్రయోజనం ఉంటుంది.

• **మల్లిబాబు**
ఎండీ, సురుచి ఫుడ్స్
వైస్ ప్రెసిడెంట్, ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నమ్కీన్ మాన్యుఫాక్చరర్స్

కొత్త సంవత్సరమూ–పాత ఆలోచనలూ!

హిందీ సినిమా "వక్త్"లో సాహిర్ అంటాడు– 'ఆగే భీ జానే న తూ, పీఛే భీ జానే న తూ..' అని. 'రేపటిలోకి దూసుకుని వెళ్లడమూ నీ తరం కాదు, నిన్నలోకి ముడుచుకుపోవడమూ నీ తరం కాదు, నీ చేతిలో ఉన్నది ఈ క్షణం మాత్రమే. ఏవైనా ఆశలుంటే యిప్పుడే తీర్చుకో

ఇవాళే కొత్త సంవత్సరం వచ్చింది. అర్ధరాత్రి నుంచే శుభాకాంక్షల మెసేజీలు వెల్లువెత్తాయి. కొత్త సంవత్సరపు తొలిపొద్దు పొడవగానే నా జీవితంలో క్రాంతి రావాలని, నా ఆలోచనలు మారాకు వేసి, మరిన్ని మార్పులకు స్వాగతం పలకాలనీ వారంతా అభిలషించారు. తెల్లవారింది. పాత సంవత్సరంలో ఆఖరి రోజున చేసినట్లుగానే– ఓ గ్లాసు గోరువెచ్చని నీటిలో ఓ చెంచా తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడి, పసుపు, మెంతులు వేసుకుని తాగాను. అచ్చం నిన్నటిలాగే హార్లిక్స్ సేవనం, మార్నింగ్ వాక్, కాస్త స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజులు, స్నానం, అల్పాహారం, పడక్కుర్చీలో నడుం వాల్చి, లోకపు తీరు గురించి ఆలోచనలో పడడం... అంతా సేమ్ టు సేమ్! మార్పెక్కడుంది? క్యాలెండరులో మరో పేజీ చిరిగింది అనేవారు పాతకాలపు కథల్లో. ఈ రోజుల్లో గోడలకు క్యాలెండర్లు లేవు. సెల్‌ఫోన్‌లోనే డేటు చూస్తాం. అది తనంతట తనే మార్చేసుకుంటుంది. చించే, ఆలోచించే పని మనకు పెట్టదు. మరి పెనుమార్పు వచ్చేస్తుందని ఆకాంక్షించిన నా బంధుమిత్రుల మాటేమిటి? ఇంతకీ ఈ మార్పు వున్నట్లా? మరి లేనట్లా? ప్రబంధ నాయిక నడుముకు వచ్చిన సమస్యే మనకూ వచ్చినట్లుగా వుంది.



గ్రీకు తత్త్వవేత్త హెరాక్లిటస్ అంటాడు– 'ఒకే నదిలో రెండుసార్లు కాలు పెట్టలేవు' అని. అంటే మొదటిసారి కాలు పెట్టి, బయటకు తీసి, మళ్లీ పెట్టే లోపున పాత నీరు వెళ్లిపోతుంది. కొత్త నీరు వచ్చేస్తుందని అర్థం. చూడడానికి పాత నీరులాగే అనిపిస్తుంది కానీ, నిజానికి అది కొత్త నీరు. దానికీ, దీనికీ లింకు ఉంది కానీ, దేని అస్తిత్వం దానిదే. రెండూ ఒకలాంటివి కావు. 1940–60ల మధ్య కాలంలో పుట్టిన వారికున్న అడ్వాంటేజీ ఏమిటంటే... వాళ్లు కనీసం ఆరు వేర్వేరు దశాబ్దాలు, రెండు వేర్వేరు శతాబ్దాలు, రెండు వేర్వేరు సహస్రాబ్దాలను చూశారు. కాలచక్రపు తానులో ఈ ఆరు దశాబ్దాల కాలాన్ని ఒక కటపీస్‌గా తీసి చూస్తే దీనిలో ఉన్నంత వర్ణ వైవిధ్యం తక్కిన ఏ ఆరు దశాబ్దాల కటపీస్‌లోనూ కనబడదు. ఏం మార్పు! ఏం మార్పు!!

> **గడిచిపోయిన రోజుల జ్ఞాపకాలు అందించే వెచ్చదనాన్ని, సౌఖ్యాన్ని అప్పుడప్పుడు ఆస్వాదించడం అవసరమే. చిన్నపిల్లలు పిప్పర్‌మెంట్‌ను కాస్సేపు చప్పరించి, రేపు మళ్లీ చప్పరించడానికి గూట్లో దాచుకున్నట్లు... మనం కూడా గతాన్ని భద్రంగా జ్ఞాపకాల పేటికలో దాచుకోవాలి.**

పక్కూరికి ఫోన్ చేసినా, గొంతు చించుకోవలసిన కాలం నుంచి, సప్త సముద్రాల అవతల ఉన్నవారిని కూడా వాట్సాప్ దివ్యదృష్టితో చూసి, పలకరించగలిగే సౌకర్యాన్ని సామాన్యుడికి కల్పించిన కాలమిది. 'సినిమా చూడడమంటే థియేటర్‌కు వెళ్లాలి, తెరపై బొమ్మ పడాలి. రీల్ కట్ అయితే ఉస్సూరుస్సూరనాలి' అనే స్టేజీ నుంచి అరచేతిలో అంజనం వేసినంత సులభంగా సెల్‌ఫోన్‌లో సినిమాలు చూసేస్తున్న కాలమిది. వినైల్ గ్రామ్‌ఫోన్ రికార్డుల నుంచి ఆన్‌లైన్ సంగీతం వరకు– ఉత్తరాలు రాయడం దగ్గర్నుంచి, ఈమెయిల్, వాట్సాప్‌ల వరకూ– రేడియోలో క్రికెట్ మ్యాచ్ వ్యాఖ్యానాన్ని వినడం నుంచి 3D, HD టీవీల్లో ఆటను కళ్లారా చూడడం వరకు. అంతేనా, వీడియో క్యాసెట్ల నుంచి ఓటీటీలో చిత్రాలు చూడడం వరకు– పంచ్ కార్డులు, ఫ్లాపీ డిస్కులను ఉపయోగించడం నుంచి గిగాబైట్, మెగాబైట్‌లతో స్మార్ట్‌ఫోన్‌ల వరకు– సైకిళ్ల నుంచి మోటారు సైకిళ్లు, పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ కార్ల వరకు సామాన్యులూ ఎదిగారు. ఒకప్పటి ప్రాణాంతకమైన అంటు రోగాలు ఇప్పుడు అదుపులోకి వచ్చేశాయి.

మార్పులో ఇదొక పార్శ్వమైతే, మరొక పార్శ్వం కూడా వుంది. అది– తను తినడానికి ముందు మనిషి ఇతరుల ఆకలి గురించి ఆలోచించిన కాలం, ఇరుకిళ్లలో ఉంటూనే ఉమ్మడి కుటుంబాన్ని నిలబెట్టాలని తాపత్రయపడిన కాలం, డిగ్రీలతోనే పాండిత్యాన్ని, జీతంతోనే మనిషి విలువను కొలవని కాలం, గూగులమ్మ లేకుండానే జ్ఞానాన్ని సంపాదించిన కాలం, క్యాలిక్యులేటర్ లేకుండా లెక్కలు చేయగలిగిన కాలం, మొబైల్ చూడకుండా ఫోన్ నెంబర్లు గుర్తు పెట్టుకున్న కాలం, జీపీఎస్ లేకుండా గమ్యాలకు చేరిన కాలం, రీల్స్ ద్వారా కాకుండా మనుషుల ముఖతః జోకులు విన్న కాలం, ఏసీలు లేకుండా ఫ్యాన్లతోనూ, చెట్లనీడన కాలక్షేపం చేసిన కాలం, మినరల్ వాటర్, విటమిన్ సప్లిమెంట్లు అవసరం పడని కాలం, స్విగ్గీవాడు సమయానికి చేరకపోతే ముద్దకు నోచుకోలేమని భయపడని కాలం, ఆరేళ్ల వరకు బడి భయం లేకుండా, బాల్యమంటే ఆటలాడుకోవడమే అని నమ్మిన కాలం, రోగమొస్తే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి జేబులు గుల్ల చేసుకోవలసి వస్తుందని భయపడని కాలం, వ్యాయామానికి ప్రత్యేకంగా జిమ్‌లకు వెళ్లవలసిన అవసరం పడని, ఒళ్లు తగ్గడానికి ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌ల అగత్యం పడని కాలం!



ఇలా చెప్తూపోతే... పాత తరం వాళ్లు ఔనౌనంటూ తల ఊపుతారు, కొత్తతరం వాళ్లు విసుక్కుంటారు. ఏ తరానికి ఆ తరం తమది మరే ఇతర తరంతోనూ పోల్చడానికి వీల్లేని ప్రత్యేకమైన తరం అనుకుంటుంది. షేక్స్‌పియర్ చెప్పినట్లుగా, అసలు సమస్య అక్కడే ఉంది! ప్రతి తరం ఒకే రకమైన బలహీనతతో బాధపడుతుంది. తాము మెచ్చిన ఘంటసాల లేదా బాలూ పాట తర్వాత వచ్చిన సినిమా పాటలన్నీ భ్రష్టుపట్టిపోయాయని, తాము మెచ్చిన యద్దనపూడి లేదా యండమూరి తర్వాత వచ్చిన సాహిత్యమంతా చదవనక్కరలేని చెత్త అనీ, తామభిమానించిన రాజకీయ నాయకుల తర్వాత వచ్చిన వారందరూ చేతకాని వారనీ– ఇలా!


మనసెప్పుడూ... అవే పాత 'మంచి' రోజుల కోసం, పాత 'శ్రావ్యమైన' పాటల కోసం, పాత 'ప్రయోజనకరమైన' సాహిత్యం కోసం, పాత 'రుచికరమైన' వంటకాల కోసం వెంపర్లాడుతుంది, ఆరాటపడుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కొత్తకి మారాల్సి వచ్చినప్పుడు కూడా పాతది కంటిన్యూ అయితే బాగున్ననిపిస్తుంది. సెల్‌ఫోన్‌లో యాప్ తనను అప్‌డేట్ చేసుకోమన్నప్పుడు, లాప్‌టాప్ కొత్త వెర్షన్ డౌన్‌లోడ్ చేసుకోమని, లేకపోతే అడుగు ముందుకు పడనివ్వనని మొరాయిస్తున్నప్పుడు చికాకేస్తుంది. ఎందుకంటే కొత్త ఫార్మాట్ అనగానే పాత ఐకాన్లన్నీ ఎడమ నుంచి కుడికీ, కుడి నుంచి ఎడమకూ, పై నుంచి కిందకూ, కింది నుంచి పైకి మారడమే కాదు– రంగులూ, పేర్లూ కూడా మార్చేసుకుంటాయి. చచ్చీచెడి దీనికి అలవాటయ్యే లోపున లేటెస్ట్ వెర్షన్ డౌన్‌లోడ్ చేసుకోమనే సతాయింపు ప్రారంభమవుతుంది. కొత్తంటే భయపడడమనే దానికి 'జినోఫోబియా' అనే పేరు ఎప్పుడో పెట్టారు. కొత్త వెర్షన్ల డౌన్‌లోడ్ అంటే భయపడడానికి వేరే ఏదైనా పేరు కనిపెట్టాలి! ఏ లింకు ఓపెన్ చేస్తే, ఏది డౌన్‌లోడ్ చేసుకుంటే సమాచారం చోరీ, బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోతుందోనన్న భయమొకటి నిరంతరం వెంటాడుతోంది. ఈ సంక్లిష్ట, ఆందోళనాభరిత జీవితం కంటే... సరళంగా, గందరగోళ రహితంగా సాగిపోయిన పాత జీవితమే మెరుగనిపిస్తోంది. గుండెలు పీచుపీచు మనిపించే ఈ సాంకేతికత కంటే పాత కాలపు సంప్రదాయ బద్ధమైన లావాదేవీలే హాయనిపిస్తోంది.

"దూర్ గగన్ కీ ఛావ్ మేఁ" అనే హిందీ సినిమాలో నా అభిమాన గాయకుడు కిశోర్ కుమార్ ఎప్పుడో పాడేశాడు– 'కోయీ లౌటా దే మేరే బీతే హుయే దిన్' (అంటే... గడిచిపోయిన రోజులను నాకు ఎవరైనా తిరిగి యివ్వండి) అని. ఇది 1964 నాటి సినిమా. అప్పటికి బీతే హుయే దిన్ అంటే ఏ 40, 50ల రోజులై ఉంటాయి. నాకు మరీ అంత దురాశ లేదు. 1980–90లవి తిరిగిస్తే చాలు. ఏదో కాస్త ఆధునికత, కాస్త ప్రాచీనత! సర్దుకుంటాను. కానీ అవీ తిరిగి రావని తెలుసు. మన చేతిలో నిన్న లేదు, రేపూ లేదు, ఉన్నది వర్తమానం ఒక్కటే. కానీ షెల్లీ చెప్పినట్లు చేతిలో ఉన్నదాన్ని పట్టించుకోకుండా, లేని వాటి కోసం పరితపిస్తాం.

అక్కినేని నాగేశ్వరరావు గార్ని ఓ ఫంక్షన్‌లో కలిశాను. అప్పటికే ఆయనకు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. తన ప్రసంగంలో ఆయన తను యింకెంతకాలం జీవిస్తాననేది ముఖ్యం కాదని, ఉన్నంతకాలం ఆ వ్యాధితో పోరాడానా లేదా అన్నదే ముఖ్యమని అన్నారు. 'వంద సంవత్సరాలు నక్కలా బతకడం కంటే, ఒక్క రోజు సింహంలా బతకడం మేలు' అన్నాడట టిప్పు సుల్తాన్! నాగేశ్వరరావుగారి గతం ఎంతో ఘనం. దాన్ని తలచుకుని కృంగిపోలేదు. రేపు ఎలా ఉంటుందో, అసలు ఉంటుందో లేదో అని బెంగ పెట్టుకోలేదు. ఇవాళ ఉంది, ఇలా ఉంది. దీనితో ఎలా వ్యవహరించాలి అనే దానిపైనే ఆయన ఫోకస్.

గడిచిపోయిన రోజుల జ్ఞాపకాలు అందించే వెచ్చదనాన్ని, సౌఖ్యాన్ని అప్పుడప్పుడు ఆస్వాదించడం అవసరమే. చిన్న పిల్లలు పిప్పర్‌మెంట్‌ను కాస్సేపు చప్పరించి, రేపు మళ్లీ చప్పరించడానికి గూట్లో దాచుకున్నట్లు... మనం కూడా గతాన్ని భద్రంగా జ్ఞాపకాల పేటికలో దాచుకోవాలి. ఇవాళ్టికీ జీవించే అవకాశాన్ని ప్రసాదించిన దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ వర్తమానాన్ని వీలైనంత ఎక్కువగా ఆస్వాదించాలి. హిందీ సినిమా "వక్త్"లో సాహిర్ అంటాడు– 'ఆగే భీ జానే న తూ, పీఛే భీ జానే న తూ..' అని. 'రేపటిలోకి దూసుకుని వెళ్లడమూ నీ తరం కాదు, నిన్నలోకి ముడుచుకుపోవడమూ నీ తరం కాదు, నీ చేతిలో ఉన్నది ఈ క్షణం మాత్రమే. ఏవైనా ఆశలుంటే యిప్పుడే తీర్చుకో' అంటాడు కవి. తెలుగులో కూడా ఒక పాట చరణంలో 'నిన్న మరల రాదు, రేపు మనది కాదు, నేడే నిజం' అని. మహానుభావుడు గాలిబ్ ఎప్పుడో చెప్పాడు– 'హాల్ సే లుఫ్త్ అందోజ్ హూఁ, ఔర్ ముస్తకబిల్ కే గాలిబ్ శర్ కే ఫికర్ న కరూఁ' అని. నేను వర్తమానం నుంచే ఆనందాన్ని పొందుతున్నాను. రేపేదో కష్టం వచ్చి పడుతుందన్న ఆందోళనను దరిచేరనివ్వను అంటాడు.

> **...తను తినడానికి ముందు మనిషి ఇతరుల ఆకలి గురించి ఆలోచించిన కాలం, ఇరుకిళ్లలో ఉంటూనే ఉమ్మడి కుటుంబాన్ని నిలబెట్టాలని తాపత్రయ పడిన కాలం, డిగ్రీలతోనే పాండిత్యాన్ని, జీతంతోనే మనిషి విలువను కొలవని కాలం, గూగులమ్మ లేకుండానే జ్ఞానాన్ని సంపాదించిన కాలం, ఒళ్లు తగ్గడానికి ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌ల అగత్యం పడని కాలం!**



మనమూ అదే ధోరణి అలవర్చుకోవాలి. 2026లో మరో కరోనా వస్తుందా? గ్లోబల్ వార్మింగ్ వలన హిమాలయాలు కరిగి వరదలు ముంచెత్తుతాయా? సూర్యకాంతిలో వేడి తగ్గి, మొక్కలు పెరగడం మానేస్తాయా? కుజగ్రహ శకలం భూమిని ఢీ కొట్టి మూడు వంతుల జనాభా భస్మమైపోతుందా? అగ్రదేశాలు అణ్వస్త్ర యుద్ధానికి పాల్పడతాయా? మన రాశ్యాధిపతులైన గ్రహాలు తమలో తాము కలహించుకుని మన కొంప ముంచుతాయా? ధర పెరిగి, వెండే బంగారమవుతుందా?– ఇలాంటి థంబ్‌నెయిల్స్‌తో పుంఖానుపుంఖాలుగా వచ్చి పడే యూట్యూబ్ వీడియోల జోలికి పోకుండా హాయిగా ఈ రోజును, ఈ సంవత్సరాన్ని ఎంజాయ్ చేయండి. ఇవే నా శుభాకాంక్షలు.

■ **డా. మోహన్ కందా**
విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఉమ్మడి ఆం.ప్ర. ప్రభుత్వం

కొత్త ఏడాదిలో మరో రహదారి దోపిడీ!

మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) పేరుతో కేంద్ర ప్రభుత్వ భూ రవాణా శాఖ మరో దోపిడీకి తెరలేపనున్నది. ఈ కొత్త సంవత్సరం నుంచి ఈ పద్ధతి మొదలవుతుందని కేంద్రమంత్రి గడ్కారీ ఇటీవల లోక్‌సభలో ప్రకటించారు. ఇదివరకు బీఓటీ (బిల్డ్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో రహదారులు నిర్మించి, టోల్ వసూలు చేసినప్పుడు టాగ్ లేకుండా మాన్యువల్‌గా టాక్స్ వసూలు చేసేవారు. అయితే దీని వల్ల ఆలస్యం అవుతుందని, అందువల్ల ఫాస్ట్‌టాగ్ విధానాన్ని అమలు చేస్తున్నామనీ ప్రకటించి వాహన యజమానులతో ఫాస్ట్ టాగ్ స్టికర్లు కొనిపించింది ప్రభుత్వం. ఈ ఫాస్ట్‌టాగ్ కొనుగోలుకు ఒక్కొక్క వాహన యజమాని నుంచి తిరిగి చెల్లించని డిపాజిట్ రూ.500 నుంచి 1000 వరకు వసూలు చేశారు. ఇలా దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలు



వసూలు జరిగింది. టోల్ అకౌంట్లో కనీసం 500 రూపాయల బ్యాలెన్స్ వుంచాలనీ, లేనిపక్షంలో రెట్టింపు టాక్స్ వసూలు చేయాలనీ నిబంధన పెట్టడం వల్ల వాహనదారులు లక్షల రూపాయలను అనవసరంగా అకౌంట్స్‌లో నిల్వ ఉంచుతున్నారు.

తాజాగా కొత్త సంవత్సరంలో ఎంఎల్ఎఫ్ఎఫ్ విధానం అమలయ్యే పక్షంలో ప్రస్తుతం వాడుకలో ఉన్న ఫాస్ట్‌టాగ్ స్టికర్లు ఉపయోగపడవు. ఈ విధానంలో టోల్‌గేట్ల వద్ద నేషనల్ హైవే అధికారులు పెద్ద ఏంటెనా, ఆటోమ్యాటిక్ నెంబర్‌ప్లేట్ రికగ్నైజేషన్ కెమెరాలు ఏర్పాటు చేసి టోల్ టాక్స్ వసూలు చేస్తారు. అందుకు తగినట్టు వాహన యజమానులు వాహనాల నెంబరు ప్లేట్‌లు కెమెరాకు కనిపించే విధంగా మార్చుచేయాలి. దాంతో మరలా వాహనదారులు వెయ్యి రూపాయల చేతి చమురు వదుల్చుకోవాలి. ఈ నెంబరు ప్లేట్‌కు ఎంత వసూలు చేస్తారో, నెంబరు ప్లేట్ సప్లయ్ చేసే కాంట్రాక్టును ఏ బడాబాబుకు ఇస్తారో వేచి చూడాలి. నిజానికి అసలు టోల్ గేట్ వసూలు చేయకూడదు. తొలుత స్వర్ణచతుర్భుజి పథకంలో జాతీయ రహదారులను బీఓటీ పద్ధతిలో నిర్మించినప్పుడు, టోల్ టాక్స్ ఇరవై ముప్పై ఏళ్ళ పాటు మాత్రమే ఉంటుందనీ, ఆ తర్వాత ఉండదనీ ప్రకటించారు. కానీ టోల్ టాక్స్‌ల ద్వారా లక్షల కోట్ల ఆదాయానికి అలవాటు పడిన కేంద్ర ప్రభుత్వం దాన్ని ఒక హక్కుగా భావించి నిరంతరం వసూలు చేస్తూనే ఉంది.

వాహనం కొన్నప్పుడు 18శాతం జీఎస్టీతో పాటు రోడ్ టాక్స్ కూడా వసూలు చేస్తారు. అంతేగాక జాతీయ రహదారుల అభివృద్ధికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తులపై రోడ్ డెవలప్‌మెంట్ సెస్‌ను విధిస్తోంది. ఈ టాక్స్ ద్వారా ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వసూలు చేస్తోంది. నిబంధనల ప్రకారం ఈ నిధులను రోడ్ల అభివృద్ధికి వాడాలి. కానీ ఆ నిధులను ఇతర అవసరాలకు వాడుతున్నారు.

ఎంఎల్ఎఫ్ఎఫ్ విధానం గురించి కేంద్రమంత్రి గడ్కారీ లోక్‌సభలో మాట్లాడుతూ దీనివల్ల దేశవ్యాప్తంగా 1500 వందల కోట్ల ఇంధనం ఆదా అవుతుందని ప్రకటించారు. వెనక నుంచి ఏనుగులు పోయినా ఫర్వాలేదు, ముందు నుంచి పిన్నులు కూడా పోకూడదన్నట్టుగా ఒకపక్క వాహనదారులపై లక్షల కోట్ల రూపాయల అదనపు భారాన్ని వేస్తూ మరోపక్క రూ.1500 కోట్ల ఇంధనం పొదుపు అవుతుందని ప్రకటించడం హాస్యాస్పదం!

○ **అన్నవరపు బ్రహ్మయ్య**
సీనియర్ పాత్రికేయులు

అనుభవాల అంతర్వాహిని



కాలం ఒక కదులుతున్న కావ్యం
మనం రాసుకునే అనుభవాల సంతకం
రాలిపోయిన ఆకు గతాన్ని గుర్తు చేస్తే
చిగురించిన మొగ్గ రేపటిని తెలియజేస్తుంది
కన్నీళ్లు కడిగేసిన గాయాలన్నీ
రేపటి గెలుపుకు పునాది రాళ్లు
గడియారం ముల్లు తిరుగుతున్న ప్రతిసారీ
జీవితం ఒక పాఠాన్ని నేర్పుతూనే ఉంటుంది
నిన్నటి నిరాశలను నిద్రపుచ్చి
నేటి ఉత్సాహాన్ని ఊపిరిగా మలచుకో
కాలం నీ చేతుల్లో చిక్కుపడని దారం కాదు
నీ సంకల్పంతో నువ్వు నేయాల్సిన
అందమైన వస్త్రం
ముగిసిన ఏడాది ఒక అనుభవం
మొదలయ్యే కాలం ఒక అద్భుతం



– పూసపాటి వేదాద్రి

నిన్న లేని అందం

ఆది అంతాలను నమోదు చేసే గుమస్తా కాలం
ఎప్పుడూ అది కనిపించలేదు
కాని దాని అనుక్షణ స్పర్శను కాదనలేం
కనిపించని దానికే
విశ్వవ్యాప్తమయ్యే శక్తి ఉంటుందేమో
కలలకు తాకట్టుపడి బతుకుతున్నవాణ్ణి
కాలం ప్రపంచంలోకి నడిపిస్తుంది
కేకులు కోసి కేకలు వేస్తున్నారు
అమ్మాయి వేసిన ముగ్గుమీద
డ్యాన్సు చేస్తూ వెళ్ళాడు తాగుబోతు
గ్రేట్ దేవుణ్ణి గ్రీట్ చేస్తున్నారు భక్తులు
'నిన్నలేని అందమేదో నిదురలేచెనెందుకో'
అంటూ తనలో తానే పాడుకుంటున్నది పాట
రాలిన పూవు పక్కనే పూసింది మరో పూవు
చెవిలో గుసగుసగా చెప్పింది పరిమళం
'ఈ పూవే కొత్త సంవత్సరమ'ని. ఆ వెంటనే
రెపరెపలాడే కాగితం పెదవులతో
'హ్యాపీ న్యూయియర్' చెప్పింది కొత్త క్యాలెండర్

– అమ్మంగి వేణుగోపాల్

తొలి అడుగు...

కాలం వేసిన ఈ కొత్తకొమ్మే
రెండువేల ఇరువై ఆరు
మారుతున్న రోజులన్నీ
ఆ కొమ్మ పూలై వికసిస్తాయి
నూతన సంవత్సరం ఎప్పుడైనా
గత సంవత్సరం పునాదులపై నిలుచుని
భవిష్యత్‌లోకి అడుగిడుతుంది
విపత్తులొచ్చినా వినోదాలిచ్చినా
కాలం మునుముందుకే నడుస్తుంది
వెనుకంజ దానికి తెలియని నడవడి
కాలంతో పాటు కదలడం ప్రాణి లక్షణం
కదలనని భీష్మించుకోవడం కుదరని పని
ఎవరినైనా తనతో లాక్కు వెళ్ళడమే కాలం ధర్మం
దాని ప్రయాణానికి రెండు చేతులెత్తి
ఆహ్వానించడమే మనకున్న ఏకైక విధి
చైతన్య సాకారమైన కాల పరిణామాలకూ
మార్పులను మోసుకొచ్చే కాల ప్రమాణాలకూ
చేతనమై మొక్కి ప్రణమిల్లుదాం
కోటి కాంతుల ప్రభతో వస్తున్న
నూతన సంవత్సరానికి స్వాగత గీతాలు ఆలపిద్దాం

– వై.హెచ్.కె. మోహన్‌రావు

కొత్త సంవత్సరం వేళ విశాఖలో డ్రగ్స్ కలకలం

- 3.8 గ్రాముల ఎండీఎంఏ, 5.3 కిలోల గంజాయి స్వాధీనం
- పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వేడుకల వేళ విశాఖ నగరంలో డ్రగ్స్ పట్టుబడడం కలకలం రేపింది. ముగ్గురు యువకులు స్కూటీపై డ్రగ్స్, గంజాయి తరలిస్తుండగా ఎం.వి.పి. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3.8 గ్రాముల ఎండీఎంఏ పౌడర్‌తోపాటు 5.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎంవీపీ పోలీస్ స్టేషన్ సీఐ కెన్ఎస్‌వీ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లికి చెందిన కాండ్రేగుల జయవినయ, చోడవరానికి చెందిన బీలా సాయిలోహిత్, నగరంలోని ఇసుకతోటకు చెందిన కొంకి శ్యామ్ స్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి న్యూఇయర్ సందర్భంగా జరిగే వేడుకల కోసం బెంగళూరు నుంచి ఐదు గ్రాములు ఎండీఎంఏ పౌడర్‌ను, ఏజెన్సీ నుంచి 5.3 కిలోల గంజాయి తెప్పించారు. అందులో 1.2 గ్రాముల ఎండీఎంఏను ముగ్గురూ వినియోగించి, మిగిలిన ఎండీఎంఏ పౌడర్‌తోపాటు గంజాయిని ఇతరులకు విక్రయించేందుకు బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై లాసన్స్‌బే కాలనీలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్ జంక్షన్ మీదుగా వెళుతున్నట్టు సీఐ ప్రసాద్‌కు సమాచారం అందింది. ఎంవీపీ సెక్టార్-11 వద్ద నిందితుల వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. ఎండు గంజాయితో పాటు ఎండీఎంఏ పౌడర్ లభించింది. వారి బ్యాగ్‌లో 56 జిప్‌లాక్ కవర్లు, డిజిటల్ వేయింగ్ మిషన్, నాలుగు మొబైల్ ఫోన్లు లభ్యమయ్యాయి. వారి వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు యువకులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రసాద్ తెలిపారు.

రెండో రోజూ సాఫీగా వైకుంఠ ద్వార దర్శనాలు

వేడుకగా చక్రస్నానం

ఏకాదశి రోజు 67,053 మందికి శ్రీవారి దర్శనం



సుదర్శన చక్రత్తాళ్వారును పుష్కరిణిలో మునక వేయిస్తున్న అర్చకులు



లడ్డూ కౌంటర్లకు వెళ్లే దారిలో భక్తుల రద్దీ

తిరుమల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశి సందర్భంగా బుధవారం వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు ప్రశాంత వాతావరణంలో భక్తులు వైకుంఠ ద్వార ప్రవేశం చేసి ఆనందపరవశులయ్యారు. తొలిరోజు తరహాలోనే రెండో రోజూ స్లాటెడ్ భక్తులు క్యూలైన్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా శ్రీవారి దర్శనంతో పాటు వైకుంఠ ద్వార ప్రవేశం చేశారు. సాయంత్రం 6 గంటల సమయానికి 51 వేల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక, కొండపై భక్తుల రద్దీ మోస్తరుగానే ఉంది. శ్రీవారి ఆలయం మినహా మిగిలిన ప్రాంతాల్లో భక్తులు పలుచగానే కనిపించారు. ద్వాదశి సందర్భంగా మంగళవారం వేకువజామున చక్రస్నానం నిర్వహించారు. ఉత్సవమూర్తుల తరపున శఠారి వరాహస్వామి మండపానికి చేరుకోగా, సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నాన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కాగా, వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం 67,053 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. గతేడాది వైకుంఠ ఏకాదశి రోజుతో పోలిస్తే 6,959 మంది ఎక్కువగానే శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అలాగే 16,301 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

టీటీడీ విద్యాదానం ట్రస్టుకు రూ.కోటి విరాళం



టీటీడీ విద్యాదానం ట్రస్టుకు బుధవారం రూ.కోటి విరాళంగా అందింది. గుంటూరుకు చెందిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య ఈ విరాళాన్ని ఇచ్చారు. తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం చెక్‌ను అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

ప్రాణం తీసిన నిద్రమత్తు

- ముందు వాహనాన్ని ఢీ కొట్టడంతో మంటలు
- మినీవ్యాన్ డ్రైవర్ సజీవ దహనం, మరొకరికి గాయాలు



మంటల్లో దగ్ధమవుతున్న వాహనం

రాచర్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిద్ర మత్తు నిండు ప్రాణాన్ని బలిగొంది. ముందు వెళుతున్న వాహనాన్ని మినీవ్యాన్ ఢీకొనడంతో మంటలు చెలరేగి డ్రైవర్ సజీవ దహనం కాగా అతని పక్కన కూర్చున్న వాహన యజమానికి గాయాలయ్యాయి. ఈ ఘటన మార్కాపురం జిల్లా రాచర్ల మండలం రంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో నంద్యాల-ఒంగోలు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగింది. జీడిపప్పు లోడుతో తుని నుంచి మినీవ్యాన్ అనంతపురం వెళ్తోంది. బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకు రంగారెడ్డిపల్లి సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులో ముందు వెళుతున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా వ్యాన్‌లో మంటలు చెలరేగాయి. డ్రైవర్ ఎర్రిస్వామి(50) క్యాబిన్‌లో స్టీరింగ్, సీట్ మధ్యలో ఇరుక్కుని బయటపడే వీలు లేక సజీవ దహనమయ్యాడు. అతని పక్కనున్న యజమాని కన్నంపల్లి జయరామిరెడ్డి స్వల్పగాయాలతో బయటపడగా 108లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు ఎర్రిస్వామిది అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం నిమ్మగల్లు కాగా, జయరామిరెడ్డిది అనంతపురం పట్టణం. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపక సీఐ చంద్రశేఖర్‌రావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. యడవల్లి వీఆర్వో ఎస్.రంగయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతి

- 'అనంత'లో విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు




షౌకత్

అనంతపురం క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో జరుగుతున్న నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. నగర శివారులోని హార్మోని సిటీలో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో విద్యుదాఘాతంతో అనంతపురం వేణుగోపాలనగర్‌కు చెందిన షౌకత్(24) అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హార్మోని సిటీలో గాయని మంగ్లీ, పలువురు బుల్లితెర నటులను రప్పించి బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకూ వేడుకలు నిర్వహించారు. దీని కోసం నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. వేదికపై జరుగుతున్న ఈవెంట్‌ను ప్రదర్శించేందుకు విశాలమైన ప్రాంగణంలో అక్కడక్కడ టీవీలను ఏర్పాటు చేయించారు. ఈ పనులు బుధవారం రాత్రి 8 గంటల వరకూ కొనసాగాయి. ఒకవైపు ఈవెంట్ జరుగుతున్నా, విద్యుత్, టీవీల ఏర్పాటు పనులు కొనసాగాయి. ఈ క్రమంలో షౌకత్‌తో పాటు పలువురు జనరేటర్ వద్ద పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షౌకత్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. ఇంత జరిగినా ఈవెంట్ నిర్వాహకులు పట్టించుకోలేదు. బాధితులు బోరున విలపిస్తున్నా, వేదికపై ఆటపాటలు కొనసాగాయి. అక్కడే ఉన్న పోలీసులు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకుని వేదికవైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. నిండు ప్రాణం బలైనా ఈవెంట్ కొనసాగడం విమర్శలకు తావిస్తోంది.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

- సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- విశాఖలో అఖిల భారత మహాసభలు ప్రారంభం



సీఐటీయూ అఖిల భారత మహాసభలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్. వేదికపై సీఐటీయూ అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత, డబ్ల్యుఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిర్చస్, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తదితరులు

బీచ్‌రోడ్డు (విశాఖపట్నం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును రక్షించుకోవాలని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు బీచ్‌రోడ్డులో గల ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాలులో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం తపన్‌సేన్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంటును బలహీనపరిచే కుట్రలను ఈ తీర్మానం ఎండగట్టిందన్నారు. అఖిల భారత సీఐటీయూ అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తేదీన సమ్మె చేస్తున్నట్టు ప్రకటించారు. డబ్ల్యుఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిర్చస్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక కోడ్‌లను బలవంతంగా అమలు చేయడానికి యత్నిస్తే ప్రతిఘటన తప్పదన్నారు. కార్మిక కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

క్లైమాక్స్ అలరిస్తుంది



కన్నడలో ఘన విజయం సాధించిన 'గత వైభవం' చిత్రం ఈ రోజు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా సునీ దర్శకత్వంలో తెరకెక్కింది. కే నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో దుష్యంత్ మాట్లాడుతూ 'ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా సాగితే, ద్వితీయార్థం ఎమోషనల్‌గా సాగుతుంది. డబ్బింగ్ చిత్రంలా కాక ఒరిజినల్ తెలుగు సినిమా చూసిన అనుభూతిని ప్రేక్షకులకు ఇస్తుంది' అని చెప్పారు. ఈ సినిమా ప్రీమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన వస్తోంది, పతాక సన్నివేశాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి అని ఆషికా రంగనాథ్ చెప్పారు.

కుటుంబ కథా చిత్రం



రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ తెరకెక్కించిన చిత్రం 'సఃకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మించారు. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. నేడు ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉదయ్ శర్మ మాట్లాడుతూ 'ప్రేక్షకులంతా తప్పక చూడాల్సిన కుటుంబ కథా చిత్రమిది. అందర్నీ ఆకట్టుకుంటుంది. కుటుంబ విలువలను మరింత గొప్పగా ఇందులో చూపెడుతున్నాం' అని అన్నారు. 'ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అని రామ్‌కిరణ్ చెప్పారు.

దీక్ష గీతం



కిరణ్ హీరోగా నటించిన 'దీక్ష' చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రం ట్రైలర్‌ను, ఓ పాటను బుధవారం విడుదల చేశారు. చిత్ర దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీనాయక్‌ను గుర్తు చేసుకుంటూ ఓ పాట ఇందులో పెట్టాం. ఫిబ్రవరిలో సినిమా విడుదల చేస్తాం' అన్నారు.

శక్తిమంతమైన లుక్‌లో...



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్'. వచ్చే ఏడాది మార్చి 19న విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి నయనతార పాత్రను పరిచయం చేశారు మేకర్స్. బ్లాక్ డ్రెస్‌లో చేతిలో ఓ గన్ పట్టుకుని క్యాసినో నుంచి నడుచుకుంటూ వస్తున్న ఫస్ట్ లుక్ ఆకట్టుకుంటోంది. గంగ అనే శక్తిమంతమైన పాత్రలో ఆమె కనిపించనున్నట్లు తెలిపారు. కియారా అడ్వాణీ హుమా ఖురేషీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మాన్‌స్టర్ క్రియేషన్స్, కేవీన్ ప్రొడక్షన్స్ బేనర్లపై యశ్, వెంకట్ కే నారాయణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

అందర్నీ నవ్వించే చిత్రం



నవీన్ పొలిశెట్టి

'అనగనగా ఒక రాజు' చాలా వినోదాత్మక చిత్రం. ఆద్యంతం వినోదభరితంగా సాగుతుంది' అని అన్నారు కథానాయకుడు నవీన్ పొలిశెట్టి. ఆయన, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అనగనగా ఒక రాజు'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. శ్రీకార స్టూడియోస్ సమర్పిస్తోంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా రాజుగారి పెళ్లి రిసెప్షన్ వేడుకను నిర్వహించారు మేకర్స్. ఈ కార్యక్రమంలో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ 'టీమ్ అంతా మనసు పెట్టి చేసిన చిత్రమిది. కచ్చితంగా అందర్నీ కడుపుబ్బా నవ్విస్తుంది' అని కోరారు. 'మంచి కుటుంబ కథా చిత్రమిది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది. సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని మీనాక్షీ చౌదరి తెలిపారు.

చాలా కాలం మాట్లాడుకునే సినిమా



శ్రీ నందు

'కథను నమ్మి చేసిన సినిమా 'సైక్ సిద్ధార్థ' అని చెప్పారు శ్రీ నందు. ఆయన హీరోగా వరుణ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. నందు నెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్, స్పిరిట్ మీడియా బ్యానర్లపై నందు, శ్యామ్ సుందర్ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది ఈ సందర్భంగా శ్రీ నందు మాట్లాడుతూ 'ఒక అమ్మాయి చేతిలో మోసపోయిన అబ్బాయి.. మరో అమ్మాయి ద్వారా ఎలా బాగుపడతాడు అనేది ఈ చిత్ర కథాంశం. ప్రతీ సన్నివేశం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు వరుణ్ రచన, మేకింగ్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయి. నా కెరీర్‌లోనే ప్రత్యేక చిత్రంగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. కొత్త రకం కథనంతో వస్తున్న ఈ న్యూ ఏజ్ ఫిల్మ్ అందర్నీ మెప్పిస్తుంది. సినిమా ఫస్టాఫ్ గురించి చాలా కాలం మాట్లాడుకుంటారు. సెకండాఫ్ చాలా భావోద్వేగభరితంగా ఉంటుంది. ప్రేక్షకులకు కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది. ముఖ్యంగా యువతరానికి విపరీతంగా నచ్చుతుంది' అని చెప్పారు.





గుంటూరు : సాయిబాబా రోడ్డు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద యువత కేరింతలు



గుంటూరు : రింగురోడ్డులో యువకులను చెదరగొడుతున్న పోలీసులు

పింఛన్ సొమ్ము సద్వినియోగం చేసుకోవాలి

- లబ్ధిదారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచన

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెలా ఇంటి వద్దకే పంపిస్తోన్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదుని లబ్ధిదారులు జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా సూచించారు. బుధవారం స్థానిక మిర్చియార్డు సమీపంలోని సుబ్బారెడ్డినగర్‌లో పింఛన్లను నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి జీవన విధానం, రేషన్ సరఫరా, ఆరోగ్య పరిస్థితిని, ప్రభుత్వం నుంచి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి కలెక్టర్ ప్రత్యేకంగా తెలుసుకున్నారు. ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని పలువురు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం కేవీపీకాలనీలో నిర్మాణంలో ఉన్న సిమెంటు రోడ్డును పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు.



సుబ్బారెడ్డినగర్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా , కమిషనర్ శ్రీనివాసులు

శుభ్రమైన ఆహారం అందించాలి

మిర్చియార్డులోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. నాణ్యమైన, రుచికరమైన, శుభ్రమైన ఆహారం నిర్దేశిత పరిమాణంలో ప్రజలకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అల్పాహారాన్ని భుజించి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఆహార సరఫరాతో పాటు, ఇతర మౌలిక సౌకర్యాల నిర్వహణను నగర పాలక సంస్థ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉపా సెల్ పీవో సింహాచలం, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

న్యూ జోష్

- యువత సందడే సందడి
- జిల్లాలో అంబరాన్నంటిన వేడుకలు
- నూతన సంవత్సరానికి ఘన స్వాగతం



గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2026 నూతన సంవత్సరానికి జిల్లావాసులు ఘనంగా ఆహ్వానం పలికారు. జిల్లా అంతటా బుధవారం రాత్రి నుంచే నూతన సంవత్సర సందడి నెలకుంది. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్‌లు కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. యువకుల సందడితో ఆయా ప్రాంతాలు దద్దరిల్లాయి. కోటి ఆశలతో అర్ధరాత్రి కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టారు. ఈ ఏడాదంతా మధురానుభూతులు పంచాలని ఆకాంక్షించారు. బుధవారం సాయంత్రం నుంచే జిల్లాలో నూతన సంవత్సర శోభ కనిపించింది. విద్యా సంస్థల్లో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధుల గృహాల్లో నూతన సంవత్సరం వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వ్యాపార, విద్యా సంస్థలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వీట్స్ షాపులు, బేకరీలు కిటకిటలాడాయి. కేక్‌లు, రెస్టారెంట్లలో ఆఫర్లు ఏర్పాటు చేశారు. కేక్ కొనుగోలు చేస్తే ఉచితంగా కోక్ బాటిల్స్ ఆఫర్ ఇచ్చి భారీగా విక్రయాలు చేశారు. భారీగా మద్యం కొనుగోళ్లు జరిగాయి. బిర్యానీలు, నాన్ వెజ్ వంటకాలకు డిమాండ్ ఏర్పడింది. అపార్టుమెంట్లలో ఉండే కుటుంబాలంతా ఒకచోటికి చేరుకుని కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నాయి. గుంటూరు, మంగళగిరి, తెనాలి తదితర ప్రాంతాల్లో కొన్ని హోటల్స్ సంగీత విభావరి కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. రాజకీయ నాయకులు, అధికారులు తమ నివాసాల్లో నూతన సంవత్సర వేడుకల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. న్యూ ఇయర్ సందర్భంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్వీట్ షాపులో కొనుగోళ్ల సందడి



5న గుంటూరుకు చంద్రబాబు

ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరు కానున్న సీఎం

- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నుంచి గుంటూరులో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మహాసభల్లో భాగంగా చివరి రోజు ముగింపు సందర్భంగా 5న జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ క్రమంలో గుంటూరు శివార్లలో జాతీయరహదారిపై శ్రీ సత్యసాయి స్పిరిట్యుయల్ ట్రస్ట్‌లో జరుగుతున్న ఏర్పాట్లను జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి కలెక్టర్ తమీమ్‌అన్సారియా బుధవారం పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. సత్యసాయి ప్రాంగణంలో మహాసభల సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రతినిధులు గజల్ శ్రీనివాస్, రామచంద్రరాజు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ అబ్దుల్ అజీజ్, తహసీల్దార్లు వెంకటేశ్వరరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.



మహాసభల ఏర్పాట్లను కలెక్టర్ అన్సారియాకు వివరిస్తున్న గజల్ శ్రీనివాస్, రామచంద్రరాజు

4న మారిషస్ దేశాధ్యక్షుడు రాక

తెలుగు ప్రపంచ మహాసభల్లో రెండో రోజు ఆదివారం జరిగే కార్యక్రమంలో మారిషస్ దేశాధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైనట్లు బుధవారం గుంటూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో సభల నిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. మహాసభల కవి సమ్మేళనంలో వెయ్యి మంది కవులు, 150 మంది గాయకులు, 60 విద్యా సంస్థల నుంచి 25 వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. 42 దేశాల నుంచి ప్రతినిధులు తరలిరానున్నారన్నారు. ఆధ్యాత్మిక వేదికలపై హోమాలు, యజ్ఞాలు, కల్యాణాలు, ప్రవచనాలు, భక్తి సంగీత విభావరి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఖడ్గతిక్కన అనే చారిత్రక నాటకం ప్రదర్శన జరుగుతుందన్నారు. తెలుగు వైభవాన్ని చాటి చెప్పిన హస్తకళలు, పురాతన నాణేలు, ప్రదర్శన శాలలో ప్రదర్శిస్తామన్నారు. వారికి ఉచితంగా వసతి, రవాణ, భోజన సదుపాయాలు కల్పించామన్నారు. 3న ఉదయం 10.30 గంటలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిగంటం శ్రీనరసింహ ప్రారంభోపన్యాసం చేస్తారున్నారు.

సీనియర్ అసిస్టెంట్లు.. జీఎస్టీవోలుగా..

సీటీ శాఖలో 11 మందికి ఉద్యోగోన్నతులు

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నుల శాఖ జోన్-3 పరిధిలో 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించారు. అర్హులైన 11 మంది సీనియర్ అసిస్టెంట్లను గూడ్స్ సర్వీస్ టాక్స్ ఆఫీసర్లు(జీఎస్టీవో)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ చీఫ్ కమిషనర్ ఏ బాబు, గుంటూరు నోడల్ అధికారి జేసీ గీతా మాధురి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని రీజనల్ కార్యాలయంలో ముగ్గురిని, చీఫ్ కమిషనర్ కార్యాలయంలో నలుగురిని, జోన్‌లో మరో నలుగురికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పోస్టింగ్‌లు కల్పించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగోన్నతులు కల్పించడంతో ఆయా ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజలకు మంత్రి అనగాని.. నూతన సంవత్సర శుభాకాంక్షలు



మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ప్రజలకు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని ప్రజలంతా నూతన సంవత్సరంలో పాడి పంటలతో కళకళలాడుతూ కుటుంబాలు సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. 2026లో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినానాటి నుంచి రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నదన్నారు. పేదల ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని రైతులు సంతోషంగా ఉండాలని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

అమరావతిలో పనుల నిర్వహణపై అధికారులకు శిక్షణ

తుళ్లూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో కాంట్రాక్ట్ నిర్వహణపై సమగ్ర సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏడీసీఎల్, ఏపీ సీఆర్డీఏ, పీజీఎంసీ, ఏఎంసీల అధికారులకు శిక్షణ నిర్వహించారు. మొత్తం 40 మంది కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యంగా అమరావతి అభివృద్ధి పనుల సందర్భంలో కాంట్రాక్ట్ నిర్వహణ ప్రాథమిక అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఒప్పందాల రకాలు, ప్రామాణిక రూపాలు, కీలక నిబంధనలు, వివాద పరిష్కార విధానాల గురించి శిక్షణలో ప్రస్తావించారు. సాంకేతిక సెషన్లను ఎం.ఆర్.టి ఆయన బృందం సభ్యులు జ్ఞానేశ్వర్, పవన్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివరణాత్మక ప్రదర్శనలు ఇచ్చారు. అమరావతి అభివృద్ధి పనుల నాణ్యత, పారదర్శకత సకాలంలో డెలివరీని నిర్ధారించడంలో కాంట్రాక్ట్ నిర్వహణ ప్రాముఖ్యతను ఏపీ సీఆర్డీఏ, పీఎంసీ కెపాసిటీ బిల్డింగ్ సీనియర్ నిపుణుడు డాక్టర్ కె.సూర్యనారాయణ వివరించారు. అమరావతిలో సమర్థవంతమైన కాంట్రాక్ట్ నిర్వహణ, అధిక నాణ్యత ప్రాజెక్టు అమలు కోసం సంస్థాగత సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఏపీ సీఆర్డీఏ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ శిక్షణ ముగిసింది. సామర్థ్య నిర్మాణ బృందం సభ్యులు జి.గంగాధర్, ఎం.మోహన్‌రావు సీఆర్డీఏ, ఏడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పత్తి రైతుల సంక్షేమం కోసం సీసీఐ సరికొత్త విధానాలు

● సీసీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్




నీరజ్‌కుమార్, సీసీఐ డీజీఎం

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల సంక్షేమం కోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరికొత్త మార్పులను ప్రవేశపెట్టిందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ నీరజ్‌కుమార్ తెలిపారు. మెరుగైన డిజిటల్ కార్యక్రమాల వలన పత్తి సేకరణ పెరిగింది. తద్వారా రైతు భాగస్వామ్యం గతంలో కంటే మెరుగుపడిందన్నారు. పత్తి రైతులకు సాధికారత కల్పించడం, రాష్ట్ర వ్యాప్తంగా పత్తి సేకరణ కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పలు రైతు కేంద్రీకృత సంస్కరణలను ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణలలో భాగంగా కాపాస్ కిసాన్ మొబైల్ అప్లికేషన్ ఒక ముఖ్యమైన మైలురాయిగా పేర్కొన్నారు. ఇది రైతులు తమ పంట సేకరణ స్లాట్లను ఎంతో సులభంగా, పారదర్శకంగా బుకింగ్ చేసుకునే వీలు కల్పిస్తుంది. ఈ యాప్ వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే సమయం గణనీయంగా తగ్గించడం జరిగిందన్నారు. పత్తి విక్రయ ప్రక్రియ మరింత క్రమబద్ధంగా, సజావుగా సాగేలా చేస్తున్నదన్నారు. ఈ డిజిటల్ కార్యాచరణ మెరుగుదల ఫలితంగా ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలో పత్తి సేకరణ పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి 14,63,341.24 క్వింటాళ్ల పత్తిని సేకరించగా ఈ సంవత్సరం 15,73,108.98 క్వింటాళ్లకు చేరుకొందన్నారు. ఇది 7.5 శాతం వృద్ధిని సూచిస్తున్నది. ఈ మెరుగైన సేకరణ పనితీరు పత్తి రైతులకు గిట్టుబాటు ధర, సకాలంలో సేకరణలో సీసీఐ చేపట్టిన సంస్కరణల విజయాన్ని చాటి చెబుతున్నాయన్నారు. సాంకేతిక ఆధారిత పరిష్కారాలు, పారదర్శకత, సమర్థవంతమైన సేకరణ యంత్రాంగాల ద్వారా రైతు సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి, పత్తి రంగంలో స్థిరమైన వృద్ధికి తోడ్పడటానికి సీసీఐ కట్టుబడి ఉందన్నారు.

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	46,911	
అమ్మకాలు	45,258	
నిల్వ	14,876	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	12000	15300
273	---	----
341	11000	17500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	11000	17800
ఆర్మూరు	10000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16700
నెంబరు. 5	11000	15000
273	----	----
341	11000	16500
4884	12000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14800
బ్యాడిగి 355	10000	16700
దేవనూరు డీలక్స్	12000	16800
తాలుకాయలు	5000	7700

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	160, 169, 180
చికెన్ విత్ స్కిన్(కిలో)	310.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	320.00

మహిళా భద్రత, సాధికారతపై దృష్టి

ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య.. మహిళా భద్రత, సాధికారత దృష్టి సాధిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ గంగాధరరావు అన్నారు. గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పెదకాకాని మండలం పరిధిలోని ఏసీ నారాయణస్వామి, మహిళా వార్డెన్ మాధురి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇందిరా ప్రియదర్శిని మహిళా వసతి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పంచాయతీల్లో మిషన్ శక్తి గురించి పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఆనందకరమన్నారు. మిషన్ శక్తి కేంద్రాల హెల్ప్ లైన్ డెస్క్‌లు ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. రెక్టార్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య.. మహిళలకు భద్రతకి ఎంతో దోహదపడుతుందన్నారు. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లను విద్యార్థులు సద్వినియోగించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రత్యేక అతిథి విజన్ కో-ఆర్డినేటర్ శ్రీవాణి 181 (మహిళల హెల్ప్‌లైన్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) ప్రాముఖ్యతను తెలియజేశారు. కె.శాంతి భూషణం, ఓఏసీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ డి.రామకృష్ణ సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతా చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదనపు చీఫ్ వార్డెన్లు డాక్టర్ సునీత, డాక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.



మిషన్ శక్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధర్ రావు

డాక్టర్ కందిమళ్లకు ప్రతిష్ఠాత్మక తెలుగు వెలుగులు పురస్కారం



డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

చిలకలూరిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరిగే మూడవ ప్రపంచ తెలుగు మహా సభలలో పట్టణానికి చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావును ప్రతిష్ఠాత్మక తెలుగు వెలుగులు పూర్ణ కుంభ పురస్కారానికి ఎంపిక చేశారు. నాటక రంగంలో ఆయన చేసిన కృషికి గాను ఈ పురస్కారం లభించింది. 3న ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది. ఈ సభలలో తెలుగు నాటకంపై జరిగే సదస్సులో సాంఘిక నాటకరంగం అనే అంశంపై ప్రసంగించాలని సాంబశివరావును నిర్వాహకులు కోరారు.

టీడీపీ కార్యాలయానికి భూమి కేటాయింపు

బాపట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో టీడీపీ కార్యాలయం నిర్మాణం నిమిత్తం లీజు ప్రాతిపదికన రెండెకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అభ్యర్థన మేరకు కలెక్టర్ పంపిన ప్రతిపాదనను అనుసరించి పడమర బాపట్ల పరిధిలో బధిరుల ఆశ్రమ పాఠశాల పక్కన ఈ భూమిని కేటాయించారు. ఎకరానికి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున 33 సంవత్సరాలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడి పేరిట ఈ భూమిని కేటాయించాల్సిందిగా ఉత్తర్వులలో పేర్కొన్నారు. దీని కోసం జీవో నెంబర్ 534ను విడుదల చేశారు. 340, 571 జీవోలోని నిబంధనలు ఈ కేటాయింపునకు వర్తించనున్నాయి. సొంత కార్యాలయం నిమిత్తం భూమి కేటాయించటం పట్ల బాపట్ల టీడీపీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



టీడీపీ కార్యాలయానికి కేటాయించిన భూమి

ఆరు రైళ్ల సమయాల్లో మార్పు

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆరు రైళ్ల బయలుదేరు సమయాల్లో గురువారం నుంచి మార్పు చేసినట్లు గుంటూరు రైల్వే డివిజనల్ పౌర సంబంధాల అధికారి వినయ్‌కాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్ సిటీ మధ్యాహ్నం 3.35కి, 17251 గుంటూరు - కాచీగూడ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.40కి, 57305 గుంటూరు - మాచర్ల ప్యాసింజర్ ఉదయం 7.45కి, 17239 గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 7.55కి, 67235 తెనాలి - గుంటూరు ప్యాసింజర్ రాత్రి 9.30కి, 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ రాత్రి 11 గంటలకు గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఇతర స్టేషన్లలో బయలుదేరి గుంటూరుకు వచ్చి వెళ్లే రైళ్లలో 07029 1.40కి, 07030 రాత్రి 9 గంటలకు, 12513 సిల్చార్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 9 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరి వెళతాయని తెలిపారు. ఇవికాక నంబరు 12603, 12604, 12703, 12704, 12706, 12733, 12734, 12747, 12748, 12755, 12756, 12783, 12784, 12796, 12805, 12806, 16031, 16093, 17015, 17016, 17201, 17211, 17212, 17215, 17216 రైళ్లకు సంబంధించి కొన్ని స్టేషన్లలో బయలుదేరు సమయాల్లో మార్పుల జరిగాయన్నారు. ప్రయాణికులు ఎన్‌టీఈఎస్, ఐఆర్‌సీటీసీలో మార్పులను తెలుసుకోవచ్చని తెలిపారు. అలానే రైల్వేస్టేషన్ కౌంటర్ల వద్ద కూడా రైలు బయలుదేరు సమయం తెలుసుకొనే సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: డీఈవో

చెరుకుపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి డి.శ్రీనివాస్ మండలంలోని కొత్తపేట ఎంపీపీ ఉర్దూ పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. అంశాలవారీగా జవాబులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకం అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల పనితీరు ఉపాధ్యాయుల విద్యా బోధనపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థిని ప్రశ్నలు అడుగుతున్న డీఈవో

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

చెరుకుపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): టెన్త్ క్లాస్ చదువుకుని జల్సాలకు బానిసై వరుస దొంతనాలకు పాల్పడుతున్న మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన చందోలు జస్వంత్ ఉరఫ్ సిద్ధు అనే యువకుడిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను అతను దొంగతనం చేశాడు. అతనికి మరో ఇద్దరు సహకరించారని ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ సుమారు రెండున్నర లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో మూడు బైకులు, చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైకు చల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలించారని తెలియజేశారు. మిగతా ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితుడు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

తెనాలి క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు బుధవారం వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 26న రైస్ కాలనీలో జింగా గంగ (31).. తన భార్య లక్ష్మీతిరుపతమ్మ ఇక్కడ ఒక ఇంటిలో డేగల ఆంజనేయులు అనే వ్యక్తితో కలిసి ఉండటం చూసి.. అతనిపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. నిందితుడిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితుడు జింగా గంగా, అతని భార్య లక్ష్మీతిరుపతమ్మ, డేగల ఆంజనేయులు స్థానికంగా ఉన్న ఓ ఫైపుల కంపెనీలో పని చేస్తున్నారు. ఆ సమయంలో తన భార్య లక్ష్మీతిరుపతమ్మ డేగల ఆంజనేయులుతో సన్నిహితంగా ఉండటంతో జీర్ణించుకోలేని జింగా గంగా భార్యను మందలించాడు. దీనిపై ఆమె గతంలో త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో భర్తపై కేసుపెట్టి విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. తన కాపురాన్ని విచ్ఛిన్నం చేశాడనే కసితో నిందితుడు కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఆదిబాబు, శ్రీరామ్‌లు మంగళవారం రాత్రి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని సీఐ వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీపై అవినీతి ఆరోపణలు

● విచారణకు కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు(విద్య), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఇన్‌చార్జీ) డి.దుర్గాబాయిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. శాఖలో బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం రూపొందించాల్సిన రోస్టర్ పాయింట్స్‌పై మూడేళ్ళుగా నిర్లక్ష్యం చేస్తున్నారని, దివ్యాంగుల సంక్షేమానికి విరుద్ధంగా ఏడీ వ్యవహరిస్తూ వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని దివ్యాంగుల సంక్షేమ సంఘాల నాయకులు వేర్వేరుగా రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదు చేశారు. నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవాసమితి, ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల యువ నిరుద్యోగుల సంఘం నాయకులు ఇప్పటికే దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి రవిప్రకాశ్‌కు సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు.

గీతా మందిరం చైర్మన్‌గా జుజ్జూరి ప్రమాణ స్వీకారం

● హాజరైన ఎమ్మెల్యే నసీర్, డూండీ రాకేష్



నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే నసీర్, డూండీ రాకేష్ తదితరులు

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతిష్ఠాత్మకమైన శ్రీకన్యకా పరమే శ్వరి ధర్మసత్ర సంఘం (గీతా మందిరం) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళ వారం కోలాహలంగా జరిగింది. తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్ర సాద్, టీడీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం కోశాధికారి కొనకళ్ళ సత్యంల సమ క్షంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. గీతా మందిరం చైర్మన్‌గా జుజ్జూరి శ్రీనివాసరావు కాగా వైస్ చైర్మన్‌గా టంగుటూరి అర్జున్‌రావుల ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కేవీ సుబ్బారావు, జనసేన నాయకులు చామర్తి అనందసాగర్, పలువురు ఆర్యవైశ్య నాయ కులు హాజరయ్యారు.

ఉదయం రత్నప్రసాద్ ప్రమాణస్వీకారం

కాగా గీతా మందిరం చైర్మన్‌గా వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్ మంగళవారం ఉదయమే ప్రమాణస్వీకారం నిర్వహించారు. రత్నప్రసాద్ నియామకం చెల్లదని వేరొక వర్గం ప్రకటించినప్పటికీ ఉదయం రత్నప్రసాద్, సాయంత్రం ఎమ్మెల్యే నసీర్, డూండీ రాకేష్‌ల సమక్షంలో జుజ్జూరి శ్రీనివాసరావు చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. కాగా గీతా మందిరం పాలకవర్గ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆర్యవైశ్య వర్గీయుల్లో ఇది కాస్త చర్చనీయాంశంగా మారింది.

కార్యకర్తల సమస్యల పరిష్కరమే లక్ష్యం : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో బుధవారం ఆమె కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. వివిధ డివిజన్ల నుంచి వచ్చి కార్యకర్తలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ఎమ్మెల్యేకు తెలి యజేశారు. దీనిపై ఎమ్మెల్యే మాధవి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఆమె మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని, పార్టీ నిర్మాణానికి, అభివృద్ధికి వారే మూల స్తంబాలని చెప్పారు. వారి సమస్యలు పరిష్కరించడమే తన ప్రధాన బాధ్య త అని చెప్పారు. కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తానని ఆమె భరోసా ఇచ్చారు.

కొత్త ఏడాది.. సంతోషాలతో నిండాలి

కొత్త ఏడాది ప్రజలందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని ఎమ్మెల్యే మాధవి కోరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఆమె శుభా కాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఈ ఏడాది ఆ సంతోషాలు రెట్టింపు కావాలని కోరుకున్నారు.

నగరాభివృద్ధిని అడ్డుకుంటున్న అంబటి : కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు పేకాట, మట్కా, లాటరీ, గుండాటలతో అనైతిక కార్యక్రమాలకు పాల్పడ్డ వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నేడు జేఏసీ పేరుతో గుంటూరు నగర అభివృద్ధిని అడ్డుకోవాలని చూడడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నగర ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో గుంటూరు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, పరిస్థితి ఇలానే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి పోటీచేసే అభ్యర్థులే కరువవుతారన్న భయంతోనే వైసీపీ నేతలు బ్రిడ్జి పేరుతో నాటకాలాడుతున్నారని విమర్శించారు. జేఏసీ పేరుతో వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సకాలంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తవు తుందని కనపర్తి స్పష్టం చేశారు. పెమ్మసానిపై మరోసారి అంబటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



గుంటూరు: ఏసీ కాలేజ ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయంలో క్యాండిల్స్ వెలిగిస్తున్న క్రైస్తవులు





గుంటూరు: కుందుల రోడ్‌లోని కమ్మ హాస్టల్‌లో విద్యార్థినుల సాంస్కృతిక నృత్యప్రదర్శన

సందడే సందడి

11.58.. 11.59.. 12.00 కాగానే కేరింతలు. గడియారంలో గంట.. నిమిషాలు.. సెకండ్ల ముల్లు ఒక దగ్గరకు చేరగానే టపాకాయల మోతలు.. బుధవారం అర్ధరాత్రి 12 గంటల కోసం ఎదురుచూస్తున్న యువత బైక్‌లు, కార్ల హారన్లు మోగిస్తూ సందడి చేశారు. విద్యాసంస్థల్లోని వసతిగృహాల్లో విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తనిఖీలు నిర్వహించినా యువత సందడిలో వెనక్కి తగ్గలేదు. చర్చిల్లో అర్ధరాత్రి ప్రార్థనలకు పెద్దసంఖ్యలో క్రైస్తవులు తరలిరాగా పాస్టర్లు నూతన సంవత్సర సందేశమిచ్చారు.

-(గుంటూరు - ఆంధ్రజ్యోతి)



గుంటూరు: బ్రాడీపేట 4వ లైను సాయిబాబా గుడి వద్ద ప్రత్యేక పూజలు





గుంటూరు: కుందుల రోడ్‌లోని కమ్మ హాస్టల్‌లో విద్యార్థినుల సంబరాలు



గుంటూరు: నాజ్‌సెంటర్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు





గుంటూరు: కుందుల రోడ్‌లోని కమ్మ హాస్టల్‌లో విద్యార్థినుల నూతన సంవత్సర సంబరాలు



గుంటూరు: లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో కారులో చిన్నారుల సందడి





గుంటూరు: నార్త్ ప్యారిస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

సారస్‌లో ఘుమఘుమలు

- ప్రదర్శనశాలల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- జనవరి 6 నుంచి 18వ తేదీ వరకు నిర్వహణ

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ (ఎస్ఏఆర్ఏఎస్) ప్రదర్శనలో భారతదేశంలోని విభిన్న రాష్ట్రాలకు చెందిన ఆహార పదార్థాలు ఘుమఘుమలాడనున్నాయి. సారస్ ప్రదర్శన జనవరి 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గుంటూరులో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గుంటూరు నగరంలోని నరసరావుపేట రహదా రిలో రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో ప్రదర్శనశాలల ఏర్పాటుకు ముమ్మరంగా పను లు జరుగుతున్నాయి. కలెక్టర్ తమీమ్ అన్సా రియా బుధవారం ప్రదర్శనశాలల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి పరిశీలించారు. మూడు వందల ప్రదర్శనశాలల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయలక్ష్మి వివరించారు. ఇందులో 150 స్టాల్స్ ఇతర రాష్ట్రాల నుంచి ఏర్పాటు చేస్తుం డగా, రాష్ట్రానికి చెందిన మరో 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చేనేత వస్త్రాలు, హస్తక ళలు, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్‌షీట్‌లు, వెదు రు, లోహ, గాజు ఉత్పత్తులు, సంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహా లంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం జరుగుతుంది. సారస్‌ను రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సౌ జన్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వ హిస్తోంది. గుంటూరు మిరపకు ప్రసిద్ధి చెందడంతో 'మిరప కాయ'నే మస్కట్‌గా ఎంపిక చేసి రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా జాతీయస్థాయి సారస్ కార్యక్రమం జరుగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్ర జలకు ఉచిత ప్రవేశం, పార్కింగ్ సదుపాయం ఉంద న్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి స్థానిక సంస్కృతులను ప్రతిబింబించే చేనేతలు, హస్తకళలు, ఇతర సామగ్రిని ప్రదర్శించడం, విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. స్టాల్స్ ఆహార పదార్థాల దుకాణాలు, తయారీ, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, పార్కింగ్ ప్రత్యేక అనుభూతుల నిలయంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, సెర్ప్ డైరెక్టర్ సుధాకర్, డీఆర్‌డీఏ సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్, డీపీఎం అశోక్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, నగరపాలకసంస్థ పర్యవేక్షక ఇంజనీర్ సుందరరామి రెడ్డి, కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారులు నరేందర్, పంకజ్ కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సారస్ ప్రదర్శన జరిగే ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

బీటెక్ చదివి దొంగతనాలు

- బెట్టింగ్స్‌కు బానిసై దారి తప్పిన యువకుడు
- ఇళ్ల తాళాలు పగలకొట్టకుండా చోరీలు చేసే అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదివి ఉన్నత ఉద్యోగంలో స్థిరపడాల్సిన యువకుడు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. రాష్ట్రంలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లికార్జున రెడ్డి అలియాస్ మల్లిని కొల్లిపర పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 16 లక్షల ఖరీదైన 96 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి, రూ.ఐదు వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లికార్జున రెడ్డి అలియాస్ మల్లి బీటెక్ పూర్తి చేశాడు. బెట్టింగ్‌లకు అలవాటుపడిన అతడు అందులో డబ్బులు పోగొట్టుకొని చోరీలు మొదలుపెట్టాడు. ఈ నెల 19న కొల్లిపర పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్నంగి గ్రామానికి చెందిన మర్రి శివగోపి ఉద యం తన ఇంటికి తాళం వేసి పొలం పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇం టికి వచ్చి చూసే సరికి తలుపు తీసి ఉండటం చేసి ఇంట్లోకి వెళ్ళి చూడ గా బీరువా తెరిచి ఉంది. బీరువాలో ఉన్న రూ. 2లక్షల35 వేల విలువైన 60 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు చోరీకి గురయ్యా యని గుర్తించి కొల్లిపర పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుడు మల్లికార్జున రెడ్డి అలియాస్ మల్లి (23)ని గుర్తించి అరెస్టు చేశారు. అతను తెనాలి రూరల్ పీఎస్ పరిధిలోని కఠెవరం, హాఫ్‌పేట గ్రామాల్లో చోరీ చేసిన సుమారు 266 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి వస్తువులు, అలాగే మేడికొండూరు పీఎస్ పరిధిలోని జంగంగుంట్లపాలెం గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ చేసిన 20 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై తెలంగాణలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. కేసును ఛేదించిన తెనాలి డీఎస్సీ బి.జనార్ధనరావు, తెనాలి రూరల్ సీఐ నాయిబ్ రసూల్, కొల్లిపర ఎస్ఐ ఎన్ ప్రసాద్, ఏఎస్సై పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ టి.రామకోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు కూర్మారావు, ఎన్న పోతురాజును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, వెనుక నిందితుడు

గుంటూరు టౌన్-1 డివిజన్ పునర్విభజన

- రెండు డివిజన్లు చేయాలని సీపీడీసీఎల్ యోచన
- డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌ల విస్తరణకూ అవకాశం

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థ ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1 ఆపరేషన్ డివిజన్ పునర్విభజనకు కసరత్తు జరుగుతోంది. రాజధాని జిల్లా కేంద్రం గుంటూరు నగరం నానాటికి విస్తరిస్తోన్న నేపథ్యంలో డివిజన్‌ను రెండుగా విభజించాలని ఉన్నతాధి కారులు యోచన చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే సీపీడీసీఎల్‌లో సర్కిల్స్ పునర్విభజన జరిగిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో గుంటూరు టౌన్-1 డివిజన్‌ను కూడా రెండుగా విభజించాలనే అంశంపై సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్ చ ర్చించుకున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశాల్లో గుంటూరు నగరం పెరిగిన విస్తీర్ణంతో పాటు మరో డివిజన్ అవసరాన్ని కూడా గుర్తించినట్లు తెలిసింది. ఏపీ సీపీడీసీఎల్ సంస్థలో ఇటీవల సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియ నిర్వహించిన విషయం తెలిసిందే. ఉమ్మడి గుంటూరు జిల్లా గతంలో గుంటూరు సర్కిల్‌గా ఉండేది. సర్కిల్స్ పునర్విభజనలో సీఆర్‌డీఏ సర్కిల్, గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌తో మొత్తం నాలుగు సర్కిల్స్‌గా రూపాంతరం చెందింది. గతంలో గుంటూరు సర్కిల్ పరిధిలోకి వచ్చే గుంటూరు-1, గుంటూరు-2, నరసరావుపేట, తెనాలి, బాపట్ల డివిజన్‌లను జిల్లా కేంద్రం గుంటూరు నుంచే ఎస్ఈ ఆపరేషన్ వ్యవహారాలు పర్యవేక్షించేవారు. ప్రస్తుతం గుంటూరు సర్కిల్ కేవలం గుంటూరు-1, తెనాలి డివిజన్‌లకు మాత్రమే పరిమితమైంది. డివిజన్‌లలో విద్యుత్ సర్వీసులతో పాటు రెవెన్యూ, డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌ల పరిధిని పరిగణనలోకి తీసుకొని డివిజన్ విస్తరణకు యోచన చేస్తున్నట్లు సమాచారం. గుంటూరు టౌన్-1 డివిజన్‌ను రెండుగా విభజిస్తే నగరంలోని పశ్చిమ, తూర్పు నియోజక వర్గాలతో పాటు సమీప ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆలోచన చేస్తున్నారు. తద్వారా పాలనా సౌలభ్యంతో పాటు అధికారుల సర్దుబాటుకు కూడా డివిజన్ పుర్విభన కలిసి వస్తుందని భావిస్తున్నట్లు తెలిసింది.



నల్లచెరువులోని డివిజన్ ఈఈ కార్యాలయం

డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌లూ పెంచే అవకాశం....

ప్రస్తుతం గుంటూరు టౌన్-1 ఆపరేషన్ డివిజన్ పరిధిలో మొత్తం 15 డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌లున్నాయి. అటు పెదకాకాని సెక్షన్ నుంచి ఏటుకూరు రోడ్డు, అమరావతి రోడ్డు నుంచి చౌడవరం వరకు టౌన్-1 డివిజన్ విస్తరించి ఉంది. పునర్విభజనలో భాగంగా సెక్షన్‌ల సంఖ్యను కూడా పెంచి రెండు డివిజన్‌లుగా ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. డివిజన్ కార్యాలయం ఏర్పాటు స్థలం, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే సాధ్యమైనంత త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశం లేకపోలేదని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,35,880	1,24,550	2,58,000
విజయవాడ	1,37,000	1,27,000	2,37,000
విశాఖపట్నం	1,37,040	1,24,550	2,58,000
రాజమండ్రి	1,35,220	1,23,950	2,28,000
ప్రొద్దుటూరు	1,37,450	1,26,450	2,35,000
ముంబై	1,33,200	1,22,010	2,30,420

బుల్ ట్రెండ్‌లో 1,00,000!?



2026లో సెన్సెక్స్ వృద్ధిపై మోర్గాన్ స్టాన్లీ అంచనా

వచ్చే ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లో పరిస్థితులు మెరుగుపడవచ్చని దేశీయ, అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. 2025లో ఒకే అంకెకు పరిమితమైన సూచీల ప్రతిఫలాలు.. 2026లో రెండంకెలకు చేరుకోవచ్చంటున్నాయి. వచ్చే ఏడాది డిసెంబరు చివరి నాటికి సెన్సెక్స్, నిఫ్టీ 11-26% మేర రిటర్నులు పంచవచ్చని అంచనా వేశాయి. దేశీయంగా బలమైన ఆర్థిక మూలాలు, విధానపరమైన సడలింపులు, పుంజుకుంటున్న కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు ఇందుకు దోహదపడనున్నాయని సంస్థలు అభిప్రాయపడ్డాయి. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ, వాణిజ్య అనిశ్చితులు కూడా తగ్గుముఖం పట్టినట్లయితే మార్కెట్ మరింత జోరందుకోవడం ఖాయమంటున్నాయి. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం, ఆర్‌బీఐ పరపతి విధానం, ఫెడ్ రేట్లు మన సూచీల గమనాన్ని ప్రభావితం చేయనున్నాయని తమ నివేదికల్లో పేర్కొన్నాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు హెచ్ఎస్‌బీసీ, గోల్డ్‌మన్ శాక్స్ ఇప్పటికే మన మార్కెట్ రేటింగ్‌ను ఓవర్ వెయిట్‌కు అప్‌గ్రేడ్ చేశాయి.

2026 చివరికి సూచీల వృద్ధిపై అంచనాలు

మోర్గాన్ స్టాన్లీ

	సెన్సెక్స్	వృద్ధి (%)
బుల్ ట్రెండ్	1,07,000	26
బేస్ ట్రెండ్	95,000	12
బేరిష్ ట్రెండ్	76,000	-10

సంస్థ	నిఫ్టీ	వృద్ధి (%)
నోమురా	29,300	13
గోల్డ్‌మన్ శాక్స్	29,000	12
ఎంకే గ్లోబల్	29,000	12

	సెన్సెక్స్	వృద్ధి (%)
హెచ్ఎస్‌బీసీ	94,000	11

కోటక్ సెక్యూరిటీస్

	నిఫ్టీ	వృద్ధి (%)
బుల్ ట్రెండ్	32,032	23.5
బేస్ ట్రెండ్	29,120	12
బేరిష్ ట్రెండ్	26,208	-1

యాక్సిస్ సెక్యూరిటీస్

	నిఫ్టీ	వృద్ధి (%)
బుల్ ట్రెండ్	29,500	14
బేస్ ట్రెండ్	28,100	8
బేరిష్ ట్రెండ్	24,000	-7

100 డాలర్లకు వెండి



2025లో బులియన్ ఇన్వెస్టర్లకు పసిడి, వెండి భారీ లాభాలు పంచాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్ల తగ్గింపు, అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా సుంకాల వడ్డింపులు, సరఫరా అవాంతరాలు, ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటుండటం వీటి ధరల ర్యాలీకి కారణమయ్యాయి. 2025లో దేశీయంగా బంగారం ధర 76% పెరగగా.. వెండి ఏకంగా 170% వరకు ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర డిసెంబరు 26న ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,42,300కు చేరగా.. డిసెంబరు 30న కిలో వెండి రూ.2,41,000 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2025లో 2,657 డాలర్ల మేర (71%) పెరిగింది. డిసెంబరు 26న 4,550 డాలర్ల వద్ద ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. వెండి సైతం 29.57 డాలర్లు (182.82 శాతం) పుంజుకుంది. డిసెంబరు 29న 83.63 డాలర్ల వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. విలువైన లోహాల ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని ఇప్పటికే పలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అంచనా వేశాయి. 2026 డిసెంబరు నాటికి ఔన్స్ బంగారం 5,055 డాలర్లకు చేరుకోవచ్చని జేపీ మోర్గాన్ అంచనా వేసింది. డిమాండ్‌కు తగిన స్థాయిలో సరఫరా లేని కారణంగా ఔన్స్ వెండి 2026లో 100 డాలర్ల మార్క్‌ను దాటవచ్చన్న అంచనాలున్నాయి.

కంగారెన్సీ!

2025లో 5 శాతం క్షీణించిన రూపాయి

మన కరెన్సీకి కంగారెక్కువైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2025లో 5% పతనమైంది. మారకం రేటు తొలిసారిగా రూ.90 మార్క్‌ను దాటింది. డిసెంబరు 16న డాలర్‌తో రూపాయి మారకం రేటు ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.91.08కి చేరింది. 2025లో ఆసియాలోకెల్లా అత్యధికంగా క్షీణించిన దేశీయ కరెన్సీగా మిగిలింది. గడిచిన మూడేళ్లలో రూపాయికిదే అత్యధిక వార్షిక క్షీణత. ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ నిధులు భారీగా తరలిపోవడం, ట్రంప్ సుంకాల పోటుతోపాటు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమయ్యాయి. 2025 ట్రేడింగ్ చివరి రోజున డాలర్-రూపాయి మారకం విలువ 13 పైసల నష్టంతో రూ.89.88 వద్ద ముగిసింది. వచ్చే ఏడాదిలోనూ రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని ఫారెక్స్ విశ్లేషకులు పేర్కొన్నారు.



'ఫండ్'గ చేసుకున్నాయ్!

ఎంఎఫ్ ఆస్తుల విలువ @ రూ.81 లక్షల కోట్లు



మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి 2025లోనూ భారీగా పెట్టుబడులు వచ్చాయి. 2025లో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ మరో రూ.14 లక్షల కోట్లు (21%) పెరిగి, నవంబరు నాటికి మొత్తం రూ.81 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఫండ్ పథకాల్లో చిన్న మదుపరుల పెట్టుబడులు, ముఖ్యంగా క్రమానుగత పెట్టుబడులు (సిప్) భారీగా పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది ఇన్వెస్టర్లు ఏకంగా రూ.7 లక్షల కోట్లు 'సిప్' చేశారు. ఇండస్ట్రీకి 2026 సంవత్సరం కూడా సానుకూలంగా ఉండనుందని, సిప్ పెట్టుబడుల జోరు ఇందుకు తోడ్పడనుందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా(యాంఫీ) సీఈఓ చలసాని వెంకట్ అన్నారు. గడిచిన ఐదేళ్లలో ఫండ్ ఆస్తుల మొత్తం విలువ ఏకంగా రూ.50 లక్షల కోట్లు పెరిగింది.

2026లో రూ.4 లక్షల కోట్ల ఐపీఓలు!

పాంటోమత్ క్యాపిటల్ అంచనా



ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఆఫరింగ్‌ల (ఐపీఓ) జోరు ఏటేటా పెరుగుతూ వస్తోంది. 2015లో రూ.13,874 కోట్లుగా నమోదైన ఐపీఓల నిధుల సమీకరణ విలువ.. గడిచిన పదేళ్లలో 12 రెట్లు పెరిగింది. 2025లోనైతే 103 ప్రధాన కంపెనీలు, 270 ఎస్ఎంఈ కంపెనీలు (మొత్తం 373 ఐపీఓలు) కలిసి ప్రైమరీ మార్కెట్ నుంచి మొత్తం రూ.1.95 లక్షల కోట్లు సమీకరించాయి. 2026లో ఐపీఓలు మరింత జోరందుకోనున్నాయని, కంపెనీలు ఆల్‌టైం రికార్డు స్థాయిలో రూ.4 లక్షల కోట్ల వరకు నిధులను సేకరించే అవకాశాలున్నాయని పాంటోమత్ గ్రూప్ నివేదిక అంచనా వేసింది. ఇప్పటికే రూ.1.25 లక్షల కోట్ల విలువైన 96 ఐపీఓలు సెబీ ఆమోదం కూడా పొంది.. 2026లో పబ్లిక్ ఆఫర్‌ను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

లాభాలతో 2025కి వీడ్కోలు

ముంబై: ఈక్విటీ మార్కెట్ సూచీలు గత ఐదు రోజుల నష్టాలకు తెర దించి లాభాలతో 2025 సంవత్సరానికి వీడ్కోలు పలికాయి. గత కొద్ది రోజుల మార్కెట్ నష్టాల కారణంగా సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చిన మంచి కంపెనీల షేర్ల కొనుగోలు జోరుగా సాగడం కలిసివచ్చింది. సానుకూల వాతావరణంలో బుధవారం ఇంట్రాడేలో 762.09 పాయింట్లు లాభపడి 85,437.17ని తాకిన సెన్సెక్స్ చివరికి 545.52 పాయింట్ల లాభంతో 85,220.60 వద్ద ముగిసింది. నిఫ్టీ 190.75 పాయింట్లు లాభపడి 26,129.60 వద్ద ముగిసింది. మొత్తం మీద 2025 సంవత్సరంలో సెన్సెక్స్ 7,081.59 పాయింట్లు, నిఫ్టీ 2,484 పాయింట్లు లాభపడ్డాయి. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.33.84 లక్షల కోట్లు పెరిగి రూ.4,75,79,238.11 కోట్లకు చేరింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	660
వరంగల్	632	గోదావరి	620
చిత్తూరు	703	విశాఖపట్నం	660
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	147	విజయవాడ	145
వరంగల్	147	గుంటూరు	150
కరీంనగర్	147	ఒంగోలు	150
మహబూబ్‌నగర్	147	చిత్తూరు	148
కర్నూలు	147	నెల్లూరు	153
విశాఖపట్నం	131	అనంతపురం	153
గోదావరి	145		

మొండి బాకీలు మరింత తగ్గేను..

2027 మార్చి నాటికి ఎన్‌పీఏలు 1.9 శాతానికి పరిమితం: ఆర్‌బీఐ

ముంబై: దేశీయ బ్యాంకింగ్ రంగంలో మొండి బాకీలు మరింత తగ్గనున్నాయని ఆర్‌బీఐ అంటోంది. 2027 మార్చి నాటికి బ్యాంక్‌ల మొండి బాకీల నిష్పత్తి సాధారణ పరిస్థితుల్లో 1.9 శాతానికి జారుకోవచ్చని అంచనా వేసింది. అధ్వాన్న పరిస్థితుల్లో మాత్రం ఎన్‌పీఏలు మళ్లీ 3.2-4.2 శాతానికి ఎగబాకే ప్రమాదం ఉందని హెచ్చరించింది. బుధవారం విడుదల చేసిన అర్ధ వార్షిక ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఆర్‌బీఐ ఈ విషయాన్ని వెల్లడించింది. 2025 సెప్టెంబరు నాటికి ఎన్‌పీఏలు దశాబ్దాల కనిష్ఠ స్థాయి 2.1 శాతానికి తగ్గాయి.

రుణదాతలకు రూ.4 లక్షల కోట్ల రికవరీ

కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియల ద్వారా 2025 సెప్టెంబరు చివరినాటికి రుణదాతలు రూ.4 లక్షల కోట్ల బకాయిలను రికవరీ చేసుకోగలిగారని ఆ నివేదిక.

స్టేబుల్ కాయిన్స్‌తో ముప్పే..: స్టేబుల్ కాయిన్స్ సహా క్రిప్టో కరెన్సీలు భారత ద్రవ్య సార్వభౌమత్వానికి, ఆర్థిక స్థిరత్వానికి ముప్పుగా పరిణమించవచ్చని ఆర్‌బీఐ మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. వాటి విలువలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతుండటం ఇందుకు కారణంగా పేర్కొంది.

వొడాఫోన్‌కు భారీ ఊరట

బకాయిల చెల్లింపుపై 5 సంవత్సరాల మారటోరియం

న్యూఢిల్లీ: రుణాల ఊబిలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియాకు (వీఐఎల్) ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఆ కంపెనీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ స్తంభింపచేయడంతో పాటు చెల్లింపులన్నింటిపై ఐదు సంవత్సరాల మారటోరియంను ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ భారీ ప్యాకేజీకి ఆమోద ముద్ర వేసింది. ఈ నిర్ణయం కింద ప్రభుత్వానికి వీఐఎల్ చెల్లించాల్సిన రూ.87,695 కోట్ల బకాయిల చెల్లింపు 2031-32 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించి 2040-41 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీఐఎల్‌లో ప్రభుత్వానికి 48.9% వాటాలున్నాయి. తన ప్రయోజనాలు పరిరక్షించుకోవడంతో పాటు స్పెక్ట్రమ్ చార్జీలు, ఏజీఆర్ బకాయిలు సక్రమంగా ప్రభుత్వానికి చెల్లించేందుకు సహాయపడడం, టెలికాం రంగంలో ఆరోగ్యవంతమైన పోటీని ప్రోత్సహించడం, 20 కోట్ల మంది కస్టమర్ల ప్రయోజనాలు పరిరక్షించడం ఈ ప్యాకేజీ లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

నేటి నుంచి గృహోపకరణాలకు స్టార్ రేటింగ్

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ పొదుపు ప్రమాణాలను మరింత కఠినతరం చేసే ప్రక్రియలో భాగంగా రిఫ్రిజిరేటర్లు, టీవీ, ఎల్‌పీజీ స్టవ్‌లతో సహా పలు గృహోపకరణాలకు స్టార్ లేబిలింగ్ ప్రక్రియను తప్పనిసరి చేసింది. ఈ మేరకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) ఉత్తర్వులను జారీ చేయగా.. నేటి నుంచే ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి.



ఆటలే ఆటలు

కొత్త ఏడాది చాంపియన్‌షిప్‌ల సందడి

క్రీడా క్యాలెండర్



క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, హాకీ, చదరంగం.. ఇలా 2026లో ఆటలే ఆటలు.. ప్రపంచ టోర్నీల సందడే సందడి! క్రికెట్‌లో భారత పురుషుల యువ, సీనియర్ జట్లు ప్రపంచ కప్‌లో సమరానికి సన్నద్ధమవుతున్నాయి. భారత్ వేదికగా టీ20 ప్రపంచకప్‌తో ఈ క్రీడా సీజన్‌కు ఘనమైన ఆరంభం లభించనుంది. బ్యాడ్మింటన్‌లో జోరు కొనసాగించేందుకు ప్రపంచ చాంపియన్‌షిప్.. లిఫ్టర్లు, షూటర్లు సత్తా చాటేందుకు ఆసియా చాంపియన్‌షిప్, టీటీ క్రీడాకారులకు డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్.. ఇలా ఎన్నో ఈవెంట్ల ఆతిథ్యానికి భారత్ ముస్తాబవుతోంది. ఇవే కాదు.. ఇంకా ఎన్నో క్రీడలు, మరెన్నో పోటీలు..వ్యక్తిగత ప్రతిభ చాటే ఈవెంట్లు, జట్టుగా కలిసి తలపడే టోర్నీలు.. ఇలా భారత్‌తో పాటు విశ్వవ్యాప్తంగా వివిధ దేశాల్లో క్రీడా సంబరాన్ని అందించేందుకు కొత్త ఏడాది ముస్తాబైంది. ఇక, ఆటగాళ్లు బరిలోకి దిగి విజయాలు అందుకోవడమే ఆలస్యం. మరింకేం.. ఫుల్‌జోష్‌తో ఉన్న ఈ ఏడాది క్రీడా క్యాలెండర్‌పై ఓ లుక్కేద్దాం.



క్రికెట్‌లో మూడు ప్రపంచకప్‌లు

కొత్త ఏడాది పూర్తిగా క్రికెట్ పండుగ అని చెప్పుకోవచ్చు. ఈ బ్యాటు, బంతి క్రీడలో భాగంగా మూడు ప్రపంచకప్‌లు అభిమానులను కనువిందు చేయనున్నాయి. జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న అండర్-19 50 ఓవర్ల ప్రపంచకప్‌తో పాటు పురుషుల, మహిళల టీ20 ప్రపంచకప్‌లు ఈ ఏడాదిలోనే జరగనున్నాయి. ఈ మెగా టోర్నీలతో పాటు ఇతర జట్లతో టీమిండియా తలపడే వన్డే, టీ20, టెస్టు సిరీస్‌లు.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఎలాగూ ఉంటాయి.

మహిళల ప్రీమియర్ లీగ్ (జనవరి 9 - ఫిబ్రవరి 5); అండర్-19 వన్డే ప్రపంచకప్ (జనవరి 15 - ఫిబ్రవరి 6: జింబాబ్వే, నమీబియా); పురుషుల టీ20 ప్రపంచకప్ (ఫిబ్రవరి 7- మార్చి 8: భారత్, శ్రీలంక); ఇండియన్ ప్రీమియర్ లీగ్ (మార్చి 26- మే 31); మహిళల టీ20 ప్రపంచకప్ (జూన్ 12- జూలై 5: ఇంగ్లండ్).

కామన్వెల్త్, ఆసియాడ్ సంబరం



నాలుగేళ్లకోసారి జరిగే కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలకు ఈ ఏడాది ముస్తాబైంది. ఈ మెగా ఈవెంట్లలో భారత్ అత్యధిక పతకాలు సాధించే అవకాశముంది.

కామన్వెల్త్ క్రీడలు (జూలై 23- ఆగస్టు 2: స్కాట్లాండ్); ఆసియా క్రీడలు (సెప్టెంబరు 19 - అక్టోబరు 4: జపాన్).

షట్లర్లకు కలిసి రావాలని..



నిరుడు బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్లకు ఆశించిన ఫలితాలు రాలేదు. సింగిల్స్‌లో పీవీ సింధుతో పాటు లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టిలాంటి స్టార్లు కొత్త ఏడాదిలోనైనా మెరుగ్గా రాణించాలనుకుంటున్నారు. ఈసారి భారత్ ఆతిథ్యమిస్తున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌తో పాటు మరి కొన్ని మెగా ఈవెంట్లలో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నారు.

ఆలిండ్లండ్ చాంపియన్‌షిప్ (మార్చి 3 -8: బర్మింగ్‌హామ్); థామస్, ఉబెర్ కప్ (ఏప్రిల్ 26- మే 3: డెన్మార్క్); ప్రపంచ చాంపియన్‌షిప్ (ఆగస్టు 17- 23: న్యూఢిల్లీ); బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ (డిసెంబరు 9-13).

ఇతర ప్రధాన ఈవెంట్లు

పురుషులు, మహిళల హాకీ ప్రపంచకప్ (ఆగస్టు 14-30: బెల్జియం, నెదర్లాండ్స్); బాక్సింగ్ ఆసియా చాంపియన్‌షిప్ (మార్చి 28 - ఏప్రిల్ 1: మంగోలియా); ప్రపంచ టేబుల్‌టెన్నిస్ స్టార్ కంటెండర్ సిరీస్ (ఫిబ్రవరి 10-15: చెన్నై); ఐటీటీఎఫ్ వరల్డ్ టీమ్ టీటీ ఫైనల్స్ (ఏప్రిల్ 28- మే 10: లండన్); అథ్లెటిక్స్ డైమండ్ లీగ్ ఫైనల్స్ (సెప్టెంబరు 4-5: చైనా); రెజ్లింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ (అక్టోబరు 24 నుంచి: బహ్రెయిన్); షూటింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ (నవంబరు 1 నుంచి: దోహా); వెయిట్ లిఫ్టింగ్ ఆసియా చాంపియన్‌షిప్ (ఏప్రిల్ 1-10: అహ్మదాబాద్); వెయిట్‌లిఫ్టింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ (అక్టోబరు 27- నవంబరు 8: చైనా).



టాటా స్టీల్ చెస్ (జనవరి 16-ఫిబ్రవరి 1: నెదర్లాండ్స్); ఫిడే క్యాండిడేట్స్ టోర్నీ (మార్చి 28 - ఏప్రిల్ 15: సైప్రస్); చెస్ ఒలింపియాడ్ (సెప్టెంబరు 4-17: ఉజ్బెకిస్థాన్); ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ (గుకేశ్ X క్యాండిడేట్స్ విజేత: షెడ్యూల్ ఖరారవ్వాలి); వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ (షెడ్యూల్ ఖరారవ్వాలి).

చదరంగంలో మళ్లీ వెలగాలని..

గతేడాది చదరంగంలో భారత్ అద్భుత ఫలితాలు రాబట్టింది. మహిళల చెస్ వరల్డ్‌కప్‌లో దివ్యా దేశ్‌ముఖ్ చాంపియన్‌గా నిలవగా, కోనేరు హంపి రన్నరప్ ట్రోఫీ అందుకుంది. ఇక, ఏడాది ఆఖర్లో జరిగిన ఫిడే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో హంపి కాంస్యం, యువ ఆటగాడు అర్జున్ ఇరిగేసి రెండు కంచు పతకాలతో సత్తాచాటారు. చెస్‌లో మన ఆధిపత్యాన్ని చాటి చెప్పేందుకు కొత్త ఏడాదిలో క్యాండిడేట్స్, చెస్ ఒలింపియాడ్, వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ లాంటి మెగా టోర్నీలు సిద్ధంగా ఉన్నాయి.

ఫిఫా పండుగ



విశ్వవ్యాప్తంగా అతిపెద్ద క్రీడా సంబరమైన ఫుట్‌బాల్ ప్రపంచకప్ జరిగేది కూడా ఈ ఏడాదే. అమెరికా, కెనడా, మెక్సికో ఆతిథ్యమిస్తున్న ఈ మెగా కప్ లియోనెల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో లాంటి స్టార్లకు కెరీర్‌లో చివరిదన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టోర్నీ రసవత్తరంగా సాగే అవకాశముంది.

ఏఎఫ్‌సీ మహిళల ఆసియా కప్ (మార్చి: ఆస్ట్రేలియా); ఫిఫా పురుషుల ప్రపంచ కప్ (జూన్ 11- జూలై 19: అమెరికా, కెనడా, మెక్సికో); యూరోపియన్ చాంపియన్స్ లీగ్ ఫైనల్ (మే 30: బుడాపెస్ట్).

సర్ఫరాజ్ 'డబుల్' మిస్

● ముంబై 444/8 ● గోవా చిత్తు

● విజయ్ హజారే ట్రోఫీ



జైపూర్: ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఈ సీజన్ దేశవాళీ పోటీల్లో తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ మరో సెంచరీతో చెలరేగాడు. అయితే త్రుటిలో ద్విశతకాన్ని చేజార్చుకున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో భాగంగా గోవాతో బుధవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో సర్ఫరాజ్ సిక్సర్ల వర్షం కురిపించాడు. 75 బంతుల్లోనే 14 సిక్సర్లతో సర్ఫరాజ్ 157 పరుగులు చేయడంతో తొలుత ముంబై 50 ఓవర్లలో 444/8 స్కోరు సాధించింది.. సర్ఫరాజ్ సోదరుడు ముషీర్ ఖాన్ (60), హార్దిక్ తమోర్ (53) సత్తా చాటారు. భారీ ఛేదనలో గోవా 50 ఓవర్లలో 357/9 స్కోరు చేసి ఓడింది. అభినవ్ తేజ్ రాణా (100) శతక్కొట్టగా, దీప్‌రాజ్ (70), లలిత్ యాదవ్ (64) పోరాడారు.

అభిరథ్, ప్రజ్ఞయ్ శతక్కొట్టినా..

బరోడాతో పోరులో హైదరాబాద్‌కు నిరాశ

రాజ్‌కోట్: అభిరథ్ రెడ్డి (130), ప్రజ్ఞయ్ రెడ్డి (113) శతకాలతో చెలరేగినా బరోడాతో జరిగిన భారీ స్కోర్ల హజారే మ్యాచ్‌లో హైదరాబాద్‌కు ఓటమి తప్పలేదు. తొలుత బరోడా 50 ఓవర్లలో 417/4 స్కోరు చేసింది. అమిత్ పసి (127), నిత్యా పాండ్యా (122), కృనాల్ పాండ్యా (109 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కారు. మిలింద్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో హైదరాబాద్ 49.5 ఓవర్లలో 380 రన్స్‌కు ఆలౌటైంది. అభిరథ్, ప్రజ్ఞయ్ మూడో వికెట్‌కు 200 రన్స్ జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక నితీశ్ (33) మినహా మిగతావారు విఫలమయ్యారు. మహేష్, అటిట్ చెరో 3, కరణ్, రాజ్ చెరో 2 వికెట్లు తీశారు. ఎలీట్ గ్రూప్ 'బి'లో ఆడిన 4 మ్యాచ్‌ల్లో హైదరాబాద్ ఒక్కటి కూడా నెగ్గకపోవడం గమనార్హం.

ఆంధ్ర పరాజయం

బెంగళూరు: విజయ్ హజారే టోర్నీలో ఆంధ్ర జట్టు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. బుధవారం జరిగిన ఎలీట్ గ్రూప్ 'డి' మ్యాచ్‌లో సౌరాష్ట్ర 74 పరుగులతో ఆంధ్రపై గెలిచింది. తొలుత సౌరాష్ట్ర 7 వికెట్లకు 254 పరుగులు సాధించింది. రుచిత్ (76), చిరాగ్ (69), కెప్టెన్ హార్విక్ (61) రాణించారు. సత్యనారాయణ రాజు 3, కలిదిండి రాజు 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఆంధ్ర 47.2 ఓవర్లలో 180 రన్స్‌కు కుప్పకూలింది. జ్ఞానేశ్వర్ (33), కెప్టెన్ నితీశ్ (30), రాజు (30) మాత్రమే ఓ మోస్తరు స్కోరు చేశారు. అంకుర్ (5/22) ఐదు వికెట్లు తీశాడు. ఆంధ్రకిది వరుసగా రెండో పరాజయం. గత మ్యాచ్‌లో ఒడిశా చేతిలో ఆంధ్ర ఓడిపోయింది.

అర్జున్‌కు మోదీ ప్రశంస

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): ఫిడే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ర్యాపిడ్‌తో పాటు బ్లిట్జ్ విభాగంలోనూ కాంస్య పతకాన్ని నెగ్గిన తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసిని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. 'చదరంగంలో భారత్ దూకుడు కొనసాగుతోంది. రెండు పతకాలు సాధించిన అర్జున్‌కు అభినందనలు. అతడి నైపుణ్యం, ఓర్పు, అభిరుచి అసామాన్యమైనవి. అతడి విజయాలు మన యువతకు నిరంతర స్ఫూర్తి' అని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నవీనుల్, నైబ్ రీఎంట్రీ

అఫ్ఘాన్ టీ20 వరల్డ్‌కప్ జట్టు ప్రకటన

కాబూల్: అఫ్ఘానిస్థాన్ టీ20 వరల్డ్‌కప్ జట్టులో నవీనుల్ హక్, ఆల్‌రౌండర్ గుల్బదిన్ నైబ్‌కు చోటు దక్కింది. స్పిన్నర్ రషీద్ ఖాన్ నేతృత్వంలోని 15 మంది సభ్యుల బృందాన్ని సెలెక్టర్లు బుధవారం ప్రకటించారు. భుజం గాయంతో జట్టుకు దూరమైన నవీనుల్ ఏడాది తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వనున్నాడు. బంగ్లాదేశ్ వైట్‌బాల్ టూర్‌కు జట్టులో చోటు కోల్పోయిన నైబ్‌తోపాటు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీకి కూడా జట్టులో చోటు లభించింది. ఆఫ్ స్పిన్నర్ ముజిబుర్ రహ్మాన్ జట్టులోకి రావడంతో.. మిస్టరీ స్పిన్నర్ ఘజన్ఫార్‌ను రిజర్వ్‌గా ఎంపిక చేశారు. మెగా ఈవెంట్‌కు ముందు వెస్టిండీస్‌తో యూఏఈలో జరిగే 3 టీ20లకు సిరీస్‌కు కూడా ఇదే జట్టును ఖరారు చేశారు.

జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), ఇబ్రహిం జద్రాన్ (వైస్ కెప్టెన్), రహ్మనుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), మహ్మద్ ఇషాక్ (వికెట్ కీపర్), సెదికుల్లా అటల్, దార్విష్ రసూలీ, షాహిదుల్లా కమాల్, అజ్మతుల్లా ఒమర్జాయ్, గుల్బదిన్ నైబ్, మమ్మద్ నబీ, నూర్ అహ్మద్, ముజిబుర్ రహ్మాన్, నవీనుల్ హక్, ఫజల్ హక్ ఫరూఖీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్.

మృత్యువుతో పోరాటం

● కోమాలో ఆసీస్ మాజీ క్రికెటర్ మార్టిన్



బ్రిస్బేన్: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేమియన్ మార్టిన్ మృత్యువుతో పోరాడుతున్నాడు. మెదడువాపు వ్యాధితో బాధపడుతున్న 54 ఏళ్ల డేమియన్ స్థానిక ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ వ్యాధితో అతడి మెదడు, ఇతర అవయవాలు దెబ్బతినకుండా ఉండేందుకు మార్టిన్‌ను తాత్కాలికంగా కోమాలోకి పంపినట్టు వైద్యులు తెలిపారు.

కివీస్‌తో సిరీస్‌కు షమి?

న్యూఢిల్లీ: టీమిండియాకు దూరమైన పేసర్ మహ్మద్ షమి దేశవాళీ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెలలో న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు అతడిని పరిశీలించే అవకాశం ఉందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. 2025, మార్చి 9న జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో షమి చివరిసారి భారత జట్టు తరఫున ఆడాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు వెంటాడడంతో సెలెక్టర్లు పక్కనబెట్టారు. అయితే, షమి ప్రదర్శనను సెలెక్టర్లు నిశితంగా పరిశీలిస్తున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదన్నాయి.



అవీవా బేగ్... ఇప్పుడీ పేరు దేశమంతా మారుమోగుతోంది. ఉన్నట్టుండి అందరిలో 'ఎవరీ అమ్మాయి' అనే ఉత్సుకత మొదలైంది. కాంగ్రెస్ అగ్రనాయకురాలు, పార్లమెంటు సభ్యురాలు... 'ప్రియాంక గాంధీ కాబోయే కోడలు' అని తెలియగానే... అమాంతం సెర్చ్ ఇంజిన్లు బిజీ అయిపోయాయి. సామాజిక మాధ్యమాల్లో ఆమె ఫొటోలు చక్కర్లు కొడుతున్నాయి. రాత్రికి రాత్రి వార్తల్లో వ్యక్తిగా మారిన అవీవా గురించి కొన్ని విశేషాలు...

ప్రియాంకకు కాబోయే కోడలు

ఇటీవల అవీవా బేగ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక ఫొటో అప్‌లోడ్ చేశారు. ప్రియాంక గాంధీ, రాబర్ట్ వాద్రాల కుమారుడు రేహాన్ వాద్రాతో కలిసి దిగిన ఫొటో అది. పోస్టు చేసిన కొద్ది నిమిషాల్లోనే ఆ ఫొటో సామాజిక మాధ్యమాలన్నిటినీ చుట్టేసింది. విపరీతంగా లైక్‌లు, షేర్లు. ఆమె గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి. అదేసమయంలో రేహాన్, అవీవాకు నిశ్చితార్థం జరిగిందని గాంధీ కుటుంబ సన్నిహిత వర్గాల పేర్కొనడంతో జాతీయ మీడియాలో కథనాలు మొదలయ్యాయి.

అభిరుచులు ఒక్కటే...



రేహాన్ చిన్ననాటి స్నేహితురాలు అవీవా. ఢిల్లీలో ఇద్దరూ ఒకే స్కూల్‌లో చదువుకున్నారు. ఫొటోగ్రఫీ, స్టోరీ టెల్లింగ్, చిత్రకళ... ఇద్దరి అభిరుచులు, ఆ తరువాత మనసులు కలిశాయి. పలు జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనల కోసం ఎన్నో ప్రాంతాలు పర్యటించారు. ఏడేళ్లుగా సన్నిహితంగా ఉంటున్న అవీవా, రేహాన్... చివరకు తమ సుదీర్ఘ ప్రేమాయణాన్ని వివాహ బంధంగా మార్చుకోవాలనుకున్నారు. అందుకు ఇరు కుటుంబాల పెద్దలు అంగీకారం తెలపడంతో... ఇటీవల పెళ్లి నిశ్చయమైంది.

స్నేహబంధం...

పాఠశాల విద్యాభ్యాసం అనంతరం అవీవా... హరియాణాలోని 'ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ'లో జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్స్ చదివారు. రేహాన్ లండన్‌లోని 'స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్' నుంచి పాలిటిక్స్‌లో డిగ్రీ చేశారు. అవీవా తండ్రి ఇమ్రాన్ బేగ్ వ్యాపరవేత్త. తల్లి నందిత ఇంటీరియర్ డిజైనర్. చాలా ఏళ్లుగా ఇరు కుటుంబాల మధ్య స్నేహం ఉంది. ముఖ్యంగా నందిత, ప్రియాంక చాలాకాలంగా మంచి మిత్రులు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం 'ఇందిరా భవన్' ఇంటీరియర్ డిజైనింగ్ పనులు నందిత ఆధ్వర్యంలోనే జరిగాయి.

సృజనాత్మక రంగం వైపు...

చిన్ననాటి తన అభిరుచులను అవీవా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. సృజనాత్మక రంగంలో తన కెరీర్‌ను నిర్మించుకున్నారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌గా అద్భుత చిత్రాలెన్నిటినో తన లెన్స్‌లో బంధించారు. ప్రతిష్టాత్మక 'ఇండియా ఆర్ట్ ఫెయిర్-2023'లో 'యూ కెనాట్ మిస్ దిస్' పేరుతో వాటిని ప్రదర్శించారు. అంతకముందు 'ది కోరమ్ క్లబ్'లో 'ది ఇల్యూజరీ వరల్డ్' పేరిట నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్‌కు మంచి గుర్తింపు లభించింది. తరువాత కాలంలో ఫొటోగ్రఫీ స్టూడియో, ప్రొడక్షన్ కంపెనీ 'అటెలియర్ 11'ను నెలకొల్పారు. దీనికి ఆమె సహవ్యవస్థాపకురాలు. ఈ స్టూడియో ప్రారంభానికి ముందు ఫొటోగ్రఫీని కొనసాగిస్తూనే కొన్నాళ్లు మీడియా రంగంలో వివిధ హోదాల్లో పని చేశారు. అంతేకాదు... ఒకప్పుడు అవీవా జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారిణి. ఇక రేహాన్ కూడా ఫొటోగ్రాఫర్. విజువల్ ఆర్టిస్ట్. 2021లో 'డార్క్ పర్‌సెప్షన్' పేరుతో ఢిల్లీ బికనీర్ హౌస్‌లో సోలో ఎగ్జిబిషన్ నిర్వహించారు.



గమ్యం కాదు.. సంకల్పం ముఖ్యం

కొత్త ఏడాది వస్తోందంటే చాలు 'న్యూ ఇయర్ రిజల్యూషన్' గుర్తొస్తుంది. అయితే, 'ఎలాగూ పాటించం కదా.. ఆమాత్రానికి కొత్తగా ఈ సంకల్పాలు దేనికి?' అన్న సందేహం రావడం కూడా సహజం. అయితే అవి నిలవకపోయినా రిజల్యూషన్స్ చెప్పుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ఆశకు ప్రతిరూపం.. రిజల్యూషన్

మనం తీర్మానం చేసుకున్నప్పుడు మన జీవితంపై మనకు నియంత్రణ ఉందనే భావనను అది ఇస్తుందని, మార్పు సాధ్యమనే నమ్మకాన్ని పెంచుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ మనం ఆ తీర్మానాన్ని నిలబెట్టుకోలేకపోయినా, దానిని మొదలుపెట్టేటప్పుడు కలిగే ఉత్సాహం మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అంటున్నారు. ప్రయత్నంలో విఫలం కావడం అంటే కష్టం వృథా అయినట్టు కాదు, మన బలాలేంటి? బలహీనతలేంటి? అన్న విషయంలో స్పష్టత వస్తుందని, ఇది వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందని చెబుతున్నారు.

విజయం సంగతి తరువాత

మనం చేసిన తీర్మానంలో ఎంతవరకు విజయం సాధించామనే విషయాన్ని పక్కనపెడితే, మన సంకల్పం ఏంటన్నదే ముఖ్యం. సంకల్పం అనేది దిశను చూపిస్తుందని.. ఫలితాన్ని కాదని అంటారు నిపుణులు. ఫలితం ఎప్పుడూ మన చేతుల్లో ఉండదు. కానీ ప్రయత్నం మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది. మనం ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు ఒత్తిడి తగ్గుతుంది. ఉదాహరణకు.. 'నేను బరువు తగ్గాలి' అనుకోవడం కంటే 'నేను ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి' అని సంకల్పించుకోవడం వల్ల విఫలమైనప్పుడు వచ్చే గిల్టీ ఫీలింగ్ తక్కువగా ఉంటుంది.

క్యాలెండర్‌తో కొత్త ఉత్సాహం

ఏడాది మారగానే అన్నీ మారిపోవు. కానీ, మానసికంగా 'కొత్త ఏడాది' అనేది ఒక తెల్ల కాగితం లాంటిది. పాత వైఫల్యాలు, పశ్చాత్తాపాలను అక్కడే వదిలేసి మళ్లీ మొదటి నుంచి మొదలుపెట్టడానికి ఇదొక గొప్ప అవకాశం. ఈ 'క్యాలెండర్ రీసెట్' మన జీవితానికి ఒక పద్ధతిని, క్రమశిక్షణను ఇస్తుంది. మన అలవాట్లను మనం సరిచూసుకోవడానికి ఇదొక చక్కని సమయం.



పొరపాటు ఎక్కడ?

తీర్మానాలు తప్పడం సహజం, అయితే ఆ తప్పు తీర్మానానిది కాదు. మనం దాన్ని చూసే విధానానిది. చాలా మంది తమ శక్తికిమించి అతిపెద్ద లక్ష్యాలు పెట్టుకుంటారు. మరికొందరు చిన్నచిన్న విషయాలకే పరిమితమవుతారు. కచ్చితమైన గడువులు పెట్టి ఒత్తిడిని ఏరికోరి తెచ్చి నెత్తిన పెట్టుకుంటారు. దీనికి బదులుగా మార్పు అనేది ఒక్క రోజులో రాదని గుర్తుంచుకోవాలి. లక్ష్యం కంటే ప్రయాణం మీదే దృష్టిపెట్టాలి. పరిపూర్ణత కోసం కాకుండా పురోగతి కోసం ప్రయత్నించాలి.


ఈసారి తీర్మానం ఎందుకు చేసుకోవాలి?

ఈసారి కూడా కచ్చితంగా రిజల్యూషన్ తీసుకోవాలి. ఎందుకంటే.. అందుకు చేసే ప్రయత్నం వృథాపోదు. ఉదాహరణకు మీరు ప్రతిరోజు నడవాలని తీర్మానం చేసి మూడువారాలే నడిచారనుకుందాం. ఆ 21 రోజులు నడవడం వల్ల మీ శరీరానికి, మనసుకు మేలే జరిగింది కదా! ఆ ప్రయోజనం ఎక్కడికీ పోదు. మనం పెద్దవాళ్లం అవుతున్న కొద్దీ 'మనం మారలేం.. పరిస్థితులు ఇంతే' అనే నిరాశలో ఉంటాం. కానీ, తీర్మానం చేసుకోవడం అంటే 'నేను మారగలను.. రేపు బాగుంటుంది' అని మన మీద మనకు ఉన్న నమ్మకం. అలాగే, ఏదైనా కొత్తగా చేయాలని అనుకున్నప్పుడు మన మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. కాబట్టి తీర్మానాలు అనేవి మనల్ని మనం కట్టడి చేసుకోవడానికి కాదు, మనల్ని మనం మెరుగుపరుచుకోవడానికి. అది రెండు రోజులు నిలిచినా, 200 రోజులు నిలిచినా ఆ ప్రయత్నం వెనుక ఉన్న మీ తపన గొప్పది. కాబట్టి ఈ కొత్త ఏడాది కూడా ధైర్యంగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. అది విఫలమైనా పర్లేదు. ఎందుకంటే ఎదుగుదలకు గ్యారెంటీ కార్డు అక్కర్లేదు. గట్టి ప్రయత్నం ఉంటే చాలు!

ముత్యాల ముగ్గు



ఎం. ధనలక్ష్మి
కల్లూరిపల్లి హౌసింగ్‌బోర్డ్ కాలనీ,
నెల్లూరు.



15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకు
సరిచుక్క

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-33
ఈ-మెయిల్ :
features@andhrajyothy.com




బాలుడితో డాక్టర్ కవిత, డాక్టర్ నాగూర్‌బాషా తదితరులు, బాల్ పాయింట్ పెన్ను

పందెం కోసం బాల్ పెన్ను మింగేశాడు

- మూడేళ్ల క్రితం మింగిన గుంటూరు బాలుడు
- ఎండోస్కోపీతో క్షణాల్లో బయటకు తీసిన వైద్యులు

గుంటూరు మెడికల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదగా పందెం కాసిన ఓ బాలుడు మూడేళ్ల క్రితం బాల్ పెన్ను మింగేశాడు. ఆ విషయాన్ని ఇంట్లో చెప్పకుండా దాచాడు. అయితే మూడేళ్ల తర్వాత గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి వైద్యులు ఆపరేషన్‌తో పనిలేకుండా ఎండోస్కోపీ ద్వారా క్షణాల్లో ఆ పెన్నును బయటకు తీశారు. గుంటూరుకు చెందిన ఎం రవి మురళీకృష్ణ (16) ఇంటర్ చదువుతున్నాడు. మూడేళ్ల క్రితం స్నేహితులతో సరదగా పందెం కాసి బాల్‌పాయింట్ పెన్నును మింగాడు. ఏడాది నుంచి తరచూ కడుపు నొప్పి వస్తుండటంతో తల్లిదండ్రులు వైద్యులకు చూపించారు. ఇటీవల గన్నవరంలో ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు.. మురళీకృష్ణకు వైద్యపరీక్షలు నిర్వహించి పేగుల్లో ఉన్న పెన్నును గుర్తించారు. దాన్ని బయటకు తీసేందుకు గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ నెల 27న బాధితుడు గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఏ కవిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణతో కూడిన వైద్య బృందం ఆపరేషన్‌తో పనిలేకుండా రెట్రోగ్రేడ్ ఎండోస్కోపీ విత్ ఓవర్ ట్యూబ్ సాయంతో క్షణాల్లో పేద్ద పేగులోని బాల్ పాయింట్ పెన్నును బయటకు తీశారు. ఈ బృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు.

సహజ ప్రసవంలో 4.8 కిలోల శిశువు జననం



తల్లీబిడ్డలతో వైద్య బృందం, 4.8 కిలోల బరువున్న శిశువు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సహజ ప్రసవం ద్వారా ఓ మహిళ 4.8 కిలోల బరువున్న మగ శిశువుకు జన్మనిచ్చింది. పెందుర్తి ప్రాంతానికి చెందిన కె.రూపవతికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను మంగళవారం అర్ధరాత్రి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం (జిల్లా ఆస్పత్రి)లో చేర్పించారు. ఆమెకు ఎనిమిదో నెలలో నిర్వహించిన స్కానింగ్‌లో శిశువు బరువు మూడు కిలోలున్నట్టు భావించారు. తొమ్మిది నెలలు నిండేసరికి శిశువు బరువు మరింత పెరిగే అవకాశం ఉన్నందున సహజ ప్రసవం కానిపక్షంలో సిజేరియన్ చేసేందుకు వైద్యులు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రసవ సమయంలో శిశువు తల మామూలుగానే వచ్చినప్పటికీ భుజాలు బయటకురావడంలో సమస్య తలెత్తింది. దీంతో సిజేరియన్ తప్పదేమోనని వైద్యులు భావించారు. అయితే వైద్యులు సౌజన్య, మానస, స్టాఫ్‌నర్సులు జగదీశ్వరి, జె.కుమారి, ఏఎన్ఎం సరస్వతి సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి సహజ ప్రసవం జరిగేలా చూశారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. సెకండరీ ఆస్పత్రుల్లో ఇలాంటివి జరగడం చాలా అరుదని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు తెలిపారు.

సహజ ప్రసవాలు పెరగాలి: మంత్రి సత్యకుమార్

సహజ ప్రసవం అయ్యేందుకు అనకాపల్లి జిల్లా ఆస్పత్రి సిబ్బంది తీసుకున్న చొరవను వైద్య ఆరోగ్య సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఇటువంటి చొరవ ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు.

పంచాయతీలకు 'స్వర్ణ' కాంతులు!

ఆన్‌లైన్ చెల్లింపులతో సత్ఫలితాలు.. ఇప్పటికే 200 కోట్ల పన్ను వసూళ్లు

- 88 లక్షల ఆస్తుల కంప్యూటరీకరణ
- వాట్సాప్, ఫోన్‌పే ద్వారా చెల్లింపులు
- పన్నుల వసూళ్లలో అవినీతికి చెక్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీల్లో చేపట్టే పన్నుల వసూళ్లలో అక్రమాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్ సత్ఫలితాలను ఇస్తోంది. ఆన్‌లైన్ ద్వారా ఇప్పటికే రూ.200 కోట్ల మేర పన్నులు పంచాయతీరాజ్ ఖాతాకు చేరాయి. పన్ను వసూళ్లలో పారదర్శకత కోసం గ్రామాల్లోని ఆస్తులను కంప్యూటరీకరణ చేయడంలో భాగంగా రాష్ట్రంలోని 13వేల పంచాయతీల్లో 88లక్షల అసెస్‌మెంట్లను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏ ఆస్తికి ఎంత పన్ను వసూలు చేయాలో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నిక్షిప్తం చేశారు. పంచాయతీలకు చెల్లించాల్సిన డిమాండ్ నోటీసులు కుటుంబాల యజమానుల ఫోన్లకు పంపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.1,052 కోట్ల మేర పన్నులు ఆన్‌లైన్ ద్వారానే చెల్లించే వెసులుబాటు కల్పించారు. డబ్బులు చెల్లించిన వెంటనే ఆ మొత్తానికి రశీదు అందుతోంది. వాట్సాప్, ఫోన్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా కూడా ఈ పన్నులు చెల్లించే అవకాశం లభించింది. పన్ను వసూళ్లలో ఒక్క పైసా కూడా అవినీతికి పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పౌరులు చెల్లించే ప్రతి పైసాకు జవాబుదారీగా స్వర్ణ పంచాయతీ నిలుస్తోంది.



పెరిగిన ఆదాయం

పంచాయతీల్లో ఎంతమేర పన్నులు వసూళ్లు అవుతున్నాయి? ఎంత ఖర్చు చేస్తున్నారన్న దానిపై మొన్నటివరకూ కాకి లెక్కలు చూపించేవారు. వసూలు చేసే పన్నులకు లెక్కపక్కా లేకపోవడంతో నిధులు భారీగా దుర్వినియోగమయ్యేవి. ఈ నేపథ్యంలో అందుబాటులోకి తెచ్చిన స్వర్ణ పంచాయతీ పోర్టల్ పన్నులకు రక్షణగా నిలిచింది. దీంతో పాటు పన్నుల వసూళ్ల శాతం కూడా పెరగనుంది. అలాగే ఏ పంచాయతీకి ఎంత పన్ను వసూలైందో ఆన్‌లైన్‌లో ఎవరైనా చూసుకునే వెసులుబాటు కల్పించారు. పంచాయతీ కార్యాలయానికి వెళ్లకుండానే, పంచాయతీ కార్యదర్శిని సంప్రదించకుండానే పన్నులు చెల్లించే అవకాశం లభించింది. రాష్ట్రంలోని పంచాయతీలకు వార్షికాదాయం ఎంతన్నదానిపై ఇప్పటి వరకు స్పష్టమైన లెక్కల్లేవు. 2024-25 సంవత్సరం అసెస్‌మెంట్ ప్రకారం ఇప్పుడు స్వర్ణ పంచాయతీల్లో సుమారు రూ.1,052 కోట్లు పన్నుల ఆదాయం రానుందని భావిస్తున్నారు. వచ్చే ఏడాది మరో 5శాతం ఆదాయం పెరగనుంది. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌తో ఇకపై పన్నుల రాబడి స్థిరంగా ఉండటంతో పాటు తప్పుడు బిల్లులకు అవకాశం లేకుండా పోయిందని పలువురు పేర్కొంటున్నారు.

సీఎంపై మూసివేసిన కేసుల రికార్డులివ్వండి

- హైకోర్టులో పిటిషన్లు దాఖలు
- పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీకి న్యాయస్థానం ఆదేశం
- విచారణ వారం రోజులకు వాయిదా

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి పి.నారాయణ తదితరులపై నమోదైన కేసుల రికార్డులు ఇచ్చేందుకు బెజవాడ ఏసీబీ కోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. వాటిని విచారణకు స్వీకరించి.. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫైబర్ గ్రిడ్, లిక్కర్, మద్యం పాలసీలకు సంబంధించి చంద్రబాబు తదితరులపై నమోదు చేసిన కేసులను విజయవాడ ఏసీబీ కోర్టు ఇటీవల మూసివేసింది. వీటి తీర్పు ప్రతులతో పాటు రికార్డులన్నింటినీ ఇవ్వాలని కోరగా కోర్టు నిరాకరించింది. దీనిపై ఎమ్మార్పీఎస్ ఏపీ అధ్యక్షుడు సువర్ణరాజు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'రాష్ట్రం, నిందితులు కుమ్మక్కై కేసులు మూసివేయించుకుంటున్నారు. ఇప్పటికే ఐదారు కేసుల విచారణను మూసివేసినట్లు తెలిసింది. మూసివేత ఉత్తర్వుల కాపీలు ఇవ్వాలని ఏసీబీ కోర్టును ఆశ్రయించగా థర్డ్ పార్టీకి ఇవ్వలేమని నిరాకరించింది' అని తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. 'కోర్టు ముందున్న కేసుల్లో మీరు మూడోపక్షం, ఆ కాపీలు మీకెందుకు? వాటిని పొందేందుకు మీకు అర్హత ఎక్కడుంది' అని ప్రశ్నించారు. పొన్నవోలు బదులిస్తూ... సీఆర్‌పీసీ సెక్షన్ 363(3) ప్రకారం మూడోపక్షానికి తీర్పు ప్రతులు పొందే అర్హత ఉందని.. క్రిమినల్ రివిజన్ పిటిషన్ సైతం దాఖలు చేయవచ్చని తెలిపారు.సీఐడీ తరఫున అదనపు పీపీ పాణిని సోమయాజి స్పందిస్తూ.. ఏసీబీ కోర్టు నుంచి ప్రతులను పొందే అర్హత పిటిషనర్‌కు లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశించారు.

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణపై కౌంటర్ వేయండి

- మూడు శాఖలకు హైకోర్టు నోటీసులు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అనధికార, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు చేసిన చట్ట సవరణను, జారీ చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్) పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పురపాలక, పంచాయతీరాజ్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శులు, పురపాలక శాఖ కమిషనర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌లకు నోటీసులు జారీ చేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రకాశం జిల్లా, చంద్రారెడ్డిపల్లెకు చెందిన చిన్నబోయిన హరికృష్ణ ఈ పిల్ వేశారు.

3 పట్టణ స్థానిక సంస్థలు అప్‌గ్రేడ్

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు పట్టణ స్థానిక సంస్థలను అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులిచ్చింది. ఫస్ట్ గ్రేడ్‌గా ఉన్న తణుకు మున్సిపాలిటీని సెలక్షన్ గ్రేడ్‌గాను, స్పెషల్ గ్రేడ్‌గా ఉన్న కదిరి మున్సిపాలిటీని సెలక్షన్ గ్రేడ్‌గాను, గ్రేడ్-3 మున్సిపాలిటీగా ఉన్న కొవ్వూరును గ్రేడ్-1 మున్సిపాలిటీగాను అప్‌గ్రేడ్ చేసింది.



విద్యుత్ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న సీఎస్ విజయానంద్ తదితరులు

విద్యుత్ నష్టాలను తగ్గించాం

- విద్యుత్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణలో సీఎస్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా నష్టాలను గణనీయంగా తగ్గించడంతో దేశంలోనే ఏపీ నంబర్‌వన్‌గా నిలిచిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. విద్యుత్ ఉద్యోగుల డైరీని బుధవారం ఆయన విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ నష్టాలు సుమారు 9.6 శాతానికి తగ్గగా, ట్రాన్స్‌కో నష్టాలు 2.6 శాతానికి తగ్గాయన్నారు. జెన్కో ఎండీ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ, దక్షిణ కోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో దట్టంగా మంచు కురిసింది. కొన్నిచోట్ల గాలిలో తేమ 100 శాతంగా నమోదైంది.

వక్ఫ్‌బోర్డు సీఈవోగా యాకుబ్ బాషా

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోగా యాకుబ్ బాషాను (అదనపు బాధ్యతలు) ప్రభుత్వం నియమించింది. పంచాయతీరాజ్ శాఖలో డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, డిప్యుటేషన్‌పై మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీగా, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న యాకుబ్ బాషాకు వక్ఫ్ బోర్డు సీఈవోగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

22 మందికి ఎస్ఈలుగా పదోన్నతులు

రాష్ట్రంలో పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో 22 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పదోన్నతి పొందిన ఆయా ఎస్ఈలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఆదేశాలిచ్చారు.

వడ్డేశ్వరానికి ఉద్యాన డైరెక్టర్ కార్యాలయం

గుంటూరు చుట్టుగుంటలో ఉనన్న రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల డైరెక్టర్ కార్యాలయాన్ని తాడేపల్లి మండలం వడ్డేశ్వరం తరలించడానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి తెచ్చి, గుంటూరులో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అయితే ఆ భవనం వర్షానికి నీరు కారుతున్నందున వడ్డేశ్వరంలోని ప్రైమ్ హిల్ క్రెస్ట్ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు.

వైసీపీ నేతల కంటే మావోయిస్టులే నయం

- కంపెనీల యాజమానులు, కాంట్రాక్టర్లకు బెదిరింపులా?: కళా వెంకట్రావు

విజయనగరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నేతల కంటే మావోయిస్టులే నయం. వారు సిద్ధాంతం కోసం పోరాడితే, వైసీపీ నాయకులకు సిద్ధాంతమే లేదు. కేవలం బెదిరింపులకు పాల్పడడమే వారి లక్ష్యం' అని టీడీపీ సీనియర్ నేత, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు ధ్వజమెత్తారు. విజయనగరం జడ్పీ అతిథి గృహంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణపై నిప్పులు చెరిగారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలల నిర్మాణ, నిర్వహణకు ముందుకు వచ్చిన వారిని, అభివృద్ధి పనులు చేయడానికి ఆసక్తి చూపుతున్న కాంట్రాక్టర్లను బెదిరిస్తూ రాజ్యాంగేతర శక్తులుగా తయారయ్యారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

దేవాలయాల్లో తప్పులు జరిగితే కఠిన చర్యలు

▸▸ దేవదాయశాఖ మంత్రి ఆనం

ఏఎస్‌పేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో తప్పులు చేసినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కోనసీమలోని ద్రాక్షారామంలో శివలింగాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేశారని, శివలింగం వెంటనే పునఃప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 32 వైష్ణవాలయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ముక్కోటి రోజున 7.62 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని మంత్రి తెలిపారు.

శివలింగం ధ్వంసంపై సీఎం ఆరా

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో గుర్తు తెలియని వ్యక్తులు శివలింగాన్ని ధ్వంసం చేయడంపై సీఎం చంద్రబాబు స్పందించారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం విషయం తెలిసిన వెంటనే దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ధ్వంసమైన శివలింగం స్థానంలో నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించాలని, శివలింగం ధ్వంసం ఘటనకు కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సీఎం ఆదేశించారు.

8న క్యాబినెట్ సమావేశం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం 8వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరగనుంది. సమావేశానికి ఆయా శాఖల నుంచి ప్రతిపాదనలను జనవరి 6 సాయంత్రం 4 గంటలలోగా అందించాలని ఆయా శాఖలను కోరుతూ ఉత్తర్వులు ఇచ్చారు.

అరకులో బ్లడ్‌బ్యాంక్

▸▸ సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు పవన్ కానుక

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నూతన సంవత్సర కానుక అందించారు. గిరిజన మహిళల్లో గర్భస్రావాలు, రక్తహీనత తదితర రుగ్మతలకు కారణమవుతున్న సికిల్‌సెల్ ఎనీమియా నుంచి రక్షణ కల్పించేందుకు చొరవ తీసుకున్నారు. సికిల్‌సెల్ బాధితుల కోసం అరకులో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు పవన్‌కల్యాణ్ చొరవ చూపారు. దాతల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా బ్లడ్‌బ్యాంక్ భవనం నిర్మాణం చేపట్టారు.

అప్పులపై తప్పుడు ప్రచారం

▸▸ రాష్ట్ర అప్పులు 1.19 లక్షల కోట్లైతే...

2.93 లక్షల కోట్లు అంటూ తప్పుడు రాతలు: నీలాయపాలెం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అప్పులపై జగన్ పత్రిక తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వం వాస్తవ అప్పు రూ.1.19 లక్షల కోట్లు. దీన్ని జగన్ పత్రిక రూ.2.93 లక్షల కోట్లుగా పేర్కొంటూ తప్పుడు రాతలు రాస్తోంది. ఆర్బీఐ, కాగ్ అధికారిక లెక్కలను పక్కన పెట్టి కార్పొరేషన్, సీఆర్డీయే, మార్క్‌ఫెడ్ అప్పులను కూడా రాష్ట్ర అప్పులుగా చూపుతూ ప్రజలను మభ్య పెడుతోంది.' అని విమర్శించారు.

18 నెలల్లో 90% హామీలు నెరవేర్చాం: అశోక్‌బాబు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే 90 శాతం హామీలను అమలు చేసిందని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు అన్నారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించిందని, గాడి తప్పిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం కేవలం ఏడాదిన్నరలో గాడిన పెట్టిందన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ విడిగా మాట్లాడుతూ, 'విధ్వంసం నుంచి విజన్ వైపు, అరాచకం నుంచి అభివృద్ధి వైపు రాష్ట్రం దూసుకుపోతుంది.' అని పేర్కొన్నారు.

300 కోట్లు పన్ను ఎగ్గొడుతున్నారు

▸▸ ఐరన్ స్క్రాప్ వ్యాపారులపై సీఎంకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి ఫిర్యాదు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రవ్యాప్తంగా ఐరన్ స్క్రాప్ వ్యాపారులు ఏటా సుమారు రూ.300 కోట్లు పన్నులు ఎగ్గొడుతున్నారు. వారిపై దృష్టి సారిస్తే రాష్ట్రానికి పెద్దఎత్తున ఆదాయం సమకూరుతుంది' అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

ఉమ్మడి మ్యూజియం విభజనకు ఏపీ కమిటీ

▸▸ పురాతన వస్తువులు రాష్ట్రానికి తెచ్చే బాధ్యత అప్పగింత

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్ర మ్యూజియంలో ఉన్న పురాతన వస్తువులను రెండు రాష్ట్రాలకు విభజించేందుకు ఏపీ తరఫున ఓ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ పి.తేజస్వి నేతృత్వంలోని ఆ కమిటీలో పురావస్తు శాఖ కమిషనర్, రిటైర్డ్ హిస్టరీ ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ, రిటైర్డ్ స్థపతి డా.ఈ.శివనాగిరెడ్డి, మ్యూజియమ్స్ డిప్యూటీ డైరెక్టర్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ కె.ఎస్.బి.కేశవ్, మ్యూజియమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వాసుదేవచారి, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ ఎం.యోగిరెడ్డిలను ప్రభుత్వం సభ్యులుగా నియమించింది. ఈ మేరకు పర్యాటక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

784 సీనియర్ రెసిడెంట్లకు పోస్టింగ్స్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బోధనాస్పత్రులు, సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో 784 మంది సీనియర్ రెసిడెంట్లను (ఎస్ఆర్) నియమించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరంతా ఏడాది పాటు విధులు నిర్వహిస్తారన్నారు. జనవరి 5 నాటికి వీరంతా విధుల్లో చేరాలని, ఆరు నెలల పాటు టీచింగ్ ఆస్పత్రి, మరో ఆరు నెలలపాటు సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో పోస్టింగ్స్ ఇచ్చామని చెప్పారు. ఎంబీబీఎస్, పీజీలో వచ్చిన మార్కుల ఆధారంగా, అత్యంత పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరిగిందన్నారు. పీజీ వైద్య విద్య పూర్తి చేసిన వారు 18 నెలల్లోగా ఏడాది పాటు ప్రభుత్వ సర్వీస్ పూర్తి చేయాలని సూచించారు.

డబుల్ ఇంజన్ పాలనలో రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి: లంకా దినకర్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజోతి): 'డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలనలో 2025 సంవత్సరంలో రాష్ట్రంలో గణనీయమైన అభివృద్ధి సాధించాం. ఇదే స్ఫూర్తిని 2026లో కూడా కొనసాగిస్తాం' అని 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.'సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దారు. ప్రధాని మోదీ అన్ని విధాలా ప్రోత్సహిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా సహకరిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుంది. మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేయడం అభినందనీయం, దీనివల్ల వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి పథంలోకి వస్తాయి. స్వర్ణాంధ్ర సాధనలో కొత్త జిల్లాలు, డివిజన్లు ఏర్పాటు కీలక పాత్ర పోషిస్తాయి. వైద్య కళాశాలలపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలి. వీబీజీ రాంజీ పథకంపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలి. అవకతవకలు, అక్రమాలు జరగకుండా నిరోధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కేంద్ర, రాష్ట్ర పథకాలు, ప్రాజెక్టుల అమలుపై 26 జిల్లాల్లో మొదటి దశ పర్యటన పూర్తి చేశాం. రెండవ దశలో విద్య, వైద్యం, జల్‌జీవన్ మిషన్ తదితర పథకాల అమలుపై ఇప్పటికే 7 జిల్లాల్లో సమీక్షలు పూర్తి చేశాం. ఆ సమీక్షల్లో గుర్తించిన అంశాలను సీఎం చంద్రబాబుకు నివేదిక రూపంలో అందజేస్తున్నాం' అని దినకర్ పేర్కొన్నారు.

కొత్త ఏడాదిలో రెట్టింపు సంతోషం, సంక్షేమం, అభివృద్ధి

▸▸ గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ఆంధప్రదేశ్ ప్రజలకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. 'నూతన సంవత్సరం అందరికీ ఉల్లాసం, ఆనందం, శాంతి, శ్రేయస్సును అందించాలి. నూతన ఏడాది అందరికీ కొత్త అవకాశాలను తెస్తుందని ఆశిద్దాం' అని గవర్నర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'కూటమి ప్రభుత్వానికి 2025 మరచిపోలేని విజయాలను, ఎన్నో మైలు రాళ్లను అందించింది. అనేక సంక్షేమ కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు నాంది పలికింది. ఏ రంగంలో చూసినా 2025 కేవలం ఒక గడిచిన సంవత్సరం కాదు. నాటి విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్‌ను వికాసం వైపు నడిపించిన గొప్ప మలుపు. ఇదే స్ఫూర్తితో 2026 నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్తకాంతులు నింపాలని మనసారా కోరుకుంటున్నా. కొత్త ఏడాదిలో ప్రజలకు రెట్టింపు సంతోషం, సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు కృషి చేస్తానని మాటిస్తున్నా. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని సీఎం పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేస్తూ... 'గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నాం. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2026 క్యాలెండర్ ఇయర్‌లో కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంది' అని పేర్కొన్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా విద్యుద్దీపాలంకరణలో విజయవాడలోని లోక్‌భవన్

మరో గ్రీన్‌ఫీల్డ్ హైవేతో ఏపీ అనుసంధానం



కర్నూలు నగరంలో వేగంగా జరుగుతున్న సోలాపూర్-చెన్నై జాతీయ రహదారి పనులు

నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ మధ్య రూ.19,142 కోట్లతో 6 వరుసల హైవే

▸▸ సోలాపూర్-చెన్నై రహదారితో దీనికి లింకు

▸▸ కర్నూలు, కడప, రేణిగుంట మీదుగా ప్రయాణం

▸▸ ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లకు మెరుగుపడనున్న సరుకు రవాణా

▸▸ కేంద్ర క్యాబినెట్ కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ/కర్నూలు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ అనుసంధానం కానుంది. దేశంలో రెండు జాతీయ రహదారులను రూ.20,668 కోట్లతో అభివృద్ధి చేసే ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ పచ్చజెండా ఊపింది. బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో మహారాష్ట్రలోని నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ వరకు రూ.19,142 కోట్ల అంచనా వ్యయంతో బీవోటీ విధానంలో 374 కిలోమీటర్ల మేర ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మిస్తారు. రూ.1,526 కోట్లతో ఒడిసాలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-326 (మోహన-కోరాపుట్)ను 206 కిలోమీటర్ల మేర విస్తరించనున్నారు. నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి.. చెన్నై-సూరత్ ఎకనామిక్ కారిడార్‌లో కీలకం. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను.. సోలాపూర్-చెన్నై మధ్య ప్రస్తుతం నిర్మిస్తున్న 4 వరుసల జాతీయ రహదారితో సోలాపూర్ వద్ద అనుసంధానిస్తారు. సోలాపూర్-చెన్నై రోడ్డు కర్ణాటకలోని కోస్గి, రాయచూరు, తెలంగాణలోని మహబూబ్‌నగర్, ఏపీలోని కర్నూలు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా తమిళనాడులోని చెన్నై పోర్టుకు వెళ్తుంది. ప్రతిపాదిత నూతన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్‌ను దీనికి లింక్ చేయడం వల్ల రాయలసీమ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని ముంబై, పుణే, నాసిక్ వంటి నగరాలకు రవాణా సమయం భారీగా తగ్గనుంది. ఏపీలోని పారిశ్రామిక హబ్‌లు ఓర్వకల్, కొప్పర్తికి సరుకు రవాణా మెరుగుపడనుంది. ముఖ్యంగా సూరత్-చెన్నై మధ్య దూరం 201 కిలోమీటర్లు తగ్గుతుంది. ప్రయాణ సమయం కూడా 31 గంటల నుంచి 17 గంటలకు గణనీయంగా తగ్గనుంది. ఈ ప్రాజెక్టుతో 2.51 కోట్ల ప్రత్యక్ష పనిదినాలు, 3.13 కోట్ల పరోక్ష పనిదినాల ఉపాధి దొరుకుతుంది. ఈ ప్రాజెక్టు మహారాష్ట్రతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు జీవనాడిలాంటిదని, ఉపాధి అవకాశాలు ఎంతగానో పెరుగుతాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఎన్‌హెచ్-326 విస్తరణతో మోహన-కోరాపుట్ నుంచి రాయ్‌పూర్-విశాఖపట్నం కారిడార్‌కు అనుసంధానం ఏర్పడుతుంది. ఛత్తీస్‌గఢ్, ఒడిసా నుంచి విశాఖపట్నం పోర్టుకు సరుకు రవాణా వేగంగా జరుగుతుంది.

పశ్చిమ తీరం నుంచి తూర్పు తీరానికి అనుసంధానం

దేశంలో పశ్చిమ తీరాన్ని తూర్పు తీరానికి అనుసంధానించడంలో భాగంగా నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే చెన్నై పోర్టు నుంచి తిరువళ్లూరు, ఏపీలో రేణిగుంట, కడప, కర్నూలు మీదుగా మహారాష్ట్రలోని హసాపూర్(సోలాపూర్) వరకు సాగే 700 కిలోమీటర్ల నాలుగు వరుసల జాతీయ రహదారి కారిడార్ పనులు కర్నూలు వద్ద జోరుగా జరుగుతున్నాయి. ఈ రెండు కారిడార్లు అనుసంధానమైతే కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లలో స్థాపించే వివిధ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకు రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పశ్చిమ భారతం నుంచి తిరుమల చేరుకోవడానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సోలాపూర్-చెన్నై హైవేలో భాగంగా కర్నూలు శివారులో తుంగభద్ర, హంద్రీ నదులపై భారీ వంతెనల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల అనుసంధానంతో కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. తద్వారా సీమలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం జిల్లాల వాసులు హైదరాబాద్ మీదుగా సోలాపూర్ వెళ్లాల్సి వస్తోంది. సోలాపూర్-చెన్నై హైవే నిర్మాణం పూర్తయితే కర్నూలు, మహబూబ్‌నగర్, రాయచూరు మీదుగా సోలాపూర్ చేరుకోవచ్చు. కర్నూలు నుంచి సోలాపూర్‌కు దాదాపు 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

చంపేస్తామంటున్నారు!

▸▸ అవినాశ్‌ను ఎందుకు ఇబ్బందిపెడుతున్నారు?

▸▸ మిమ్మల్ని చంపేస్తే దిక్కెవరని ఓ వ్యక్తి బెదిరించాడు

▸▸ పోలీసులకు ఏ-2 సునీల్ యాదవ్ ఫిర్యాదు



పులివెందులలో మీడియాతో మాట్లాడుతున్న సునీల్ యాదవ్

పులివెందుల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తనను, తన తమ్ముడు కిరణ్ యాదవ్‌ను చంపేస్తామని బెదిరిస్తున్నారంటూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు సునీల్ యాదవ్ (ఏ-2) ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన, ఆయన భార్య బుధవారం రాత్రి పులివెందుల అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం సునీల్ మీడియాతో మాట్లాడారు. 'హత్య' సినిమాలో చూపించిన తన తల్లిపాత్రను వైసీపీ సోషల్ మీడియాలో, వైసీపీ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి తన కుటుంబ పరువును దిగజార్చారని.. దీనిపై తాను గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తన రెండు నెలల కుమార్తెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చూపించేందుకు తన తమ్ముడు కిరణ్ యాదవ్, తన భార్య ధనలక్ష్మి ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రికి వెళ్లారన్నారు. వారు ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఓ ఫంక్షన్ హాలు వద్ద ఎదురుగా వస్తున్న వ్యక్తి వారిని ఆపి.. 'ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని, వైసీపీ సోషల్ మీడియా సభ్యుడు పవన్‌కుమార్‌ను మీరెందుకు ఇబ్బంది పెడుతున్నారు? మిమ్మల్ని ఇప్పుడు చంపితే దిక్కెవరు' అని బెదిరించాడని.. తాను పవన్‌కుమార్ స్నేహితుడినని చెప్పి వెళ్లిపోయాడని సునీల్ తెలిపారు. దీంతో తన తమ్ముడు, భార్య భయభ్రాంతులకు గురై ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తనకు చెప్పారని.. వెంటనే అర్బన్ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై సీఐ సీతారామిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. సునీల్ ఫిర్యాదు చేశారని.. విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అద్దేపల్లి నుంచి జోగికి

నెలకు 5 లక్షల ముడుపులు!

2021-23 మధ్య సుమారు కోటి జమ .. రమేశ్ చిన్నాన్న ఆధ్వర్యంలో ఖాతాలు

▸▸ 2023-25 మధ్య 7 వేల ఫోన్ కాల్స్

▸▸ నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌పై 100 పేజీల సప్లిమెంటరీ-2 చార్జిషీటు

విజయవాడ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం వ్యవహారంలో సూత్రధారి అద్దేపల్లి జనార్దనరావు ఆయన సోదరుడి నుంచి వైసీపీ నేత, మాజీ మంత్ర జోగి రమేశ్‌కు నెలకు రూ.3-5 లక్షల రూపాయల ముడుపులు అందినట్టు తెలిసింది. అదేవిధంగా అద్దేపల్లి సోదరులు, జోగికి మధ్య 2023-25లో ఏడు వేలకు పైగా ఫోన్ కాల్స్ సంభాషణలు జరిగాయి. ఈ మేరకు నకిలీ మద్యం కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు జోగి బ్రదర్‌పై సుమారు 100 పేజీలతో కూడిన సప్లిమెంటరీ చార్జిషీట్‌ను విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం సమర్పించారు. సిట్ అధికారులు ఎనిమిది మంది నిందితులపై డిసెంబరు 5న తొలి చార్జిషీట్‌ను దాఖలు చేశారు. తర్వాత ముగ్గురు నిందితులపై 12వ తేదీన మొదటి సప్లిమెంటరీ చార్జిషీట్‌ను సమర్పించారు. తాజాగా జోగి రమేశ్(ఏ18), ఆయన సోదరుడు రాము(ఏ19), నాగరాజు బాలాజీ(ఏ3), సయ్యద్ హాజీ(ఏ5), కట్టా రాజు(ఏ6), మిథున్ దాస్(ఏ9), అంతాదాస్(ఏ10), తలారి రంగయ్య(ఏ14), ముత్తా మనోజ్‌కుమార్(ఏ20), బాలాజీ సుదర్శన్(ఏ21), దారబోయిన ప్రసాద్(ఏ23), జినేశ్(ఏ24), షిబు(ఏ25)ల పాత్రను వివరిస్తూ రెండో సప్లిమెంటరీ చార్జ్‌షీట్‌ను దాఖలుచేశారు. నిందితుల మధ్య జరిగిన సంభాషణలకు సంబంధించిన కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలను ఇందులో వివరించినట్టు తెలిసింది. సుమారు 20 మంది సాక్షులను చార్జిషీట్‌లో పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహన్‌రావుకు జోగి రమేశ్ సోదరులతో ఉన్న బంధాన్ని చార్జిషీట్‌లో వివరించారు. నకిలీ మద్యం ద్వారా అద్దేపల్లి సోదరుల నుంచి జోగి బ్రదర్స్ నెలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ముడుపులు అందుకున్నట్టు పేర్కొన్నారు. అద్దేపల్లి జనార్దనరావు 2021 నుంచి నకిలీ మద్యం తయారీని ఎలా మొదలుపెట్టారన్న అంశాన్ని వివరించారు. హైదరాబాద్‌లోని నిజాంపేట నుంచి విజయవాడకు మద్యం సరుకును ఏవిధంగా ఎంతెంత పంపారన్న వివరాలను తెలియజేశారు. 2023లో మొత్తం సుమారుగా 500 టిన్‌ల మద్యాన్ని విజయవాడలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న నకిలీ మద్యం తయారీ కేంద్రానికి పంపినట్టు సిట్ అధికారులు పేర్కొన్నారు. అద్దేపల్లి సోదరులు, జోగి బ్రదర్స్ మధ్య 2023 అక్టోబరు నుంచి 2025 సెప్టెంబరు వరకు సుమారు 7 వేల ఫోన్‌కాల్స్‌తో సంభాషణలు జరిగినట్టు కాల్ డేటా ద్వారా సిట్ ఆధారాలు సేకరించింది. ఆ విషయాన్ని చార్జిషీట్‌లో స్పష్టం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా నిందితుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్లను కోర్టుకు సమర్పించారు. అద్దేపల్లి సోదరుల నుంచి జోగి సోదరులకు బ్యాంకు ఖాతాల ద్వారా సుమారుగా రూ.60 లక్షల వరకు చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. జోగి రమేశ్‌కు చెందిన స్వర్ణ డెవలపర్స్ పేరుతో ఉన్న బ్యాంక్ ఖాతాలో 2021-23 మధ్య సుమారు రూ.కోటి జమ అయినట్టు సిట్ గుర్తించిందని సమాచారం. ఒక్క 2024లోనే రూ.25 లక్షలు చేరినట్టు తెలిసింది. ఈ ఖాతాలను జోగి రమేశ్ చిన్నాన్న జోగి వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్నట్టు గుర్తించారని తెలిసింది. ఈ విషయాన్ని చార్జిషీటులో పొందుపరిచారని విశ్వసనీయంగా తెలిసింది.



నకిలీ మద్యం కేసు నిందితుడు జోగి రమేశ్‌ను కోర్టుకు తెస్తున్న పోలీసులు

నిందితులకు రిమాండ్ పొడిగింపు

నకిలీ మద్యం కేసులో నిందితులుగా ఉన్న 17 మందికి విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జి. లెనిన్‌బాబు 12వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న జోగి రమేశ్, జోగి రాము, శిబు, జినేశ్, దారబోయిన ప్రసాద్‌ను కోర్టులో బుధవారం హాజరుపరిచారు. నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు తోపాటు 12 మందిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. వారికి జనవరి 12వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. తనకు జైలులో సదుపాయాలు కల్పించాలని జోగి తరఫున న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో జోగికి నెల్లూరు జైలులో ఉన్నప్పుడు సదుపాయాల కల్పనకు ఇచ్చిన ఉత్తర్వులను విజయవాడ జిల్లా జైల్లో కూడా అమలు చేయాలని ఆదేశించారు.

'సీబీఐ' అంటూ ఫోన్ చేసి 1.23 కోట్లు కాజేశారు

▸▸ అద్దంకిలో రిటైర్డ్ జీఎంకు సైబర్ నేరగాళ్లు టోకరా

అద్దంకి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 'మేం సీబీఐ నుంచి ఫోన్ చేస్తున్నాం. మనీ ల్యాండరింగ్ కేసులో మీపై సుప్రీంకోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. బెయిల్ మంజూరు కావాలంటే డబ్బులు చెల్లించాలి' అని బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఓ రిటైర్డ్ జీఎం నుంచి రూ.1.23 కోట్లు కాజేశారు. దీనిపై బాధితుడు బుధవారం ప్రకాశం జిల్లా అద్దంకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అద్దంకి పట్టణంలోని ప్రముఖ ఆర్యవైశ్య నేత, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జీఎంగా పనిచేసి 20 ఏళ్ల క్రితం రిటైరైన ఎస్.నాగేశ్వరరావుకు మూడు వారాల క్రితం సీబీఐ అధికారులం అంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. మనీల్యాండరింగ్ కేసులో నిందితుడిగా ఉన్నావని, సుప్రీం కోర్టు, సీబీఐ నుంచి అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని, మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని బెదిరించారు. ఆ కేసులో బెయిల్ కావాలంటే కొంత మొత్తంలో డబ్బు తమ ఖాతాలో జమచేయాలని నమ్మబలికారు. విషయం బయటకు చెబితే అరెస్టు తప్పదని హెచ్చరించారు. దీంతో భయపడిపోయిన నాగేశ్వరరావు అద్దంకిలోని ఓ ప్రైవేట్ బ్యాంక్ నుంచి మూడు విడతలుగా రూ.1.23 కోట్లను వారి చెప్పిన ఖాతాలకు జమ చేశారు. మంగళవారం మరోసారి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారు. నాగేశ్వరరావు తన వద్ద లేవని చెప్పడంతో.. ఇల్లు అమ్మి అయినా సరే చెల్లించాల్సిందేనని బెదిరించారు. ఇప్పటికిప్పుడు ఇల్లు అమ్మటం సాధ్యం కాదని చెప్పినా వినలేదు. దీంతో ఎలాగూ విషయం బయటపడుతుందని భావించిన నాగేశ్వరరావు బంధువులు, కుటుంబ సభ్యులకు తెలిపారు. వారి సాయంతో పోలీస్ సైబర్ వింగ్ ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేశారు.

విద్యాప్రమాణాలే 'పీఎంశ్రీ' లక్ష్యం

▸▸ రాష్ట్రాల సీఎస్‌లతో ప్రధాని మోదీ 50వ వీడియో కాన్ఫరెన్సు

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రాయోజిత పీఎం శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. వివిధ జాతీయ ప్రాజెక్టులు, పీఎం శ్రీ తదితర అంశాలకు సంబంధించి బుధవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ప్రగతికి సంబంధించి 50వ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, జాతీయ విద్యా పాలసీ-2020కి అనుగుణంగా నమూనా పాఠశాలలుగా తీర్చిదిద్దడం, ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం.. పీఎం శ్రీ ప్రధాన లక్ష్యం.' అని మోదీ వివరించారు.

రాష్ట్రంలో 935 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక: సీఎస్

అనంతరం, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పీఎం శ్రీ పథకం కింద 935 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక కాగా వాటిని అన్ని విధాలా మెరుగైన రీతిలో అభివృద్ధి చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన, డిజిటల్ సాంకేతికతతో కూడిన విద్యను అందిస్తామని తెలిపారు.

ఒంటరి మహిళలే లక్ష్యంగా చోరీలు

▸▸ అంతర్రాష్ట్ర దొంగ యుగంధర్ అరెస్టు.. రూ.12 లక్షల సొత్తు స్వాధీనం

నూజివీడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉండే మహిళలే లక్ష్యంగా ఇల్లు అద్దెకు కావాలంటూ వస్తాడు.. మాటామాటా కలిపి మత్తు మందు కలిపిన తినుబండారాలిచ్చి చోరీలకు పాల్పడతాడు.. ఇలా దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరస్థుడు పబ్బరాజు వెంకట యుగంధర్‌ను నూజివీడు రూరల్ సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 149 గ్రాముల బంగారంతో పాటు నాలుగు సెల్‌ఫోన్‌లు, ఒక బైక్‌ను స్వాధీనపరుచుకున్నారు. ఆ వివరాలను ఏలూరు జిల్లా నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ వివరించారు.

రబీ.. కాస్త మెరుగు!

▸▸ సాగులోకి 12లక్షల హెక్టార్లు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రబీ సాగు కొంత మెరుగు పడింది. 20.70లక్షల హెక్టార్లలో 22 రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేయగా, గత 75 రోజుల్లో (బుధవారం నాటికి)11.99 లక్షల హెక్టార్లు సాగులోకి వచ్చింది. 2025లో మొంథా, దిత్వా తుఫాన్ల కారణంగా ఖరీఫ్(సార్వా) వరి కోతలు ఆలస్యం కావడంతో రబీ(దాళ్వా) నాట్లు ఆలస్యమైనాయి. దీంతో 7.45లక్షల హెక్టార్లలో వరి సాగులోకి రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3లక్షల హెక్టార్లలో నాట్లు పడ్డాయి.

ఈ-పంట ప్రక్రియ సరళీకరణ: అగ్రి డైరెక్టర్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఈ-పంట ప్రక్రియను సరళీకృతం చేయనున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జీలాని వెల్లడించారు. బుధవారం జాతీయ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, డిజిటల్ అగ్రికల్చర్ అధికారులతో ఈ-పంట యాప్ ఆధునికీకరణపై ఆయన చర్చించారు. ఈ-పంట యాప్ నవీకరణతో రైతులకు పూర్తి స్వేచ్ఛతో పంట వివరాలను పొలం భౌగోళిక హద్దుల పరిధిలోనే నమోదు చేసుకునే వెసులుబాటు ప్రస్తుత రబీ సీజన్ నుంచే అమలులోకి వస్తుందని తెలిపారు.

రైతుకు మరింత మంచి జరగాలి: మంత్రి అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడానికి కూటమి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర రైతాంగానికి మంత్రి శుభాకాంక్షలు తెలుపుతూ, 2026లో రైతులకు మరింత మంచి జరగాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా పంచసూత్రాలతో వ్యవసాయ రంగానికి పునర్జీవం లభిస్తుందని పేర్కొన్నారు. 2025లో అన్నదాత సుఖీభవ, వ్యక్తిగత యంత్రాలు, కిసాన్ డ్రోన్లు, సూక్ష్మసేద్య పరికరాలు అందజేశామని తెలిపారు.

ట్రైనీ పోలీసులకు భారీ ఊరట

స్టైపెండ్ రూ.4,500 నుంచి రూ.12వేలకు పెంపు

రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు కూటమి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. తొమ్మిది నెలల శిక్షణ కాలంలో చెల్లించే స్టైపెండ్‌ను నెలకు రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచుతూ హోంశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్ విడుదల చేసినా న్యాయ పరమైన చిక్కులు పరిష్కరించకుండా వదిలేసిన పరీక్ష ఫలితాలను కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు పరిష్కరించి విడుదల చేసింది. దీంతో ఎంపికైన 5751 మంది కొత్త కానిస్టేబుళ్లు డిసెంబరు 20 నుంచి రాష్ట్రంలోని డీటీసీలు, పీటీసీలు, బీటీసీల్లో శిక్షణకు చేరారు. ఈ సందర్భంగా మంగళగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్టైపెండ్ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో అక్కడికక్కడే రూ.12వేలకు పెంచుతూ సీఎం ప్రకటన చేశారు. ఆ మేరకు బుధవారం హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 21 కేంద్రాల్లో ప్రారంభమైన పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ సజావుగా జరుగుతోందని, 2, 3 రోజుల్లో అన్ని కేంద్రాల్లోనూ స్క్రీన్లు ఏర్పాటు చేసి నిపుణులతో ఆన్‌లైన్ ద్వారా క్లాసులు చెప్పిస్తామని పోలీస్ ట్రైనింగ్ విభాగం డీఐజీ సత్య యేసుబాబు తెలిపారు. ప్రతి అభ్యర్థినీ సైకో మెట్రిక్ అసెస్మెంట్ చేసి, అందుకు తగ్గట్టు శిక్షణ ఇచ్చి, పోలీసు శాఖకు నాణ్యమైన సేవలు అందించేలా తీర్చిదిద్దబోతున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల జోష్

కొత్త ఏడాది కానుకగా..

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా నెలనెలా పెన్షన్లు అందుకునే వివిధ వర్గాల ప్రజల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒకరోజు ముందుగానే అందించింది. వాస్తవానికి గురువారం (జనవరి 1న) ఇవ్వాల్సిన ఈ పింఛన్లను.. ఆ రోజు సెలవు కావడంతో ఒక రోజు ముందే బుధవారం పంపిణీ చేశారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 93.27 శాతం మంది లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 63.12 లక్షల పెన్షన్లకు గాను బుధవారం ఒక్క రోజే 58.87 లక్షల మందికి పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం పెన్షన్లు తీసుకోలేని లబ్ధిదారులకు రెండో తేదీన అందించనున్నారు.

లబ్ధిదారులకు సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు


పింఛన్లు అందుకున్న లక్షలాది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'కొత్త ఏడాది మీకు మంచి జరగాలని కోరుకుంటూ.. ఒక రోజు ముందుగానే పింఛను సొమ్ము అందిస్తున్నాం.' అని పేర్కొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామంలోని పల్ల వెంకన్న నర్సరీలో విరివినాలతో నూతన సంవత్సర కూర్పు చేశారు. కలిసి ఉంటే కలదు సుఖం అనే సందేశానికి నిదర్శనంగా ఈ కూర్పు చేశామని నర్సరీ నిర్వాహకులు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్ పేర్కొన్నారు.



కొత్త జిల్లా కల సాకారం

సందడిగా మార్కాపురం, పోలవరం జిల్లాల కార్యాలయాలు ప్రారంభం



మార్కాపురంలో కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాజాబాబు, మంత్రి స్వామి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం/ రంపచోడవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఆవిర్భవించిన మార్కాపురం, పోలవరం జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. బుధవారం మార్కాపురంలో తీన్‌మార్ మోతలు, డప్పు కళాకారుల కేరింతలు, కూటమి నేతల ఆహ్వానాలతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామికి, ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన ప్రకాశం కలెక్టర్ రాజాబాబుకు మార్కాపురం వాసులు పూలవర్షంతో స్వాగతం పలికారు. తమ కల సాకారమైన సమయమంటూ నినాదాలతో హోరెత్తించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం కోసం తర్లుపాడు రోడ్డులో గోగులదిన్నె గ్రామపరిధిలో వెలిగొండ ముంపు గ్రామం సుంకేసుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలో ఉన్న పాఠశాల భవనాల్లో ఉన్న గదులను కేటాయించారు. వీటికి రాత్రికి రాత్రే మరమ్మతులు చేశారు. జిల్లా కలెక్టర్ చాంబర్‌ను సిద్ధం చేశారు. ఆ చాంబర్‌లో రాజాబాబు, అలాగే డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్పీ కార్యాలయంలో ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ.. మార్కాపురం జిల్లా ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట ఇస్తే నెరవేరుస్తారనే నమ్మకాన్ని రుజువు చేసుకున్నారని అన్నారు. జిల్లా ఏర్పాటు చేయటమే కాకుండా జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. త్వరలోనే వెలిగొండ ప్రాజెక్ట్‌ను కూడా పూర్తి చేయటం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత మేలు చేస్తామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఏర్పాటు ద్వారా తన జన్మ ధన్యమైందని భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. జిల్లా కోసం గతంలో 63 రోజులు ఉద్యమం చేస్తే తమకు అడ్డంకులు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం జిల్లా ఏర్పాటు చేశారని, ఆయనకు జన్మజన్మలా రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో..

రంపచోడవరం కేంద్రంగా పోలవరం కొత్త జిల్లా కార్యాలయం రంపచోడవరంలోని యువజన శిక్షణా కేంద్రం(వైటీసీ)లో ప్రారంభమైంది. అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎస్పీగా అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ బాధ్యతలు స్వీకరించి జిల్లాలో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్‌గా అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ బాధ్యతలను చేపట్టారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా కలెక్టర్ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు.



రంపచోడవరంలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి తదితరులు

మోదీ, బాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఇచ్చినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆధ్వర్యంలో కూటమి పార్టీల నాయకులు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎన్టీరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాన్నే జిల్లాను చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లదని ఎమ్మెల్యే అన్నారు.

వసతి గృహాల్లో పిల్లల మరణాలు

చిన్న విషయం కాదు

(మొదటిపేజీ తరువాయి)

విఫలమయ్యారని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ హాస్టళ్లలో చోటుచేసుకున్న బాలబాలికల మరణాలు, ఏ కారణంతో వారు మరణించారు? అందుకు సంబంధించిన నివేదికలను తమ ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరణించిన బాలబాలికల తల్లిదండ్రులకు పరిహారం చెల్లించే విషయంలో నిర్దిష్ట విధానం ఏమైనా ఉందా? ఇప్పటివరకు ఎవరికైనా పరిహారం చెల్లించారా? పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సంక్షేమ హాస్టళ్లలో క్రమం తప్పకుండా నెలలో ఎన్నిసార్లు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలి? హెల్త్ క్యాంపులు ఏర్పాటుకు సంబంధించి కార్యాచరణ రూపొందించి, నివేదికను తమ ముందు ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను ఆదేశించింది. విచారణను జనవరి 21కి వాయిదా వేసింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ వివరాలను వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి దాఖలైన పిల్‌కు జత చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పరిధిలోని హైస్కూళ్లకు అనుబంధంగా ఉన్న బాలబాలికల వసతి గృహాలలో ఏఎన్ఎమ్/హెల్త్ వలంటీర్లను నియమించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ ఉత్తరాంధ్ర కమిటీ ఆఫ్ గిరిజన సంక్షేమ సంఘం ప్రతినిధి పలక రంజిత్‌కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. వసతి గృహాల్లో ఉంటూ మరణించిన పిల్లల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించేలా ఆదేశించాలని కోరారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో బాలబాలికల మరణాలు ఎక్కువయ్యాయన్నారు. వారిని పర్యవేక్షించేందుకు ఏఎన్ఎమ్‌లను నియమించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు వివిధ గిరిజన సంక్షేమ హాస్టళ్లలో 45 మరణాలు సంభవించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. 2025లో 2 మరణాలు సంభవించాయన్నారు. వివిధ సంక్షేమ హాస్టళ్లలో 2016-25 మధ్య 45 మంది మరణించారని పిటిషనర్ చెబుతున్నారని, ఏ కారణంతో వారు మరణించారు? వేరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉందని అన్నారు. విచారణ జరిపి నివేదికలు ఇస్తారని, వాటిని కోర్టు ముందు ఉంచుతామన్నారు.

కొత్త సంవత్సరం వేళ ప్రజలకు సర్కారు గిఫ్ట్

(మొదటిపేజీ తరువాయి)

వారిపై మోపకుండా ఉపశమనం కలిగించే నిర్ణయం తీసుకున్నారు.

రూ.12,771 కోట్లకు ప్రతిపాదిస్తే..

ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) 2019-20 నుంచి 2023-24 వరకు వినియోగదారులు వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన ట్రూ అప్‌పై ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం.. మూడు డిస్కంలు విద్యుత్ సరఫరాకు అయిన ఖర్చుకు.. ఆదాయానికి మధ్య వ్యత్యాసం రూ.12,771.96 కోట్లుగా పేర్కొన్నాయి. ఈ మొత్తంలో రూ.8,274.07 కోట్లను ఏపీఈఆర్సీ అనుమతించలేదు. ఇందులో క్యారీయింగ్ కాస్ట్ రూ.4,149.70 కోట్లు, ఇతర ఖర్చులు, బిల్ డిస్కౌంటింగ్, బ్యాడ్ డెట్స్, షార్ట్ టర్మ్ రుణాల వంటివి ఉన్నాయి. ఏపీఈఆర్సీ తిరస్కరించిన మొత్తం తర్వాత నికర ట్రూ అప్ రూ.5,933.44 కోట్లకు తగ్గింది. దీని నుంచి గత ఆదేశాల్లో సర్దుబాటు చేసిన రూ.1,435.55 కోట్లను కూడా తగ్గించిన తర్వాత నికర మొత్తం రూ.4,497.89 కోట్లుగా తేలింది. ఈ నికర ట్రూ అప్ మొత్తాన్ని డిస్కంల వారీగా విభజిస్తే.. ఏపీఎస్పీడీసీఎల్‌కు రూ.1,551.69 కోట్లు, ఏపీసీపీడీసీఎల్ రూ.1,163.05 కోట్లు, ఏపీఈపీడీసీఎల్‌కు రూ.1,783.15 కోట్లుగా ఉంది. నికర ట్రూఅప్ మొత్తాన్ని వినియోగదారులకు సర్దుబాటు చేస్తే వారిపై భారీ భారమే పడుతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ చార్జీలను పెంచకూడదని స్థిరచిత్తంతో ఉన్న ప్రభుత్వం ఆ మొత్తాన్ని తానే భరించేందుకు సిద్ధమైంది. ట్రూఅప్ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని బుధవారం ఏపీఈఆర్సీకి ప్రభుత్వ ఉన్నతాధికారులు లేఖ (ఈఎన్ఈ01/872/2025-పవర్1) రాశారు. దీంతో వినియోగదారులపై ఎలాంటి భారం పడకుండా, కరెంటు చార్జీలు పెంచకుండా ఉండడానికి అవకాశం లభించిందని ఏపీఈఆర్సీ వర్గాలు తెలిపాయి. డిస్కంలు ఈ మొత్తాన్ని ప్రభుత్వం నుంచి పొందాలని కమిషన్ ఆదేశించింది.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై వడ్డీ మాఫీ!

- 11,479 మంది ఎస్సీ యువతకు ప్రయోజనం

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా, ఎస్సీ యువత తీసుకున్న రుణాలపై వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన మొత్తం రూ.193.40 కోట్ల రుణంలో ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీల ద్వారా రూ.66.04 కోట్లు రుణాలందించారు. కొవిడ్ కారణంగా లబ్ధిదారులు సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో వడ్డీ భారంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 11,479 మంది ఎస్సీ లబ్ధిదారులు తీసుకున్న ఈ రుణాలపై ఆగస్టు 31, 2025 వరకు వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చెల్లించాల్సిన అసలును నాలుగు నెలల్లోపు చెల్లిస్తే ఈ వడ్డీ మాఫీ అవుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్ఎస్ఎల్వీ మూడో దశ గ్రౌండ్ పరీక్ష విజయవంతం

- అప్‌గ్రేడ్ చేసిన వెర్షన్‌ను పరీక్షించిన ఇస్రో

బెంగళూరు, డిసెంబరు 31: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్వీ)కి మూడో దశ మోటార్‌కు గ్రౌండ్ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ ఫెసిలిటీ సెంటర్‌లో మంగళవారం ఈ పరీక్ష నిర్వహించినట్టు ఇస్రో వెల్లడించింది. ఎస్ఎస్ఎల్వీ అనేది చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించేందుకు ఇస్రో అభివృద్ధి చేసిన రాకెట్. పూర్తి ఘన ఇంధనంతో నడిచే ఈ రాకెట్‌లో మూడు దశలు ఉంటాయి. రాకెట్ అగ్రభాగాన ఉండే మూడో దశ పేలోడ్‌ను వేగంగా అంతరిక్షంలోకి పంపేందుకు ఉపయోగపడుతుంది. ఇది సెకనుకు 4 కి.మీ. వేగాన్ని అందిస్తుంది. ప్రస్తుతం మూడోదశకు చేసిన అప్‌గ్రేడ్లు మెరుగైన ఇగ్నైటర్, నాజిల్ డిజైన్, అధిక పేలోడ్‌ను మోయగలిగే సామర్థ్యాలను పెంచాయని పేర్కొంది. అదనంగా మరో 90 కేజీల పేలోడ్‌ను సైతం మోసుకెళ్లే సామర్థ్యం పెరిగిందని తెలిపింది. 108 సెకన్లపాటు సాగిన ఈ పరీక్షలో అన్ని పారామితులు అంచనాలకు అనుగుణంగా ఉన్నాయని ఇస్రో వెల్లడించింది. ఈ పరీక్ష విజయవంతం కావడంతో రాకెట్‌లోని ఎస్ఎస్3 మోటార్ మెరుగైన వెర్షన్ వినియోగించడానికి అర్హత సాధించిందని పేర్కొంది.



జలవనరుల శాఖపై సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

జనవరి తొలి వారంలో వెలిగొండకు సీఎం

పోలవరం పనులు 18 నెలల్లో 13% పూర్తి

- నిర్వాసితులకు రూ.1,894 కోట్లిచ్చాం
- ఆ ఐదేళ్లలో ప్రాజెక్టును జగన్ నాశనం చేశారు: నిమ్మల

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త ఏడాది తొలి వారంలో వెలిగొండ ప్రాజెక్టును సందర్శించనున్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలిస్తారని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. బుధవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ పనుల ప్రగతిపై ఆయన ప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. రూ.456 కోట్లతో చేపట్టే ఫీడర్ కెనాల్ పనులను ప్రారంభిస్తారన్నారు. ఇంకోవైపు.. పోలవరం ప్రాజెక్టు పనులను గత 18 నెలల్లో 13 శాతం పూర్తి చేశామని, ఇప్పటికి 87 శాతం పూర్తయిందని నిమ్మల వెల్లడించారు. పనులు శరవేగంగా చేస్తున్నా కళ్లున్న కబోధి, మాజీ సీఎం జగన్‌కు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విమర్శలు చూస్తుంటే.. దొంగే దొంగా దొంగా అని అరుస్తున్నట్లుగా ఉందన్నారు. ఆయన సీఎంగా ఉన్న ఐదేళ్లలో నిర్లక్ష్యం వహించడంతో డయాఫ్రం వాల్ దెబ్బతిందని, గైడ్‌బండ్ కుంగిపోయిందని, కాఫర్ డ్యాంలలో సీపేజీ వచ్చిందని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టును విధ్వంసానికి గురి చేసి.. ఇప్పుడు నిధులు వ్యయం చేయడం లేదంటూ తన పత్రికలో రాసుకుంటున్నారని ధ్వజమెత్తారు. వాస్తవానికి పోలవరం పనులు పరుగులు పెడుతున్నాయని.. డయాఫ్రం వాల్ పనులు 83 శాతానికి పైగా పూర్తయినట్లు చెప్పారు. నిర్వాసితులకు రూ.1,894 కోట్లు విడుదల చేశామని గుర్తుచేశారు. 2027 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని నిమ్మల స్పష్టంచేశారు.

పోలవరానికి మళ్లీ విదేశీ నిపుణులు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుకుంటున్న సమయంలో వాటిని పరిశీలించడానికి విదేశీ నిపుణులు మరోసారి రానున్నారు. డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి.సిస్కో (అమెరికా), రిచర్డ్ డొనెల్లీ, సీన్ హిన్స్‌బెర్గర్ (కెనడా) జనవరి 19వ తేదీన భారత్‌కు వస్తున్నారు. గతంలో హైదరాబాద్ నుంచి రాజమండ్రి చేరుకునేవారు. ఈసారి నేరుగా ఢిల్లీలోనే దిగి పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఉన్నతాధికారులతో కలసి కేంద్ర జల సంఘం, కేంద్ర జలశక్తి శాఖ అధికారులతో సమావేశం కానున్నారు. అనంతరం హైదరాబాద్ చేరుకుని.. అక్కడి నుంచి రాజమహేంద్రవరానికి పీపీఏతో కలిసి వస్తారు. ప్రాజెక్టు పరిధిలో 20 నుంచి 22 దాకా మూడు రోజుల పాటు ఉంటారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పురోగతి, నాణ్యతా ప్రమాణాలు, డిజైన్ల మేరకే పనులు పూర్తవుతున్నాయా.. నిపుణుల సూచన మేరకే ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగిస్తున్నారో లేదో స్వయంగా తెలుసుకుంటారు. గమనించిన అంశాలను తొలుత ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టు సంస్థకు, పీపీఏకి అక్కడే తెలియజేస్తారు. తర్వాత తిరిగి ఢిల్లీ వెళ్లి జల సంఘం, జలశక్తి శాఖ అధికారులతో భేటీ అవుతారు. పోలవరం పనుల తీరును కూలంకషంగా వివరిస్తూ నివేదిక సమర్పిస్తారు. ఇది దాదాపు తుది నివేదిక కావడంతో.. నిపుణుల పర్యటనను కేంద్రం, రాష్ట్రం రెండూ అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తున్నాయి.

పేదల బియ్యంతో మిల్లర్ల మాయ

(మొదటిపేజీ తరువాయి)

ఎదిగారు. అయినా.. ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు పట్టించుకోకుండా చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదాహరణకు తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని విజయశ్రీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం.... ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ కార్యకలాపాల కోసం పెరవలిలోని శ్రీ మారుతి రైస్ ప్రోడక్ట్స్, శ్రీ విజయ సత్యదేవ ట్రేడర్స్ (రైసు మిల్లులు) పేర్ల మీద బ్యాంక్ గ్యారంటీ కట్టి పౌరసరఫరాల సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది. 'విజయశ్రీ'కి తూర్పుగోదావరి జిల్లా నుంచి 6,046 టన్నులు, అల్లూరి జిల్లా నుంచి 407 టన్నులు, కృష్ణా జిల్లా నుంచి 850 టన్నులు కలిపి...మొత్తం 7,305 టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం పౌరసరఫరాల సంస్థ కేటాయించింది. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని స్వీకరించిన తేదీ నుంచి వారం రోజుల్లోపు మిల్లింగ్‌ను ప్రారంభించి.. రెండు నెలల్లోపు కస్టమ్ మిల్లింగ్‌ను పూర్తి చేసి 67 శాతం బియ్యాన్ని ప్రభుత్వానికి సీఎంఆర్‌గా అందజేయాలి. అయితే ప్రభుత్వం నుంచి మొత్తం 7,305 టన్నుల ధాన్యాన్ని తీసుకున్న 'విజయశ్రీ'.. ఇప్పటివరకు కేవలం 1,071 టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి డెలివరీ ఇచ్చింది. ఈ కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను పీడీఎస్ అవసరాల కోసం నిల్వ చేయడానికి తాడేపల్లిగూడెం సమీపంలోని పెన్నాడలో ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్(బఫర్ స్టోరేజ్ కాంప్లెక్స్)కు తరలించారు.

87 టన్నుల బియ్యం వెనక్కి...

పెన్నాడలో ఉన్న భారత ఆహార సంస్థ గోడౌన్‌కు తరలించిన బియ్యాన్ని పరిశీలించిన ఎఫ్‌సీఐ అధికారులు నివ్వెరపోయారు. అవి తాజాగా మిల్లింగ్ చేసిన బియ్యం కాదని గుర్తించారు. పైగా ఆ ముడి బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌తోపాటు పురుగులు ఉన్నట్టు కనుగొన్నారు. మిక్స్‌డ్ ఇండికేటర్ మెథడ్ (ఎంఐఎం) పరీక్షలో కూడా ఆ బియ్యం విఫలం కావడంతో.. మొత్తం 3 ఏసీకేల (87 టన్నులు) బియ్యాన్ని తిరస్కరించారు. మిల్లర్లు నాన్ ఫోర్టిఫైడ్ సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే డెలివరీ చేయాల్సి ఉండగా, విజయశ్రీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ డెలివరీ చేసిన సీఎంఆర్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయి. దీంతో రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేసి సీఎంఆర్‌గా డెలివరీ చేస్తున్నట్లు ఎఫ్‌సీఐ అధికారులు తేల్చారు. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా.. పురుగులు పట్టిన పాత రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి.. వాటినే నేరుగా ప్రభుత్వానికి ఈ ఖరీఫ్ సీజన్‌లో సీఎంఆర్‌గా డెలివరీ చేసినట్లుగా నిర్ధారించారు. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం నిబంధనలు, షరతులను ఉల్లంఘించడమనేది భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టం సెక్షన్ 318 కింద 'దుష్ప్రవర్తన' నేరానికి పాల్పడినట్టు. దీని ప్రకారం, సదరు మిల్లర్‌ను ఐదు సంవత్సరాలపాటు బ్లాక్‌లిస్టులో ఉంచడంతోపాటు క్రిమినల్ చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసినట్లు తేలితే బ్యాంక్ గ్యారంటీని కూడా ప్రభుత్వం జప్తు చేస్తుందని తెలిపారు. ఈ వివరాలన్నింటినీ పొందుపరుస్తూ ఏలూరు ఎఫ్‌సీఐ డీఎం ఇచ్చిన నివేదిక ఆధారంగా తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్.. విజయశ్రీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఎఫ్‌సీఐకి సీఎంఆర్ డెలివరీని నిలిపివేయాలని ఆదేశించారు.

అంతటా ఇదే తంతు...

రేషన్ బియ్యాన్ని రైసుమిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి.. మరోసారి పాలిష్ పట్టించి, సీఎంఆర్ కింద రీసైక్లింగ్ చేయడమనేది ఏళ్లతరబడి అనేక మిల్లుల్లో యథేచ్ఛగా కొనసాగుతోంది. వరి ఎక్కువగా సాగుచేసే తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతోపాటు ఇటు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల తదితర జిల్లాల్లోని పలువురు రైసు మిల్లర్లు ఎడాపెడా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ కార్డుదారుల నుంచి కేజీ పది రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో రైసుమిల్లులకు తరలించి రీసైక్లింగ్ చేస్తూ రూ.కోట్లలో లాభాలు ఆర్జిస్తున్నారు.

నిబంధనలను అమలు చేసేవారేరీ?

రాష్ట్రంలో ప్రజాపంపిణీ, ఇతర సంక్షేమ పథకాలకు అవసరమైన బియ్యాన్ని ఇంతకు ముందు మిల్లర్లు, వ్యాపారుల నుంచి ప్రభుత్వం లెవీ కింద సేకరించేది. ఈ విధానం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో.. కేంద్రం సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. రైతులకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) నిర్ణయించి, మిల్లర్లు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలే ధాన్యాన్ని సేకరించేలా కఠినమైన నిబంధనలు విధిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ధాన్యం సేకరణలో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా రైతులకు మేలు చేయడం దీని లక్ష్యం. ఈ క్రమంలో పలు నిబంధనలను జారీ చేసింది. అయితే.. ఈ నిబంధనలు అమలు చేసేవారు లేకపోవడంతో రైతులకు న్యాయం జరగడం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది.

గన్నీలపై మిల్లు కోడ్

రైసు మిల్లుల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని మాత్రమే కస్టమ్ మిల్లింగ్‌కు ధాన్యాన్ని కేటాయించాలి. అది కూడా సార్టెక్స్, బ్లెండింగ్ యంత్రాలు ఏర్పాటు చేసిన మిల్లులకు మాత్రమే సీఎంఆర్ ఇవ్వాలి. ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీలను సమీకరించే బాధ్యతలను జిల్లా రైసు మిల్లర్స్ అసోసియేషన్‌లకు అప్పగించాలని కేంద్రం పేర్కొంది. ప్రతి గోనెసంచిపై సంబంధిత మిల్లు కోడ్‌ను ముద్రించాలి. ఒకసారి ఉపయోగించిన గన్నీలనే మళ్లీ మళ్లీ వినియోగించకుండా వాటి నాణ్యతను ఎక్కడికక్కడ సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు నిత్యం పరిశీలించాలి.

బ్యాంకు గ్యారంటీ సైతం జప్తు

సీఎంఆర్ రైస్‌ను సకాలంలో అందించడంలో విఫలమైన మిల్లర్లకు పెనాల్టీ విధించడంతోపాటు ప్రభుత్వానికి జరిగిన నష్టం, బకాయిలు మొత్తాన్ని రికవరీ చేయాలి. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే మిల్లర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలి. సీఎంఆర్ బకాయిలకు సమానమైన జరిమానా విధించాలి. వారి బ్యాంకు గ్యారంటీని జప్తు చేయాలి. ఈ నేరాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఈ నిబంధనలను అమలు చేసేవారు లేక.. మిల్లర్లు, దళారుల దందాలు సాగుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.


పింఛను పంపిణీ చేస్తున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర


పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి


పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, కూటమి నేతలు

ఎన్టీఆర్ భరోసా పింఛను పేదలకు కొండంత భరోసా

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అంది స్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ వారికి కొండంత భరోసానిస్తుందని నగర మే యర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం నగరంలోని 37వ డివిజన్‌లోని రామన్న పేట, 33వ డివిజన్‌లోని బ్రాడీపేట ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా తమ ఉనికిని కాపాడుకోవ డానికే వైసీపీ నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారు తప్ప, వారికి నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని కోవెలమూడి రవీంద్ర విమ ర్శించారు. వైసీపీ నాయకులు శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంపై మంగళ వారం పత్రికాముఖంగా చేసిన ఆరోప ణలను మేయర్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసి అడ్డుకోవాలని చూసినా, శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం నిర్దేశిత సమయానికి పూర్తి చేస్తామ ని స్పష్టం చేశారు.

● నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే రామాంజనేయులు గుంటూరు రూరల్ మండలంలోని గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదిం చారని, సభ్యులు అభిప్రాయాలు తీసుకున్న అనంతరం ఈ 11 గ్రామాలతో పాటు నగరానికి దగ్గరగా ఉన్న మరో 7 గ్రామాలను కలిపి మొత్తం 18 గ్రామా లను విలీనం చేయుటకు మెజారిటీ సభ్యు లు ఆమోదం తెలిపారన్నారు.

అర్హులందరికీ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని నేతాజీ నగర్లో బుధవారం ఆమె పింఛన్లు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మొదటి నెల నుంచే ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందజేస్తున్నామన్నారు. పండుగలు, సెలవుదినాలు ఉంటే ఒకరోజు ముందే పింఛన్లు అందించి లబ్ధిదారులకు రెట్టింపు సంతోషాన్ని పంచుతున్నామ న్నారు. నియోజకవర్గంలో 21వేల మందికి వివిధ కేటగిరీల్లో పింఛన్లు అందిస్తున్నామ న్నారు.

పింఛనుదారులకు ముందుగానే పండుగ : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పింఛనుదారులకు ఒకరోజు ముందుగానే పం డుగ వచ్చిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని అలీ నగర్‌లో బుధవారం ఆయన పింఛన్లు అందజేశారు. ప్రజలకు ముందస్తు నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛనుదారులకు మంచి రోజులు వచ్చాయని అన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఈ నూతన సంవత్సరం ప్రతిఒక్కరి జీవితంలో కొత్త అధ్యాయానికి ఆరంభం కావాలని ఎమ్మెల్యే నసీర్ ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధించాలని, విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

పేదలకు పింఛన్‌తో ఆర్థిక భరోసా

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఎటువంటి జాప్యం లేకుండా వేకువజామునే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్టు టీడీపీ జిల్లా అధ్య క్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. స్థానిక గోరం ట్లలో బుధవారం జరి గిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియో గించుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో కూటమి ప్రభుత్వం మరి న్ని సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్తా మని అన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీని విజ యవంతం చేసిన కూటమి కార్యకర్తలు, నాయకులు, అధికారులను అభినందిస్తున్నట్టు చెప్పారు. గోరంట్ల పీఏసీ ఛైర్మన్ ఘంటసాల సోమశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో ఎర్రంశెట్టి రాజేష్, ఎర్రంశెట్టి వేణుగోపాల్, నాగయ్య, శ్రీనివాసరావు, చిల్లర రాం బాబు, చంటి, కార్పొరేటర్ ఎర్రంశెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


పెన్షన్ పంపిణీ చేస్తున్న పిల్లి మాణిక్యరావు, వడ్రాణం హరిబాబు తదితరులు

నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా పర్యవేక్షించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా ఇంజనీ రింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కేవీపీ కాలనీ, కోదండరామయ్యనగర్, ఇన్నర్ రింగ్‌రోడ్ తదిత ర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో కార్పొరేటర్ ఎన్.బాలాజీ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ శాంతి కళ, ఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ, డీఈఈలు వెంకటరమణ, రమేష్, ఎస్ఎస్‌లు ఐజాక్, సాంబయ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

బేకరీలపై లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): నూత న ఏడాది ప్రారంభం నేపథ్యంలో జాయింట్ కంట్రోలర్ ఎంఎన్ఎస్ మాధురి ఆదేశాల మేరకు బుధ వారం నగరంలో బేకరీలు, స్వీట్ షాపులపై లీగల్ మెట్రాలజీ శాఖ అధికా రులు దాడులు చేపట్టా రు. తూకంలో మోసాలు, ఎమ్మార్పీల ధరలపై ప్రత్యేక తనిఖీలు నిర్వ హించారు. కేక్‌ల తూకాలలో జరుగుతున్న మోసాలను గుర్తించి 12 బేకరీలపై, ఎమ్మార్పీ ధర ముద్రించకుండా విక్రయించడంపై 9 స్వీట్ షాపులపై అధికారులు కేసులు నమోదు చేశారు. తనిఖీలలో డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాదు, అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య, తనిఖీ అధికారి సునీల్‌రాజా తదితరులు పాల్గొన్నారు.


బేకరీలలో దాడులు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

జిల్లా ఏపీజీఈఏ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర కార్యాలయంలో గుంటూరు జిల్లా నూతన ఏడాది క్యాలెండర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి నాగసాయి, రాష్ట్ర ఉపాధ్యక్షు డు వెంకటేశ్వర రెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, నాగేశ్వరరావు, గుంటూరు నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కరీముల్లా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


నూతన ఏడాది క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర నాయకులు

సీతారామయ్య హైస్కూల్లో న్యూఇయర్

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్య క్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, ప్రదర్శించి అందరినీ అలరించారు.

ఈ సందర్భంగా పాఠశాల గౌరవాధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని కోరుకున్నారు. పాఠశాల కరెస్పాండెంట్, సెక్రెటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన సంవత్సరాన్ని ఆశావహంగా స్వాగ తించి, లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, సీనియర్ కోఆరి ్డనేటర్ ఘట్టమనేని రాధా మాధవి, ప్రైమరీ కోఆర్డినేటర్ సయ్యద్ దిల్ జహన్, ప్రీ-ప్రై మరీ కోఆర్డినేటర్ తిరువీధుల శ్రీదేవి, ఇన్‌చార్జి కొమ్మినేని హరిప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సీతారామయ్య హైస్కూల్లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న పాఠశాల సెక్రెటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్, అధ్యాపకులు తదితరులు

డ్రగ్స్ వినియోగం మానవ మనుగడకే ముప్పు

● వెస్ట్ డీఎస్పీ అరవింద్

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగం మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతోందని వెస్ట్ డీఎస్పీ అరవింద్ అన్నారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని టీజేపీఎస్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌తో చిక్కితే 10 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. గంజాయి లేదా డ్రగ్స్ గురించి సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1972కు తెలియ జేయాలని డీఎస్పీ అరవింద్ ప్రజలను కోరారు. ప్రముఖ డాక్టర్ మండవ శ్రీనివాసరావు మాట్లాడుతూ, గంజాయిని ఆరు నెలల పాటు సేవిస్తే నరాల బలహీనత ఏర్పడుతుందని, ఏడాది పాటు వినియోగిస్తే పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సైలు రామాంజనేయులు, తరంగిణి, టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వర శాస్త్రి, కళాశాల యాజమాన్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ కోటేశ్వరరావుకు ఘన సన్మానం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖలో 42 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పాటు సేవ లందించి బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై ఎం కోటేశ్వర రావును పోలీసు అధికారులు ఘనంగా సన్మా నించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాల యంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ రమణమూర్తి, పోలీస్ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, ఈస్ట్ ట్రాఫిక్ ఎస్సై వెంకటాద్రి, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, రాష్ట్ర మాజీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ ఎస్సై శివ ప్రసాద్, ఇతర పోలీస్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి పురస్కారం

గుంటూరు(విద్య), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి ఎన్ఎస్ఎస్ ఉత్తమ నిర్వహణ అధికారి పురస్కారం లభించింది. ఈ మేర కు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ప్రదానం చేసే యూనివర్సిటీ స్థాయి పురస్కారానికి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరుకు చెందిన తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ధాత్రికుమా రిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న కుమారి, తదితరులు ఆమెను అభినందించారు.

విదేశీ మద్యం స్వాధీనం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విదేశీ మద్యాన్ని స్వాధీనపరచుకున్నట్టు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తెలిపారు. ఎక్సైజ్ అధికారుల సమాచారం మేరకు ఇన్నర్ రింగురోడ్డులోని చిల్లీస్ దాబా వద్ద నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ (విదేశీ మద్యం) కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తులు ఆ మద్యాన్ని చెన్నై పోర్టు నుంచి గుంటూరుకు తీసుకువచ్చినట్టు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎస్‌టీఎఫ్ సీఐ నయనతార, ఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు శ్రీను, రమేష, నాంచారయ్య, చైతన్య పాల్గొన్నారు.

పవిత్రమైనది ఉమ్రా యాత్ర

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఉమ్రా యాత్ర ఎంతో పవి త్ర మైనదని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ అన్నారు. గుంటూరు నుంచి ప్రత్యే క ట్రావెల్స్‌లో ఉమ్రా యాత్రకు వెళుతున్న 40 మంది ముస్లింలకు పాతగుంటూరులోని తన కార్యాలయంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేసి యాత్రికులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలు జీవితంలో ఒకసారైనా హజ్, ఉమ్రా యాత్ర చేయాలని భావిస్తారని, ఈ యాత్ర ఎంతో పరమ పవిత్రమైనదన్నారు. 15 రోజులు పాటు సాగే ఈ యాత్రలో ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

గుంటూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): లాలాపేటలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మంది దంపతులతో సామూహిక వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నసంతర్ప ణ కార్యక్రమం జరిగింది. లింగంశెట్టి మాట్లాడుతూ శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వారి సామూహిక వ్రతాలు నిర్వహించటం శుభసూచికమన్నారు. కార్యక్రమంలో శ్రీ అభయాంజనే య స్వామి వారి కమిటీ సభ్యులు ఉన్నారు.

అక్రమ కేసులు అన్యాయం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై రౌడీషీట్‌ను తెరవడం అప్రజాస్వామికమని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయ కులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులను నిరసిస్తూ బుధవారం స్థానిక కొత్తపేట, భగత్‌సింగ్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని విద్యార్థులు, నాయకులు వినూత్న నిరసన కార్యక్రమం నిర్వ హించారు. కేసులను ఎత్తివేయకపోతే ప్రత్యక్ష అందోళనలకు దిగు తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో జంగాల చైతన్య, వలీ, యశ్వంత్, అమర్‌నాథ్, అజయ్, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జిపై ఆగిన లారీ, నిలచిన వాహనాలు

కంకరగుంట బ్రిడ్జి మీద ట్రాఫిక్ జామ్

బుధవారం సాయంత్రం సబ్సిడీ బియ్యం రేషన్ షాపులకు తీసుకెళ్తున్న లారీ కంకర గుంట ఓవర్ బ్రిడ్జి మీదకు రాగానే డీజిల్ అయిపోయి బ్రిడ్జిపై ఆగిపోయింది. బ్రిడ్జి మీద వచ్చే వాహనాలు అటు ఇటు కిలోమీటర్ మేర వాహనాలు ఆగిపోయాయి. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)


గుంటూరు వసంతరాయపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆరాధన ప్రార్థన కూడికలో బుధవారం అర్ధరాత్రి కేక్ కట్ చేసి తినిపిస్తున్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

ఐజీ న్యూ ఇయర్ వేడుకలు

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈగల్ చీఫ్ ఐజీ రవికృష్ణ నూతన సంవత్సర వేడుకలను మంగళగిరిలోని డీఅడి క్షన్ సెంటర్‌లో జరుపుకున్నారు. మత్తు బానిసత్వం నుంచి స్వాతంత్ర్యం వచ్చిందని, 2026లో కొత్త ఆశను సృష్టిస్తూ ఈగల్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ప్రారంభమైందన్నారు.

ఐజీ ఆకే రవికృష్ణ కళాశాలలో ఇచ్చిన ప్రసంగం ద్వారా ప్రేరణ పొందిన విద్యార్థిని మత్తు కు బానిసైన తన తమ్ముడిని ఆ బారి నుంచి విడిపించేందుకు తన తల్లికి చెప్పి 1972 కు సమాచారం అందించింది. వారు బాలుడిని ఎన్నారై ఆసుపత్రిలోని డీఅడిక్షన్ సెంటర్లో చేర్పించారు. ఐజీ ఆ బాలుడిని కలుసుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.